తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం 10.08.2026 | సంపుటి : 13 సంచిక : 21 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




## మమత బెనర్జీ కాన్వాయ్‌పై రాళ్లదాడి

టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తుండగా ఘటన



- కారును అడ్డుకుని బురద, చెప్పులు, రాళ్లతో దాడి
- రాష్ట్రం గూండాల చేతుల్లోకి వెళ్లిపోయింది
- ఘటనను తీవ్రంగా ఖండించిన మమతా బెనర్జీ

"నా కారుపై చెప్పులు, బురద విసిరారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. నా తల పగిలిపోయి ఉండేది. నేను ఇక్కడే చనిపోయి ఉండేదాన్ని. ఇది ముమ్మాటికీ కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే చెప్పాను. అయినప్పటికీ.. ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. నన్ను లక్ష్యంగా చేసుకునేందుకు కొత్త ప్రభుత్వంలో గూండాలు రాజ్యమేలుతున్నారు. మాపై దాడి చేయడానికి వారిని రాష్ట్ర ప్రభుత్వం వాడుకుంటోంది. ఇది మూమ్మాటికీ ప్రణాళిక ప్రకారం జరిగిన దాడి" - మమత

కోల్‌కతా(జనంసాక్షి):పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి చేదు అనుభవం ఎదురైంది. ఉత్తర 24 పరగణాల జిల్లాలోని ఓ టీఎంసీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న ఆమె వాహనాన్ని నిరసనకారులు చుట్టుముట్టారు. ఆమెకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతటితో ఆగకుండా.. దీదీ కారుపై బురద చల్లడంతోపాటు చెప్పులు, రాళ్లు విసిరినట్లు తెలుస్తోంది. ఈ ఘటనను మమతా బెనర్జీ తీవ్రంగా ఖండించారు. రాష్ట్రం గూండాల చేతుల్లోకి వెళ్లిపోయిందని మండిపడ్డారు.బిర్జూ అనే టీఎంసీ కార్యక ర్తను ఇటీవల పోలీసులు అరెస్టు చేశారు.

మిగతా 2లో..


మమత కారుపై దాడి చేస్తున్న దృశ్యం

## పెద్దిసుదర్శన్ కుటుంబానికి బీఆర్‌ఎస్ అండగా ఉంటుంది

మాజీ ఎమ్మెల్యే కుటుంబానికి కేసీఆర్ పరామర్శ


ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయం చెక్కును అందిస్తున్న మాజీ సీఎం కేసీఆర్

**వరంగల్ ప్రతినిధి/ నర్సంపేట(జనంసాక్షి):**బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ వరంగల్ జిల్లా నల్లబెల్లిలో పర్యటించారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దశదినకర్మ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. సుదర్శన్‌రెడ్డి కుటుంబసభ్యులను కేసీఆర్ పరామర్శించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుని కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు. సుదర్శన్ అత్యంత సాదాసీదా జీవితం గడిపారన్నారు. కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా పార్టీ తరపున రూ.2.25 కోట్ల ఆర్థిక సహాయం చెక్కును కుటుంబసభ్యులకు కేసీఆర్ అందజేశారు. అంతకుముందు బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు వరంగల్ జిల్లా పర్యటనలో అడుగడుగునా టిఆర్ఎస్ శ్రేణులు కార్యకర్తలు, ప్రజలు స్వాగతం పలికారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి పదవరోజు కార్యక్రమంలో భాగంగా బిఆర్ఎస్ నేత కెసిఆర్ నల్లబెల్లి పర్యటనలో భాగంగా పెద్ది స్వగృహానికి పరామర్శించే క్రమంలో ఎర్రవల్లి క్షేత్రం నుండి కేసిఆర్ కు అడుగడుగునా స్వాగతం పలికారు హనుమకొండ. వరంగల్ మీదుగా నల్లబెల్లి గ్రామానికి పర్యటనలో భాగంగా వేలాదిమంది కార్యకర్తలు బిఆర్ఎస్ కార్యకర్తలు రోడ్లమీద బారులు తీరి అధినేత కోసం ఉదయం 10 నుండే వేచి చూశారు. పరకాల నియోజకవర్గం నర్సంపేట నియోజకవర్గం పర్యటన

మిగతా 2లో..



## వర్షాల కోసం నేడు వరుణయాగం

కార్యక్రమానికి హాజరు కానున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):** సాగర్ విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో యాగం జరుగనుంది.మధ్యాహ్నం 3 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం.2.45 గంటలకు నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌కు చేరుకోని, అక్కడి నుంచి విజయ్ విహార్ టూరిజం గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో జరిగే యాగం వద్దకు చేరుకోనున్న సీఎం.యాగం ముగిసిన అనంతరం 4 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరనున్న ముఖ్యమంత్రి.108 మంది రుత్వికులతో, 11 హోమగుండాలతో విజయ్ విహార్‌లో వరుణ యాగం.యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో వరుణయాగం.కృష్ణా, గోదావరి పరీవాహక ప్రాంతాల్లో సమృద్ధిగా వర్షాలు కురవాలని సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని తలపెట్టనుంది.

మిగతా 2లో..


యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.54 కోట్లు విలువైన..

## డ్రగ్స్ స్వాధీనం

**బీబీనగర్(జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లాలో భారీగా డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. బీబీనగర్ మండలం కొండమడుగు వద్ద ముఠా నుంచి రూ.54 కోట్లు విలువచేసే 27 కిలోల మెఫిడ్రిన్, 40 కిలోల అసిటోన్ లిక్విడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ముఠాలో ఉన్న నలుగురిని అరెస్ట్ చేయగా.. పరారీలో ఉన్న మరికొందరి కోసం పోలీసులు గాలింపు కొనసాగిస్తున్నారు. అరెస్టయిన వారిలో చేతన్ మధుకర్, ముజామిల్ హక్, అశోక్ గవాండే, రమణమూర్తి ఉన్నారు. ఎండీ అయూబ్, ప్రదీప్ ఠాకూర్,

మిగతా 2లో..

## భాష, సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

కొమురం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలి

- ఆదివాసీ యువత విద్య, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి
- అశ్వారావుపేటలో కొమరంభీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క



**భద్రాద్రికొత్తగూడెం(జనంసాక్షి):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ (సీతక్క) హాజరయ్యారు. జిల్లాకు విచ్చేసిన మంత్రి సీతక్కకు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డాన్స్‌లతో ఆదివాసీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు ఆదివాసీ ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా అశ్వారావుపేట ప్రధాన కూడలికి చేరుకున్నారు.అశ్వారావుపేట ప్రధాన కూడలిలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి

మిగతా 2లో..

## రాష్ట్రంలో మావోయిస్టులు లేరు

ఇక డ్రగ్స్, సైబర్‌క్రైమ్ పైనే దృష్టి

- ఇందుకోసం పోలీసు వ్యవస్థలో సంస్కరణలు తీసుకొస్తాం
- నియంత్రణకు బహుముఖ వ్యూహాలు అనుసరించాలి
- మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్‌లోనూ మార్పులు అవసరం
- ప్రాథమిక పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి:డీజీపీ సీవీ ఆనంద్



**వరంగల్ బ్యూరో,కాజీపేట ఆగస్టు 9(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో సవాల్‌గా మారిన డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణకు పలు సంస్కరణలు చేపడుతున్నామని రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా నిట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూడీజీపీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లాల పర్యటన చేస్తున్నానని సీవీ ఆనంద్ తెలిపారు. గతంలో వరంగల్ రూరల్ ఏసీపీగా పనిచేసిన తనకు ఈ ప్రాంతంతో ఎన్నో మంచి జ్ఞాపకాలు ఉన్నాయని గుర్తుచేసుకున్నారు. 30 ఏళ్ల క్రితం నక్సల్స్ ప్రభావం తీవ్రంగా ఉండేదని, ప్రతి గ్రామంలో సుమారు 50 మంది సాయుధ మిలిటెంట్లు ఉండేవారని తెలిపారు. ల్యాండ్‌మైన్ దాడులు కూడా జరిగేవని చెప్పారు. ప్రస్తుతం నక్సల్స్, మావోయిజం ప్రభావం లేదని, పోలీసుల కూంబింగ్ ఆపరేషన్లతో మంచి ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. బస్తర్, కర్రిగుట్ట ప్రాంతాల్లో ప్రధాన నాయకులు లొంగిపోయారని తెలిపారు.లొంగిపోయిన మావోయిస్టులు, జనజీవన స్రవంతిలో కలిసిన వారికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని డీజీపీ చెప్పారు. సోమవారం రోజున ములుగులో లొంగిపోయిన మావోయిస్టులతో ఆరోగ్య కార్డులు, ఇతర సౌకర్యాల కల్పనపై చర్చిస్తామని తెలిపారు. మావోయిస్టుల దాడుల్లో మరణించిన వారి కుటుంబాలకు భూమి కేటాయింపు, ఇతర సమస్యల

మిగతా 2లో..


మొజ్తబా ఆరోగ్యంపై వార్తలు..

## సుప్రీం లీడర్ క్షేమమే..

ఆయన ఆరోగ్యంగానే ఉన్నారు • వీడియో విడుదల చేసిన ఇరాన్

**టెహ్రాన్(జనంసాక్షి):**ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ పరిస్థితి విషమంగా ఉందని ఇజ్రాయెల్ మీడియాలో వస్తున్న వార్తలను ఇరాన్ తిప్పి కొట్టింది. సుప్రీం లీడర్ వీడియోను ప్రభుత్వ మీడియా సంస్థ విడుల చేసింది అందులో మొజ్తబా ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించారు. ఎటువంటి గాయాలు కానీ ఇబ్బంది పడుతున్న పరిస్థితులు కానీ కనిపించలేదు. అయితే, ఈ వీడియో ఎప్పుడు తీశారనే విషయాన్ని మాత్రం ఇరాన్ వెల్లడించలేదు. ఇజ్రాయెల్-అమెరికా

మిగతా 2లో..

## దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం

ఇజ్రాయెల్‌లో మిలిటరీ సెలవులు రద్దుపై స్పందించిన ఐఆర్‌జీసీ



**టెహ్రాన్(జనంసాక్షి):** ఇజ్రాయెల్‌లో సైనికులను ఉన్న అన్ని సెలవులను ఆ దేశ ఆర్మీ రద్దు చేసినట్లు అంతర్జాతీయ మీడియా వరాలు వెల్లడించాయి. ఇప్పటికే సెలవుల్లో ఉన్న వారు వెంటనే తిరిగి సైన్యంలో చేరాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇజ్రాయెల్ మళ్లీ ఇరాన్‌పై కొత్త దాడులు ప్రారంభించనుందా అనే అనుమానం వ్యక్తమవుతోంది. ఇరాన్‌పై మొదటిసారి దాడులు చేపట్టడానికి కొన్ని గంటల ముందు కూడా ఆ దేశం సైనికులకు ఇటువంటి ప్రకటనే చేసింది. దీంతో ఇప్పుడు

మిగతా 2లో..

**అమెరికా తన వైఖరిని మార్చుకోవాల్సిందే..**
హర్మ్యూజ్‌ను తిరిగి తెరిచేందుకు ఇరాన్ షరతులు 2లో..


ఆర్జీకర్ ఘటన..

## మరోసారి దర్యాప్తునకు ఆదేశం

పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

**కోల్‌కతా(జనంసాక్షి):** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆర్జీకర్ హత్యాచార కేసులో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై మరోసారి దర్యాప్తునకు

మిగతా 2లో..

వివాహమైన ఏడేళ్లలోపే వేధింపులతో మహిళ మరణిస్తే

## వరకట్న హత్యే

అలహాబాద్ హైకోర్టు వ్యాఖ్యలు

**లఖ్‌నవూ(జనంసాక్షి):**కట్నం కోసం వేధించిన ఆధారాలు ఉన్నట్లయితే... వివాహమైన ఏడేళ్లలోపే మహిళ మరణిస్తే ఆమె వరకట్న హత్యకు గురైనట్లుగానే పరిగణించవచ్చని అలహాబాద్ హైకోర్టు పేర్కొంది. ఆమె మృతికి భర్త, అత్తింటి వారి ప్రత్యక్ష ప్రమేయానికి సంబంధించి సాక్ష్యాలు అవసరం లేదని తెలిపింది. వరకట్న హత్య కేసులో సందీప్ సింగ్ హోరా అనే వ్యక్తికి విధించిన జీవిత ఖైదును పదేళ్లకు తగ్గిస్తూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. అతని భార్య అత్తగారింట అసహజ మరణానికి గురయ్యారని కోర్టు నిర్ధారించింది. అయితే, దోషిగా నిర్ధారించిన భర్తకు జీవిత ఖైదు విధించడానికి గల కారణాలను, పరిస్థితులను దిగువ కోర్టు సహేతుకంగా పేర్కొనలేదని హైకోర్టు జడ్జి అభిప్రాయపడ్డారు. అరుదైన కేసుల్లోనే యావజ్జీవ కఠిన కారాగారాన్ని విధిస్తారని తెలిపారు



జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 10.08.2026

## సుప్రీం లీడర్ క్షేమమే..

దాడుల్లో తీవ్రంగా గాయపడినప్పటి నుంచి మొజ్తబా బహిరంగంగా కనిపించకపోవడంతో అసలు ఆయన బతికే ఉన్నారా..?అనే ప్రశ్న వినిపిస్తోంది. దాడుల అనంతరం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ.. మొజ్తాబా ఖమేనీ గుర్తుపట్టలేని రీతిలో తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. ఇక ఆయన 90శాతం చనిపోయి నట్లేనన్నారు. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియల్లోనూ మొజ్తబా కనిపించలేదు. అంతకు ముందు జరిగిన ఆయన సతీమణి అంత్యక్రియల్లోనూ సుప్రీం లీడర్ కనిపించకపోవడం గమనార్హం. అయితే, భద్రతా కారణాల వల్ల ఆయన హాజరుకావడం లేదని ఇరాన్ ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలోనే మొజ్తబా ఆరోగ్యం తీవ్రంగా క్షీణించిందని..మరికొన్ని రోజుల్లో ఆయన మరణ వార్త విన్నా ఆశ్చర్యపోనక్కరలేదని శుక్రవారం ఇజ్రాయెల్ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆ క్రమంలోనే ఇరాన్ మొజ్తబా వీడియో విడుదల చేసింది.

## యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.54 కోట్లు విలువైన డ్రగ్స్ స్వాధీనం

గోపాల్ సిర్పుట్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కొండమడుగులోని వేటుకూరి ల్యాబ్స్‌లో అక్రమంగా మెఫిడ్రిన్ తయారు చేసి అక్కడి నుంచి నాగపూర్ తరలిస్తున్నట్లు గుర్తించారు.

## పిల్లల భవిష్యత్తు కంటే మంత్రి పదవి ముఖ్యమేం కాదు: ధర్మేంద్ర ప్రధాన్

**న్యూఢిల్లీ:**నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై జరిగిన ఆందోళనల్లో "జెన్ జీ"ని కొందరు తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించారని కేంద్ర మాజీ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఓ యూనివర్సిటీలో నిర్వహించిన సమావేశంలో ఆయన తొలిసారి తన రాజీనామాపై స్పందించారు. ప్రధాన్ మాట్లాడుతూ.. "జెన్ జీ మన పిల్లలే. వారి అభివృద్ధి దేశ భవిష్యత్తుతో ముడిపడి ఉంది. వారితో నాకు ఎలాంటి ఇబ్బంది లేదు. గత పదేళ్లలో 20 కోట్ల మంది పిల్లలు జన్మించారు. వారు భారత్‌ను "విశ్వగురు"గా నిలబెడతారు. వారికంటే మంత్రి పదవి నాకు ముఖ్యమైనది కాదు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి నేనే రాజీనామా చేసేందుకు ముందుకొచ్చాను" అని చెప్పారు.



తనపై బీజేడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళనలకు భయపడేది లేదని ప్రధాన్ అన్నారు. భువనేశ్వర్ విమానాశ్రయం చేరుకున్న సమయంలో "ధర్మేంద్ర ప్రధాన్ గో బ్యాక్" అంటూ నినాదాలు చేశారని.. అయినా తాను మళ్లీ వస్తానని చెప్పారు. తాను రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని గుర్తుచేశారు. బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ తనను రాష్ట్ర ప్రజల దృష్టిలో అవమానకరంగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. అయితే తాను ఒడిశా ప్రజలకు ఎప్పుడూ తలవంపులు తెచ్చే పని చేయలేదన్నారు.

## హైడ్రాకు మద్దతుగా గచ్చిబౌలిలో ర్యాలీ

**హైదరాబాద్(జనంసాక్షి):**హైడ్రాకు మద్దతుగా హైదరాబాద్ గచ్చిబౌలిలో ర్యాలీ నిర్వహించారు. హైడ్రా నిర్ణయాలకు అనుకూలంగా ప్లకార్డులు ప్రదర్శిస్తూ జనార్దన్‌హిల్స్ కాలనీ వాసులు ర్యాలీ చేపట్టారు. హైడ్రా అధికారులు.. ఆక్రమణకు గురైన పార్కు స్థలాన్ని రక్షించి, 3 నెలల్లో పార్కు అభివృద్ధి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు.





## మమత కాన్వాయ్‌పై రాళ్ల దాడి

పోలీసు కస్టడీలో ఉన్న సమయంలోనే ఆయన మృతి చెందారు. తన భర్తను లాకప్‌లో కొట్టడం వల్లే ప్రాణాలు కోల్పోయాడని ఆయన భార్య ఆరోపించారు. ఈ క్రమంలోనే బిర్జు కుటుంబాన్ని పరామర్శించేందుకు మమత బయల్దేరారు. ఆమె వెంట ఎంపీలు కల్యాణ్ బెనర్జీ, డోలా సేన్ ఉన్నారు. మార్గమధ్యంలో నిరసనకారులు ఆమె వాహనాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ వ్యవహారం కాస్త అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధానికి దారితీసింది."నా కారుపై చెప్పులు, బురద విసిరారు. రాళ్లు, ఇటుకలతో దాడి చేశారు. నా తల పగిలిపోయి ఉండేది. నేను ఇక్కడే చనిపోయి ఉండేదాన్ని. ఇది ముమ్మాటికీ కుట్రే. నేను వస్తున్నానని పోలీసులకు ముందే చెప్పాను. అయినప్పటికీ.. ఎలాంటి భద్రతా చర్యలు తీసుకోలేదు. నన్ను లక్ష్యంగా చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం గూండాలను వాడుకుంటోంది" అని ఆమె ఆరోపించారు. అయితే, ఉద్రిక్తతలను రెచ్చగొట్టేందుకే మమత అక్కడికి వెళ్లారని భాజపా ఆరోపించింది. ఆమె రాకపై స్థానికులు నిరసన తెలిపారని పేర్కొంది.

ఆర్జీకర్ ఘటన..

## మరోసారి దర్యాప్తునకు ఆదేశం

ఆదేశించినట్లు బెంగాల్ సీఎం సువేందు అధికారి ప్రకటించారు. మృతురాలి తల్లి, ప్రస్తుత భాజపా ఎమ్మెల్యే రత్న దేబ్‌నాథ్ విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసు విషయంలో పోలీసులు తమ విధి నిర్వహణలో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు."ఈ కేసులో కొత్తగా దర్యాప్తు జరపాలని కోరుతూ రత్న దేబ్‌నాథ్ నాకు లేఖ రాశారు. ఈ క్రమంలోనే సీఎస్‌తోపాటు నిపుణుల బృందంతో విస్తృత చర్చల అనంతరం.. మరోసారి దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేశాను" అని సీఎం సువేందు పేర్కొన్నారు. అదేవిధంగా బాధితురాలి అంత్యక్రియల నిర్వహణలో జరిగిన లోపాలపై కూడా ప్రత్యేక దర్యాప్తునకు ముఖ్యమంత్రి ఆదేశించారు. దీనికి బాధ్యులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు, ఈ ఘటనకు నేటితో రెండేళ్లు పూర్తి కాగా.. బాధితురాలికి నివాళిగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. 2024 ఆగస్టులో కోల్‌కతాలోని ఆర్జీకర్ వైద్యకళాశాల- ఆసుపత్రిలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర నిరసనలకు దారితీసింది. కలకత్తా హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కేసును పోలీసుల నుంచి సీబీఐ స్వీకరించింది. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. కోల్‌కతాలోని సియాల్దా కోర్టు సంజయ్ రాయ్‌ను దోషిగా నిర్ధరించి.. జీవిత ఖైదు విధించింది. ఈ ఘటన అరుదైన కేసు పరిధిలోకి రాదని, మరణశిక్ష విధించకపోవడానికి ఇదే కారణమని తెలిపింది.

# రాష్ట్రంలో ఇక మావోయిస్టులు లేరు

పరిష్కారం కోసం 'టీజీ వీర్' యాప్‌ను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు.ప్రస్తుతం రాష్ట్రంలో డ్రగ్స్, సైబర్ నేరాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని డీజీపీ తెలిపారు. వీటి నియంత్రణ కోసం ఈగల్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలను ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. వరంగల్‌లో సైబర్ నేరాల నియంత్రణకు పోలీసులు సమర్థంగా పనిచేస్తున్నారని, సైబర్ నేరగాళ్లను పట్టుకోవడంతో పాటు బాధితులు కోల్పోయిన డబ్బును తిరిగి ఇప్పించేందుకు పోలీసు బృందాలు ప్రత్యేకంగా కృషి చేస్తున్నాయని తెలిపారు.డ్రగ్ పెడ్లర్లను పట్టుకునేందుకు సమర్థవంతమైన బృందాలను ఏర్పాటు చేస్తున్నామని, చిన్నపిల్లలకు చాక్లెట్లలో డ్రగ్స్ కలిపి ఇవ్వడాన్ని కూడా తీవ్రమైన నేరంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేశారు. గత రెండు నెలలుగా సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీసు వ్యవస్థలో మరిన్ని సంస్కరణలు తీసుకురావడంతో పాటు అవినీతి నిరోధక, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను మరింత బలోపేతం చేస్తున్నామని సీవీ ఆనంద్ తెలిపారు. నేరాల కట్టడికి అన్ని విధాలుగా తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వరంగల్ పోలీసు కమిషనర్ శ్వేత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.మారుతున్న కాలానికి అనుగుణంగా పోలీసింగ్‌లోనూ మార్పులు అవసరం

వరంగల్ బ్యూరో:వరంగల్‌తో తనకున్న అనుబంధాన్ని, తన పోలీసు ప్రస్థానంలోని ముఖ్యమైన ఘట్టాలను తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేసుకున్నారు.తన ఐపీఎస్ ప్రస్థానం వరంగల్‌లోనే ప్రారంభమైందని, ఇక్కడ జిల్లా శిక్షణ పొందడంతో పాటు వరంగల్ రూరల్ ఎస్పీగా కూడా పనిచేశానని ఆయన తెలిపారు.వరంగల్ పోలీస్ కమిషనరేట్ పనితీరుపై శనివారం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటి), వరంగల్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో డీజీపీ పాల్గొని పోలీసు అధికారులతో



సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ముందుగా వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత ఐపిఎస్ వరంగల్ కమిషనరేట్ పరిధిలో పోలీసింగ్ పనితీరు, నేరాల పరిస్థితి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మహిళల భద్రత, ఆర్థిక నేరాల ధోరణులు తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా డీజీపీకి వివరించగా,తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో , టి-స్పార్క్ , క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ కు చెందిన ప్రాంతీయ అధికారులు సైబర్ నేరాల తాజా పరిస్థితులు, నూతన సైబర్ ముప్పులు, దర్యాప్తు విధానాలు, నేరాల నియంత్రణ, గుర్తింపు కోసం అమలు చేస్తున్న సాంకేతిక వ్యవస్థలపై డీజీపీకి వివరించారు.అనంతరం వరంగల్ ప్రాంతం ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం ప్రభావంతో తీవ్రంగా అల్లకల్లోలంగా ఉన్న రోజులను డీజీపీ సీవీ ఆనంద్ గుర్తుచేసుకుంటూ. ఆ సమయంలో పోలీసులు నిరంతరం ప్రాణహాని మధ్య విధులు నిర్వర్తించారని తెలిపారు.ల్యాండ్‌మైన్ పేలుళ్లు, ఆకస్మిక దాడులు, పోలీస్ స్టేషన్లు, పోలీసు అధికారులపై దాడులు వంటి తీవ్ర ముప్పులను ఎదుర్కొంటూ పోలీసులు విధులు నిర్వహించారని అన్నారు. విధులకు ఇంటి నుంచి బయలుదేరిన పోలీసులు తిరిగి సురక్షితంగా ఇంటికి చేరుకుంటామో లేదో తెలియని పరిస్థితులు అప్పట్లో ఉండేవని, ఆ రోజులు తనకు ఎప్పటికీ మరువలేనివని డీజీపీ పేర్కొన్నారు.

తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు చేపట్టిన విస్తృత కూంబింగ్ ఆపరేషన్లను ఆయన గుర్తుచేశారు. తెలంగాణలో 2010 నాటికి వామపక్ష తీవ్రవాదం గణనీయంగా తగ్గుముఖం పట్టిందని తెలిపారు. తీవ్రవాద కార్యకలాపాలను వీడి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారికి ప్రభుత్వం ఆరోగ్య కార్డులు, సంక్షేమ పథకాలతో పాటు పలు పునరావాస చర్యలు అందిస్తోందన్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న ప్రశాంత వాతావరణం, ప్రజల భద్రత, శాంతిభద్రతలు పోలీసు అమరవీరుల దశాబ్దాల త్యాగాల ఫలితమేనని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

**మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త పోలీసింగ్ సవాళ్లు**

గత మూడు దశాబ్దాలతో పోలిస్తే ప్రస్తుతం పోలీసింగ్ స్వరూపం గణనీయంగా మారిందని డీజీపీ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం ప్రధాన భద్రతా సవాలుగా ఉండగా, ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, ఆర్థిక నేరాలు, రహదారి భద్రత వంటి అంశాలు ప్రధాన సవాళ్లుగా మారాయని అన్నారు.ఈ నూతన సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక విభాగాలు, సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలు, సీసీ కెమెరాల ఆధారిత నిఘా, సమగ్ర పోలీసింగ్ ప్లాట్‌ఫామ్‌లతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగిస్తున్నామని తెలిపారు.

## భాష, సంస్కృతి, సంప్రదాయాలను

# కాపాడుకోవాలి



సమస్యలను చెప్పుకునేందుకు వచ్చే ప్రజలను అధికారులు గౌరవంగా చూడాలని మంత్రి సూచించారు. పేదలు, చదువు లేని వారు తమ సమస్యలతో వచ్చినప్పుడు వారిని నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరి వినతిని ఓపికగా విని, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు .ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఇప్పటివరకు వివిధ శాఖల ద్వారా సుమారు రూ. 1,200 కోట్ల విలువైన అభివృద్ధి పనులు ప్రారంభించినట్లు చెప్పారు.స్కిల్ డెవలప్‌మెంట్, గిరిజన సంక్షేమం, పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖల ద్వారా నియోజకవర్గానికి అవసరమైన మరిన్ని అభివృద్ధి పనులను మంజూరు చేయించేందుకు తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.కొమరం భీమ్ "జల్, జంగల్, జమీన్" నినాదంతో పోరాటం చేశారని మంత్రి గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలు ప్రధాన అంశాలుగా నిలిచాయని తెలిపారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో సాధించుకున్న తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువత అభివృద్ధి చెందితేనే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు.ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, పండుగలు, గోత్రాలు, జీవన విధానమే వారి అస్థిత్వమని మంత్రి సీతక్క అన్నారు. ఎంత ఉన్నత స్థానానికి ఎదిగినా తమ మూలాలను, మాతృభాషను, సంస్కృతిని, సంప్రదాయాలను మరచిపోకూడదని సూచించారు.మన భాష, మన వేషం, మన సంస్కృతి, మన సంప్రదాయాలే మన గుర్తింపు. వాటిని కాపాడుకుంటూ భావితరాలకు అందించాలి అని మంత్రి పిలుపునిచ్చారు.కొమరం భీమ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఆదివాసీ సమాజ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి సీతక్క తెలిపారు.

ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం కోసం కొమరం భీమ్ చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. అశ్వారావుపేటలో కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఆదివాసీ జేఏసీ నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులకు అభినందనలు తెలిపారు.ఆదివాసీల పోరాట చరిత్ర ఎంతో గొప్పదని మంత్రి తెలిపారు . కాకతీయుల పాలనకు వ్యతిరేకంగా సమ్మక్క-సారలమ్మ చేసిన పోరాటం నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అల్లూరి సీతారామరాజు, నిజాం పాలనకు వ్యతిరేకంగా కొమరం భీమ్ చేసిన పోరాటాల వరకు ఆదివాసీలు తమ హక్కులు, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం నిరంతరం పోరాడారని తెలిపారు.ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి న్యాయంగా దక్కాల్సిన హక్కుల కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని మంత్రి అన్నారు. ఏ కులానికీ, ఏ ప్రాంత ప్రజలకూ వ్యతిరేకంగా ఆదివాసీలు లేరని, తమకు న్యాయంగా రావాల్సిన హక్కుల కోసం మాత్రమే పోరాడుతున్నారని స్పష్టం చేశారు.అడవిపై హక్కులు, భూమిపై హక్కులు, విద్య, ఉపాధి, గృహాలు తదితర ప్రాథమిక అవసరాలు ఆదివాసీలకు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.ఆదివాసీ ప్రాంతాల నుంచి తమ

ఆదివాసీ సమాజ విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ఆదివాసీ సమాజంలో ఐక్యత, చైతన్యం, విద్యాభివృద్ధి పెంపొందించాలనే లక్ష్యంతో అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమన్నారు.ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని, ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని అన్నారు

## పెద్ది సుదర్శన్‌రెడ్డి కుటుంబానికి

# బీఆర్ఎస్ అండగా ఉంటుంది

కొనసాగగా కెసిఆర్ కు పలుచోట్ల ఘనస్వాగతం పలికారు. వందలాది వాహనాలు కేసీఆర్ పర్యటనలో ఉండగా నల్లబెల్లి మండల కేంద్రంలో వేలాది మది కార్యకర్తలు నాయకులు పెద్ది సుదర్శన్ రెడ్డి స్వగృహానికి విచ్చేసి కెసిఆర్ రాక కోసం ఎదురుచూశారు. మధ్యాహ్నం ఒంటి గంటకు రావలసిన అధినేత కేసిఆర్ రెండు గంటల 20 నిమిషాలకు పెద్ది స్వగృహం ముందుకు విచ్చేశారు . నల్లబెల్లిలో భారీ కాన్వాయ్ మధ్య పెద్ది గృహానికి రాగా అధినేత రాక కోసం ఉదయము నుండే బారులు తీరి కెసిఆర్ ను చూడాలనే తపనతో వచ్చిన బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కు చేదు అనుభవం ఎదురైంది. కేసీఆర్ రాక సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినప్పటికీ వేలాది కార్యకర్తలుమూకుమ్మడిగా తోసుకుంటూ వచ్చారు. పోలీసులు నాయకులకు కార్యకర్తలను అదుపు చేయడంలో ప్రయత్నం చేసినప్పటికీ కార్యకర్తలు తోసుకొని వచ్చారు. కార్యకర్తలు ఒక్కసారిగా ఆయనను చూసేందుకు ఎగబడటంతో పరిస్థితి అదుపు తప్పింది. కేసీఆర్ వాహనం నల్లబెల్లికి చేరుకున్న సమయంలో భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు ఆయనను చూసేందుకు



ముందుకు దూసుకురావడంతో పోలీసులు వారిని నియంత్రించడంలో విఫలమయ్యారు. దీంతో వాహనం ముందుకు కదిలే పరిస్థితి లేకపోయింది. సుమారు 30 నిమిషాల పాటు కేసీఆర్ కారులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. పెద్ది కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన నేతకు స్వాగతం పలికేందుకు భారీగా కార్యకర్తలు తరలివచ్చినా ముందస్తు భద్రతా ఏర్పాట్లలో లోపాలు కనిపించాయని స్థానికులు, బీఆర్ఎస్ శ్రేణులు చర్చించుకున్నారు. చివరకు పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన అనంతరం కేసీఆర్ వాహనం ముందుకు కదిలింది. 30 నిమిషాలకు పైగా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను అధినేత కేసిఆర్ పరామర్శించి రెండు కోట్ల 25 లక్షల రూపాయలను కుటుంబ సభ్యులకు అందజేశారు. తమ ఉద్యమ సహచరుని కోల్పోయామని అధినేత కేసిఆర్ భావోద్వేగానికి గురై నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని అభయమిచ్చారు.

## అమెరికా తన వైఖరిని మార్చుకోవాల్సిందే..

### హర్మూజ్‌ను తిరిగి తెరిచేందుకు ఇరాన్ షరతులు

టెహ్రాన్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ కొత్త షరతులు విధించింది. అమెరికా తన వైఖరిని మార్చుకోవాలని స్పష్టం చేసింది. ఈ వ్యూహాత్మక ప్రాంతం నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని తెలిపింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. తమ ఆస్తులపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయడంతోపాటు, విదేశాల్లో స్తంభింపజేసిన నిధులను బేషరతుగా విడుదల చేయాలని కోరింది. ఇరాన్ నౌకాశ్రయాలపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేయాలని పేర్కొంది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మహ్మద్ బాగెర్ జోల్ఘాదర్ ఈ వివరాలు వెల్లడించారు.జూన్‌లో తాత్కాలిక ఒప్పందంలో హర్మూజ్ జలసంధి విషయంలో కొన్ని అంశాలపై అంగీకారం కుదిరిన సంగతి తెలిసిందే. ఆంక్షల సడలింపు, స్తంభించిన ఆస్తుల విడుదల వంటి అంశాలను తుది ఒప్పందంలో చేర్చాలని నిర్ణయించారు. అయితే ఇప్పుడు ఇరాన్ వైఖరి మారింది. జలసంధిని తెరవాలంటే ఆంక్షల ఎత్తివేత, స్తంభించిన నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతోంది. అమెరికా మాత్రం జలసంధిపై ముందుగా ఒప్పందం కుదరాలని భావిస్తోంది. ఆ తర్వాతే దిగ్బంధనాన్ని ముగించే అంశాన్ని పరిశీలించాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ఇరాన్ తాజా డిమాండ్లపై అమెరికా ఇంకా స్పందించలేదు. ఒమన్(రాఎజీని)తో తాము జరుపుతున్న చర్చలు కేవలం నౌకల రాకపోకల సాంకేతిక మార్గాల కోసమేనని.. అమెరికా తమ షరతులు అంగీకరించే వరకు జలసంధి తెరిచే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది.

## దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం

కూడా పెద్ద స్థాయిలో దాడులు చేపట్టడానికి ఆ దేశ సైన్యం సిద్ధమయ్యే అవకాశం ఉందనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. యుద్ధం కారణంగా గగనతల రక్షణ వ్యవస్థల కొరత ఏర్పడుతుండడంతో.. దాడులను ఆపివేయాలని అమెరికా భావిస్తోంది. అయితే నెతన్యాహు మాత్రం యుద్ధం కొనసాగించడానికే మొగ్గు చూపుతున్నారని స్థానిక మీడియా వర్గాలు వెల్లడించాయి. అమెరికా సాయం లేకుండా సొంతంగా టెహ్రాన్‌పై విరుచుకుపడడానికి సైన్యం సన్నాహాలు కూడా ప్రారంభించినట్లు తెలిపాయి. ఇరాన్‌లోని కీలక నేతలు, ఐఆర్‌జీసీ అధికారులే లక్ష్యంగా దాడులు చేయడానికి ఇప్పటికే నెతన్యాహు సైనికాధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది.

ట్రంప్ శాంతి ప్రణాళికలను వ్యతిరేకించిన నెతన్యాహు..

ఇరాన్‌తో యుద్ధం ముగింపు, గాజాలో దాడుల నిలుపుదల కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించిన 15 పాయింట్ల ప్రణాళికను నెతన్యాహు వ్యతిరేకించారు. గాజా విషయంలో అగ్రరాజ్య ప్రతిపాదనలను అంగీకరించబోమని.. హమాస్ పూర్తిగా ఆయుధాలు విడిచిపెట్టేంతవరకు వెనక్కి తగ్గబోమని ప్రకటించారు

దాడులు చేస్తే.. ప్రతీకారం తీర్చుకుంటాం: ఇరాన్

ఇజ్రాయెల్ మరోసారి తమపై దాడి చేస్తే.. తీవ్ర స్థాయిలో విరుచుకుపడతామని ఇరాన్ శనివారం హెచ్చరించింది. టెల్ అవీవ్‌లోని చమురు రిఫైనరీలు, కీలక కార్యాలయాలను లక్ష్యం చేసుకుంటామని పేర్కొంది. వ్యూహాత్మక హర్మూజ్ ప్రాంతం నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని అమెరికాకు సూచించింది. ఇరాన్‌పై యుద్ధాన్ని శాశ్వతంగా ముగించాలని.. దాడుల కారణంగా జరిగిన నష్టానికి పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది.

## హైడ్రాకు మద్దతుగా కొనసాగుతున్న ర్యాలీలు

- పార్కులు, చెరువులు కాపాడిన హైడ్రాకు మద్దతు
- ర్యాలీలు నిర్వహించి హైడ్రాకు, ప్రభుత్వానికి సంఘీభావం



హైదరాబాద్, ఆగస్టు 09 (జనంసాక్షి) : చెరువులు, పార్కులు, నాలాలను పరిరక్షించస్తున్న హైడ్రాకు మద్దతుగా నగరవ్యాప్తంగా ర్యాలీలు కొనసాగుతున్నాయి. హైడ్రాను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటిస్తున్నాయి. దేశంలోనే ప్రప్రథమంగా హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారికి నగరంలోని పలు కాలనీ సంక్షేమ సంఘాలు మద్దతుగా నిలస్తున్నాయి. హైడ్రా వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఐటీ కారిడార్‌కు చేరువలోని గండిపేట మండలం పుప్పాలగూడ - నార్సింగ్ సరిహద్దులోని 52.20 ఎకరాల చెరువును కబ్జా కాకుండా కాపాడిన హైడ్రాకు మద్దతుగా పరిసర కాలనీ వాసులు, గేటెడ్ కమ్యూనిటీ నివాసితులు, అపార్టుమెంట్ వాసులు పెద్దయెత్తున ర్యాలీలు నిర్వహించి సమావేశాలు ఏర్పాటు చేసి హైడ్రాకు మద్ధతు తెలిపారు. ముష్కిన్ చెరువులో దాదాపు 35 ఎకరాల మేర కబ్జా చేసేయాలని ప్రయత్నించగా ఆక్రమణలను తొలగించి హైడ్రా మొత్తం చెరువును కాపాడింది. గచ్చిబౌలిలోని జనార్దన హిల్స్ కాలనీలో ఆక్రమనలకు గురైన వరద కాలువను పరిరక్షించడమే కాకుండా.. ఆ కాలువకు ఆనుకుని ఉన్న పార్కును కాపాడినందుకు ఆదివారం పెద్దయెత్తున ర్యాలీ నిర్వహించి మద్ధతు తెలిపారు. ఇందులో సీనియర్ సిటిజన్లు, మహిళలు, చిన్నారులు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొని హైడ్రాను ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి సంఘీభావం ప్రకటించారు. నగర భవిష్యత్ బంగారంలా ఉండాలంటే హైడ్రా ఉండాల్సిందే అంటూ నినదించారు. వరదలు లేని నగరం కావాలనుకుంటే చెరువులను కాపాడుకోవాలని.. ఆ పని చేస్తున్న హైడ్రాకు మద్ధతు తెలుపుతున్నామంటూ పలువురు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# యూసీ బర్క్లీలో భట్టి విక్రమార్క పర్యటన

- పునరుత్పాదక ఇంధన లక్ష్యాలు, రాష్ట్ర రోడ్‌మ్యాప్‌పై బిగ్ డిస్కషన్!




కాలిఫోర్నియా (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అమెరికా పర్యటనలో భాగంగా ప్రపంచ ప్రసిద్ధ యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా, బర్క్లీలోని గోల్డ్‌మన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ పరిధిలోని 'ఇండియా ఎనర్జీ అండ్ క్లైమేట్ సెంటర్'ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో భారతదేశ పునరుత్పాదక ఇంధన లక్ష్యాల సాధనతో పాటు తెలంగాణను స్వచ్ఛ ఇంధన రంగాన గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన భవిష్యత్ ప్రణాళికలపై లోతుగా చర్చించారు. భారతదేశం నిర్దేశించుకున్న 2030 నాటికి 500 గిగావాట్ల నాన్-ఫాసిల్ సామర్థ్యాన్ని అందుకునేందుకు అవసరమైన వ్యూహాలు, తగ్గుతున్న శుద్ధ సాంకేతికత ఖర్చులు తెచ్చిపెడుతున్న నూతన అవకాశాలను ఈ సమావేశంలో పరిశీలించారు. గ్రిడ్ ఆధునీకరణ, పారిశ్రామిక డీకార్బనైజేషన్, ఆధునిక బ్యాటరీ ఇంధన నిల్వ వ్యవస్థల సమన్వయం మరియు సమాన అవకాశాలతో కూడిన శక్తి పరివర్తన మార్గాలపై పరిశోధకులు, అధికారులతో డిప్యూటీ సీఎం విస్తృతంగా ఆలోచనలు పంచుకున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం చేపట్టిన వినూత్న పునరుత్పాదక ఇంధన మోడల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పారదర్శకమైన హరిత విధానం ద్వారా గ్రీన్ ఎనర్జీ రంగంలో భారీ పెట్టుబడులను ఆకర్షిస్తూ రాష్ట్రంలో సౌరశక్తి సహా ఇతర పునరుత్పాదక సామర్థ్యాన్ని వేగవంతంగా విస్తరిస్తున్న తీరును డిప్యూటీ సీఎం వివరించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) భాగస్వామ్యంతో సోలార్ ప్రాజెక్టుల నిర్వహణ చేపట్టడం, పీఎం-కుసుమ్ పథకం ద్వారా అన్నదాతలకు స్వచ్ఛ ఇంధనాన్ని అందించడం వంటి ప్రజాకేంద్రిత నమూనాలు అంతర్జాతీయ ప్రతినిధుల ప్రశంసలు అందుకున్నాయి. 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటు క్లీన్-టెక్ పరికరాల తయారీ రంగాన్ని ప్రోత్సహిస్తున్న తీరును ఆయన సభ దృష్టికి తీసుకెళ్లారు. సిలికాన్ వ్యాలీ ఆవిష్కరణలు, కాలిఫోర్నియా రాష్ట్ర ఇంధన రంగానుభవాలను ఉపయోగించుకుని తెలంగాణలో సరికొత్త ఇంధన విప్లవానికి శ్రీకారం చుట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు. విద్యుత్, రవాణా, పారిశ్రామిక మరియు వాతావరణ స్థిరత్వ రంగాలలో సంయుక్త అధ్యయనాలు చేపట్టడం, విధాన నిర్ణేతలకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో ఇంధన భద్రతను, ఆర్థిక పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు యూసీ బర్క్లీ ప్రతినిధులతో కలిసి పనిచేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## శ్రీ వరమైసమ్మ అమ్మవారి బోనాల జాతరలో ఉప్పల శ్రీనివాస్ గుప్త





హైదరాబాద్ (జనంసాక్షి) : కొత్తపేట మోహన్‌నగర్‌లోని జనప్రియ అపార్ట్‌మెం ట్స్‌లో శ్రీ వరమైసమ్మ దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల జాతర కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సుఖసంతో షాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని, భక్తిశ్రద్ధలతో అమ్మవారిని కొలవడం మన సంప్రదాయంలో ఎంతో విశిష్టమైనదని అన్నారు. శ్రీ వరమైసమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆదివాసుల చరిత్ర అంతా పోరాటాల చరిత్రే

- కొమరం భీమ్ విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రి సీతక్క
- ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడటమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం



అశ్వారావుపేట, ఆగస్టు 9 (జనంసాక్షి) : ఆదివాసుల చరిత్ర అంతా హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం కోసం సాగించిన పోరాటాల చరిత్రేనని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీ స్వాతంత్ర్య సమరయోధుడు కొమరం భీమ్ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా అశ్వారావుపేటలో భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ఆదివాసీలు, స్థానిక ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు. జై ఆదివాసీ నినాదాలతో అశ్వారావుపేట మారుమోగింది. అనంతరం జరిగిన సభలో మంత్రి సీతక్క ఆదివాసీల హక్కులు, చరిత్ర, సంస్కృతి, అభివృద్ధి అంశాలపై మాట్లాడారు. కాకతీయులకు వ్యతిరేకంగా పోరాడిన సమ్మక్క, సారక్క నుంచి బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన బిర్సా ముండా, రాంజీ గోండు వరకు, నిజాం పాలనకు వ్యతిరేకంగా జల్, జంగల్, జమీన్ కోసం పోరాడిన కొమరం భీమ్ వరకు ఆదివాసీలు పోరాటాల్లో ముందుండారని గుర్తు చేశారు. ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు తీసుకురావడంతో పాటు మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అచ్చంపేట నుంచి ఆదిలాబాద్ వరకు ఉన్న ఆదివాసీ ప్రజాప్రతినిధులందరి ప్రధాన డిమాండ్ అడవిపై హక్కులు, తమకు రావాల్సిన ఉద్యోగాలు, తమకు సొంత ఇళ్లు కల్పించడమేనని అన్నారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తితో ఏర్పడిన తెలంగాణలో ఆదివాసీ బిడ్డలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడటమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షిస్తూ వారి అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని అన్నారు. ఆదివాసీ సమాజం తన భాష, సంస్కృతి, సంప్రదాయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మర్చిపోవద్దని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. భాష, వేషధారణ, ఆచారాలు, సంప్రదాయాలు, గోత్రాలు ఆదివాసీల అస్తిత్వంలో భాగమని అన్నారు. కొమరం భీమ్ ఆశయాలకు అనుగుణంగా ఆదివాసీ సమాజం ముందుకు సాగాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలతో పాటు అశ్వారావుపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. గ్రామీణ మహిళా సమాఖ్య భవనాన్ని సందర్శించి మహిళా సంఘాల కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులను అభినందించారు. ఆదివాసీ సమాజం అభివృద్ధి, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మంత్రి సీతక్క ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు.



## పొన్నంను కలిసిన బేస్‌బాల్ అసోసియేషన్

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ బేస్‌బాల్ అసోసియేషన్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ని కలిసింది. బేస్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ జనరల్ సెక్రటరీ శ్వేత, సీనియర్ క్రీడాకారులు ఖాదర్, సృజన్‌లతో కలిసి మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను కలిసి, తెలంగాణలో బేస్‌బాల్ క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్యలో 2% రిజర్వేషన్ అమలు చేయాలని వినతి పత్రం సమర్పించారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనడాన్ని ప్రోత్సహించేందుకు క్రీడాకారు లను గుర్తించి, రిజర్వేషన్ల ద్వారా ప్రోత్సహించాల్సిన అవసరాన్ని ప్రతినిధి బృందం చర్చించింది.

## హైదరాబాద్ బుక్ ఫెయిర్ వ్యవస్థాపకులు రాజేశ్వర్ రావు మృతి






హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్ బుక్ ఫెయిర్ సొసైటీ వ్యవస్థాపకులు రాజేశ్వర్ రావు ఆదివారం ఉదయం మృతి చెందారు. రాజేశ్వరరావు విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ లో ప్యాకర్ గా తన జీవితాన్ని ప్రారంభించి, 40 ఏళ్ల పాటు జనరల్ మేనేజర్ గా సేవలందించాడు. పుస్తక రంగానికి రెండు రాష్ట్రాలలో ఎనలేని సేవలు అందించారు. రాజేశ్వరరావు తన జీవిత కాలమంతా పుస్తక ప్రపంచం తోటే సాగిందని 36 పుస్తక ప్రదర్శనలకు ఆయన నేతృత్వం వహించారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కమ్యూనిస్టు నేత చంద్ర రాజేశ్వరరావు పుచ్చలపల్లి సుందరయ్యల దగ్గర నుంచి బీ ఆర్ ఎస్ నేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు వరకు అన్ని పార్టీల నాయకులకు రాజేశ్వరరావు చెప్పిన చిరపరిచితుడు గా ఉన్నారు. 40 ఏళ్ల క్రితం కొత్త పుస్తకం వస్తే దాని వివరాలు తెలుసుకోవాలంటే రాజేశ్వరరావు కి ఫోన్ చేసేవారు అని తెలియజేశారు. మూడు తరాల పుస్తక ప్రియులకు పుస్తకాల ద్వారా తెలిసిన వ్యక్తి రాజేశ్వరరావు అని తెలిపారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ తొలి కార్యదర్శిగా, ఉపాధ్య క్షుడిగా, కోశాధికారిగా వివిధ బాధ్యతల్లో 36 ఏళ్ల పాటు సేవలు అందిం చారు. ప్రగతి పబ్లికేషన్స్ పేరుతో తెలుగు సాహిత్యం తదితర అంశాలపై పుస్తకాలను ముద్రించారు. వారి అకాల మృతి పట్ల తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్, హైదరాబాద్ బుక్ ఫెయిర్ పూర్వ అధ్యక్షులు జూలూరు గౌరీ శంకర్, బుక్ ఫెయిర్ పూర్వ కార్యదర్శి కోయ చంద్రమోహన్ లు సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబానికి సానుభూతిని తెలిపారు.

## మంచి పోలీసులు ప్రజాదరణ పొందుతారు

- తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్




నూజివీడు (జనంసాక్షి) : వృత్తికి అంకితమై పనిచేసే మంచి పోలీసులకు ప్రజాదరణ ఉంటుందని తెలంగాణ రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడే పని మహోన్నతమైనదని పోలీసు వృత్తిని ఆయన కొనియాడారు. నూజివీడు లో ఆదివారం జరిగిన ఏఎస్ఐ సూరోజు నాగ ప్రసాద్ పదవీ విరమణ మహోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రాచకొండ విశ్వనాధ శాస్త్రి తన కథల్లో పోలీసుల్లో కూడా మంచివారు ఉంటారని చెప్పారని ఈ సందర్భంగా జూలూరు గుర్తు చేశారు. ప్రసాద్ లాంటి అధికారులు అక్షరాలా మంచివారేనని వారికి ఉన్న ప్రజాదరణ తెలియజేస్తుందని పేర్కొన్నారు. పోలీసులలో ఉన్న మంచితనాన్ని దృష్టిలో పెట్టుకుని గద్దర్ లాంటి ప్రజావాగ్గేయకారుడు మాలోని మనిషివే మా మనిషివే నీవు పొట్టకూటికి నీవు పోలీసు అయినావు అని పాటలు కట్టారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సమాజ రక్షకులైన పోలీసులు చేసే పని దేశభక్తియుతమైనదని జూలూరు అభివర్ణించారు. ఈ సభలో జడ్జి వేల్పుల కృష్ణమూర్తి, రిటైర్డ్ ఎస్పై జగజీవన్ రామ్, గౌతం శ్రీనివాసరావు, సు రోజు భోగేశ్వర రావు, లయన్ ముట్లూరి వెంకయ్య తదితరులు మాట్లాడారు. సు రోజు ప్రసాద్ ఆయన సహధర్మచారిని ఉమను ఈ సందర్భంగా సత్కరించారు.

## ప్రైమరీలో న్యాయం చేయాలి

### బాధితురాలు చేర్పా రాధికా ఆరోపణ



గూడూరు, ఆగస్టు 09 (జనంసాక్షి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు గ్రామానికి చెందిన చేర్పా రాధికా తనకు ప్రీ-ప్రైమరీ సెక్టర్‌లో జరిగిన ఎంపిక ప్రక్రియలో అన్యాయం జరిగిందని ఆరోపించారు. పొనుగోడు పాఠశాలలో ప్రీ-ప్రైమరీ సెక్టర్‌లో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నోటిఫికేషన్ వెలువడటంతో తాను దరఖాస్తు చేసుకున్నానని రాధికా తెలిపారు.మొత్తం ఐదు కేటగిరీలలో ఎంపిక ప్రక్రియ జరిగిందని,మొదటి జాబితాలో తన పేరు ఎంపికైనట్లు సంబంధిత అధికారి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. అంతేకాకుండాదరఖాస్తుదారులందరిలో తనకే అత్యధిక మార్కులు వచ్చినట్లు అధికారులు తెలిపారని ఆమె అన్నారు.



# కాశీ విశ్వనాథుడిని దర్శించుకున్న గవర్నర్

హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) : రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం వారణాసిలోని పవిత్ర శ్రీ కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విశ్వనాథుడి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తెలంగాణతో పాటు దేశ ప్రజల శాంతి, సౌభాగ్యం, సమృద్ధి, సర్వతోముఖ అభివృద్ధి కోసం గవర్నర్ బాబా విశ్వనాథుడిని ప్రార్థించారు. కాశీ విశ్వనాథుడి దివ్య సన్నిధి భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను, శక్తిని ప్రసాదిస్తుందని పేర్కొన్నారు.

## కమలాపూర్‌లో నేడు డబుల్ ఇళ్లకు శ్రీకారం

- మంత్రుల చేతుల మీదుగా పంపిణీ



కమలాపూర్, ఆగస్టు 09(జనంసాక్షి) : సొంతింటి కల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కల నెరవేరే సమయం ఆసన్నమయింది.రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పేదలకు డబుల్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కుడా మాజీ ఛైర్మెన్,పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాం రెడ్డి, హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.ఆదివారం రోజున మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించే కార్యక్రమ ఏర్పాట్లను వారు స్వయంగా పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలు కలలు కన్న సొంతింటి స్వప్నం నేరేవేరబోయే సమయం ఇదిఅని, కమలాపూర్, మర్రిపల్లి గూడెం,గూడూరు గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు డబుల్ ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని,వాటితో పాటు ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి 3500 ఇచ్చామని,రెండవ విడతలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి అర్హులైన పేదవారిని ఆదుకుంటామని తెలిపారు.అనంతరం కమలాపూర్ మండల కేంద్రంలో పార్టీ జెండా గద్దె ఆవిష్కరణ స్థలాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో కమలాపూర్ మండల అధ్యక్షుడు,భీంపల్లి గ్రామ సర్పంచ్ వాసాల శ్రీనివాస్,వ్యవసాయ మార్కెట్ చైర్ పర్సన్ ఝాన్సీ,డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,ప్రజా ప్రతినిధులు,వార్డు సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


తింటి కల కోసం ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న కల నెరవేరే సమయం ఆసన్నమయింది.రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా పేదలకు డబుల్ ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపడుతున్నామని కుడా మాజీ ఛైర్మెన్,పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రాం రెడ్డి,హుజురాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వొడితల ప్రణవ్ తెలిపారు.ఆదివారం రోజున మంత్రుల చేతుల మీదుగా ప్రారంభించే కార్యక్రమ ఏర్పాట్లను వారు స్వయంగా పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేదలు కలలు కన్న సొంతింటి స్వప్నం నేరేవేరబోయే సమయం ఇదిఅని, కమలాపూర్,మర్రిపల్లి గూడెం, గూడూరు గ్రామాల పరిధిలోని లబ్ధిదారులకు డబుల్ ఇళ్ల పట్టాలు ఇస్తున్నామని,వాటితో పాటు ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు నియోజకవర్గానికి 3500 ఇచ్చామని,రెండవ విడతలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి అర్హులైన పేదవారిని ఆదుకుంటామని తెలిపారు.అనంతరం కమలాపూర్ మండల కేంద్రంలో పార్టీ జెండా గద్దె ఆవిష్కరణ స్థలాన్ని పరిశీలించారు.




## ఎస్‌టీయూటీఎస్ టెట్ అధ్యయన సామగ్రి ఆవిష్కరణ

- ఉపాధ్యాయ అభ్యర్థులకు సమగ్ర మార్గదర్శిగా నిలుస్తాయి
- ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

భైంసా ఆగస్టు 09(జనం సాక్షి) : టెట్ పరీక్షలకు సిద్ధమవుతున్న ఉపాధ్యాయ అభ్యర్థులకు ఉపయోగపడేలా స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ (ఎస్‌టీయూటీఎస్) ఆధ్వర్యంలో రూపొందించిన టెట్ మెటీరియల్‌ను ముధోల్ శాసనసభ్యులు పవర్ రామారావు పటేల్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన అధ్యయన సామగ్రిని అత్యంత తక్కువ ధరలో ఉపాధ్యాయ అభ్యర్థులకు అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. ఉపాధ్యాయ సంఘాలు తమ హక్కుల సాధనతో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయుల అభివృద్ధికి దోహదపడే ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. టెట్‌కు సిద్ధమవుతున్న అభ్యర్థులు ఈ అధ్యయన సామగ్రిని సద్వినియోగం చేసుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు ఎస్. భూమన్న యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో నిపుణులచే రూపొందించిన ఈ అధ్యయన సామగ్రి టెట్ అభ్యర్థులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. సిలబస్‌కు అనుగుణంగా, పరీక్షా విధానాన్ని దృష్టిలో ఉంచుకొని రూపొందించిన ఈ పుస్తకాలు అభ్యర్థులకు విజయానికి మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జె. లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శి బి. వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాంపల్లి నాగభూషన్, ఏ. బాజారెడ్డి, పలిసికల్ శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పోలీస్ కర్ గంగాధర్, గంగాధర్ బోస్లే, పిప్పెర శ్రీనివాస్, బసిరుద్దీన్, కటకం శ్రీనివాస్, మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీనారాయణ, ఎస్. గణపతి, బర్ల గంగాధర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

సంపాదకీయం

# దాడి మమతపై కాదు... ప్రజాస్వామ్యంపైనే!

**రాజకీయ కక్షకు హద్దుల్లేవా? మహిళా నాయకురాలిపై దాడి ఏ సంస్కృతికి నిదర్శనం? రాజకీయ ప్రత్యర్థిని ఓడించడం ప్రజాస్వామ్యం. రాజకీయ ప్రత్యర్థిపై దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని అవమానించడం..!**

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీనియర్ రాజకీయ నాయకురాలు మమతా బెనర్జీపై జరిగిన దాడి తీవ్రంగా ఖండించాల్సిన ఘటన. రాజకీయ విభేదాలు ఉండొచ్చు. సిద్ధాంతపరమైన వైరుధ్యాలు ఉండొచ్చు. ఎన్నికల్లో గెలుపోటములు ఉండొచ్చు. కానీ ఒక మహిళా నాయకురాలు తన పార్టీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న సమయంలో ఆమె వాహనాన్ని అడ్డుకుని బురద, చెప్పులు, రాళ్లతో దాడి చేయడం మాత్రం ఏ ప్రజాస్వామ్య ప్రమాణాలకూ సరిపోదు.

మమతా బెనర్జీ విధానాలను ఎవరైనా తీవ్రంగా వ్యతిరేకించవచ్చు. ఆమె ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు. ఆమె రాజకీయ నిర్ణయాలను ప్రశ్నించవచ్చు. కానీ ఆ విమర్శలు రాళ్లుగా మారిన క్షణంలో ప్రజాస్వామ్యం వెనక్కి వెళ్లిపోతుంది. చెప్పులు, బురద, దాడులు రాజకీయ వాదనలకు ప్రత్యామ్నాయం కావు. అవి రాజకీయ అసహనానికి ప్రతీకలు.

మరీ ముఖ్యంగా, ఒక మహిళా రాజకీయ నాయకురాలిపై ఇలాంటి దాడి జరగడం అత్యంత ఆందోళనకరం. మహిళలకు గౌరవం, భద్రత, సమానత్వం గురించి రాజకీయ వేదికలపై పెద్ద పెద్ద మాటలు చెప్పే నాయకులు, కార్యకర్తలు వాటిని ఆచరణలోనూ చూపించాలి. ప్రత్యర్థి మహిళ అయినప్పుడు గౌరవం తగ్గిపోతే, అది రాజకీయ సంస్కృతికి మాత్రమే కాదు.. సమాజపు విలువలకు కూడా ప్రమాద సంకేతం. ఈ ఘటనను కేవలం మమతా బెనర్జీకి జరిగిన దాడిగా చూడటం పొరపాటు. ఈరోజు దాడి ఒక నాయకురాలిపై జరిగింది. రేపు అదే అసహనం మరో నాయకుడిపై, మరొక కార్యకర్తపై, చివరకు ఒక సామాన్య పౌరుడిపై కూడా మళ్లవచ్చు. రాజకీయ హింసను ఒకసారి సహించటం మొదలుపెడితే దానికి అంతం ఉండదు.

అధికారంలో ఉన్నవారు శాశ్వతంగా అధికారంలో ఉండరు. ప్రతిపక్షంలో ఉన్నవారు కూడా శాశ్వతంగా ప్రతిపక్షంలో ఉండరు. ఎన్నికలు వస్తాయి.. ప్రభుత్వాలు మారతాయి.. నాయకులు మారతారు. కానీ ప్రజాస్వామ్య విలువలు మాత్రం నిలిచి ఉండాలి. రాజకీయ ప్రతీకారం ప్రజాస్వామ్యానికి విషం. రాజకీయ హింస ప్రజాస్వామ్యానికి మచ్చ.

రాజకీయ అసహనం ప్రజాస్వామ్య భవిష్యత్తుకు ప్రమాదం.

పశ్చిమ బెంగాల్‌లో రాజకీయ హింసకు సంబంధించిన ఆరోపణలు గతంలోనూ ఎన్నోసార్లు వినిపించాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ఎవరు బాధితులైనా ఒకే ప్రమాణం ఉండాలి. హింసను హింసగానే ఖండించాలి. బాధితుడు మన రాజకీయ ప్రత్యర్థి అయినా సరే. అందుకే ఈ ఘటనపై రాజకీయ రంగు పులమకుండా సమగ్ర దర్యాప్తు జరగాలి. దాడికి పాల్పడిన వారు ఎవరు? ఎందుకు చేశారు? ముందస్తు హెచ్చరికలు ఉన్నాయా? భద్రతా లోపం ఎందుకు జరిగింది? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలి. తప్పు చేసినవారు ఏ పార్టీకి చెందిన వారైనా చట్టం ముందు నిలబెట్టాలి.

ప్రజాస్వామ్యంలో ప్రత్యర్థిని ఓడించేది ఓటు.. రాయి కాదు. ప్రత్యర్థిని ఎదుర్కొనేది వాదన.. హింస కాదు. నాయకుడిని జయించేది ప్రజల తీర్పు.. దాడి కాదు. మమతా బెనర్జీపై జరిగిన దాడిని ఖండించడం అంటే ఆమె రాజకీయాలను సమర్థించడం కాదు. ప్రజాస్వామ్యంలో రాజకీయ ప్రత్యర్థికీ ఉండాల్సిన హక్కును, గౌరవాన్ని, భద్రతను సమర్థించడం. రాజకీయాలకు హద్దులు లేకపోతే చివరకు ప్రజాస్వామ్యానికే హద్దులు మిగలవు. ఈ దాడికి సమాధానం ప్రతీకారం కాదు, చట్టపరమైన చర్య. ఈ అసహనానికి పరిష్కారం మరో హింస కాదు.. ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ.

జనంసాక్షి

# మక్కా ఒప్పందం: కొత్త శక్తి సమీకరణానికి నాంది

పశ్చిమాసియాలో యుద్ధాలు, క్షిపణి దాడులు, డ్రోన్ దాడులు, ఇరాన్-ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరిన సమయంలో సౌదీ అరేబియా, పాకిస్థాన్, తుర్కియే కుదుర్చుకున్న 'మక్కా జాయింట్ డిఫెన్స్ అగ్రిమెంట్' సాధారణ రక్షణ సహకార ఒప్పందం కాదు. మూడు దేశాల్లో ఏ ఒక్క దేశంపై సాయుధ దాడి జరిగినా, దాన్ని మూడింటిపై జరిగిన దాడిగా పరిగణించాలన్న ప్రధాన నిబంధన ఈ ఒప్పందాన్ని వ్యూహాత్మకంగా అత్యంత ప్రాధాన్యమైన విషయంగా మారుస్తోంది. తుర్కియే విదేశాంగ మంత్రి హకాన్ ఫిదాన్ దీనిని సాంకేతికంగా నాటో ఒప్పందంలోని ఆర్టికల్-5తో సమానమైన పరస్పర రక్షణ సూత్రంగా అభివర్ణించారు. అయితే ఈ ఒప్పందం ఇరాన్‌ను గానీ, మరే ఇతర దేశాన్ని గానీ లక్ష్యంగా చేసుకున్నది కాదని స్పష్టం చేశారు.

ఈ పరిణామానికి నేపథ్యం మరింత ముఖ్యమైనది. 2025 సెప్టెంబరులోనే సౌదీ అరేబియా-పాకిస్థాన్ మధ్య వ్యూహాత్మక పరస్పర రక్షణ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం ఒక దేశంపై దాడిని మరో దేశంపై దాడిగా పరిగణించాలనే సూత్రం అప్పుడే ఏర్పడింది. ఇప్పుడు తుర్కియే చేరడంతో ఆ ద్వైపాక్షిక వ్యవస్థ త్రైపాక్షిక భద్రతా నిర్మాణంగా మారింది. అంతేకాదు, 2026 ఏప్రిల్‌లో సౌదీ అరేబియాకు పాకిస్థాన్ వైమానిక దళానికి చెందిన యుద్ధ, సహాయక విమానాలు చేరడం ద్వారా ఆ పాత ఒప్పందం కేవలం కాగితంపై కాకుండా సైనిక సమన్వయ దిశగా కూడా కదులుతున్నట్టు స్పష్టంగా కనపడుతుంది.

ఈ కూటమి బలం మూడు దేశాల ప్రత్యేక సామర్థ్యాల కలయికలో ఉంది. సౌదీ అరేబియాకు విపరీతమైన ఆర్థిక వనరులు, భారీ రక్షణ వ్యయం ఉన్నాయి. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ప్రకారం 2024లో సౌదీ సైనిక వ్యయం సుమారు 80.3 బిలియన్ డాలర్లు, మధ్యప్రాచ్యంలోనే అత్యధికం. అదే సమయంలో తుర్కియే సైనిక వ్యయం 12 శాతం పెరిగింది. ప్రపంచ సైనిక వ్యయం 2024లో 2.718 ట్రిలియన్ డాలర్లకు చేరి, ఒక్క ఏడాదిలో 9.4 శాతం పెరిగింది. అంటే ప్రపంచం మొత్తం మళ్లీ వేగంగా సైనికీకరణ వైపు వెళ్తున్న సమయంలోనే ఈ కూటమి ఏర్పడింది.

పాకిస్థాన్ చేరిక ఈ సమీకరణానికి మరో కీలక పరిమాణాన్ని ఇస్తుంది. పాకిస్థాన్ అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన దేశం. తుర్కియే



నాటో సభ్యదేశం కావడం, సౌదీ అరేబియా అమెరికాతో దీర్ఘకాలిక భద్రతా సంబంధాలు కొనసాగించడం వల్ల ఈ కూటమిని సూటిగా 'అమెరికా వ్యతిరేక ఇస్లామిక్ నాటో'గా పిలవడం తొందరపాటు. అయితే అమెరికా భద్రతా ఆధారపడకాన్ని కొంతవరకు తగ్గించుకోవాలన్న సౌదీ ప్రయత్నం, తుర్కియే స్వతంత్ర వ్యూహాత్మక పాత్ర పెంచుకోవాలన్న ఆకాంక్ష, పాకిస్థాన్‌కు గల గల్ఫ్ భద్రతా ప్రయోజనాలు కలిసి కొత్త శక్తి కేంద్రాన్ని నిర్మించే అవకాశం మాత్రం ఉంది.

ఇక్కడే ఇరాన్ అంశం అత్యంత సున్నితమైనది. మార్చి 2026లో ఇరాన్ నుంచి గల్ఫ్ దేశాలు, తుర్కియే తదితర దేశాలపై బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ల దాడులు జరిగాయని సౌదీ అధికారిక ప్రకటన పేర్కొంది. ఆ దాడులు చమురు కేంద్రాలు, విమానాశ్రయాలు, సముద్రజల వనరులు వంటి కీలక మౌలిక సదుపాయాలను కూడా లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటి దాడి మళ్లీ జరిగితే, కొత్త ఒప్పందంలోని 'ఒకరిపై దాడి-అందరిపై దాడి' సూత్రం ప్రాంతీయ యుద్ధాన్ని మరింత విస్తరించే ప్రమాదం ఉంది. నిరోధక శక్తి పెరగడం ఒక వైపు ప్రయోజనం అయితే, చిన్న సైనిక సంఘటన పెద్ద కూటమి ఘర్షణగా మారే ప్రమాదం మరోవైపు ఉంది.

భారత్‌కు కూడా ఈ పరిణామం నిర్లక్ష్యం చేయలేని భద్రతా అంశంగా ఉంది. ముఖ్యంగా పాకిస్థాన్, తుర్కియే ఇప్పటికే రక్షణ రంగంలో సన్నిహితంగా ఉన్నాయి. భవిష్యత్తులో భారత్-పాకిస్థాన్ మధ్య సైనిక ఘర్షణ తలెత్తితే తుర్కియే పాత్ర ఏమిటి అన్నది ప్రధానమైన ప్రశ్న? ఆ ఘర్షణలో తుర్కియేకు చెందిన సైనిక వనరులు పాకిస్థాన్ భూభాగంలో దెబ్బతింటే ఈ ఒప్పందం ఎలా వర్తిస్తుంది? ఇలాంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం వ్యూహాత్మక అనిశ్చితిని పెంచుతుంది. అయితే...

భారత్-పాకిస్థాన్ మధ్య జరిగే ప్రతి ఘర్షణ స్వయంచాలకంగా సౌదీ, తుర్కియేలను యుద్ధంలోకి లాగుతుందని ఇప్పటికిప్పుడు నిర్ధారించడం కూడా సరైంది కాదు. ఒప్పందంలోని అమలు విధానం, 'దాడి'కి నిర్వచనం, ప్రతిస్పందన పరిమితులు మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకోవటం కీలకం.

మరో ముఖ్యమైన పరిణామం కూటమి విస్తరణ. తుర్కియే ఇప్పటికే ఈ వ్యవస్థలోకి మరిన్ని దేశాలను తీసుకురావాలనే ఆలోచనను ప్రస్తావించింది. ఈజిప్టు సభ్యదేశంగా చేరే అవకాశం కనిపిస్తోంది. అదే జరిగితే మక్కా ఒప్పందం మూడు దేశాల భద్రతా ఒప్పందం నుంచి విస్తృత ఇస్లామిక్ భద్రతా వేదికగా మారవచ్చు. అయితే మతపరమైన ఐక్యత ఒక్కటే సైనిక కూటమికి పునాది అవుతుందని చెప్పలేం. సభ్యదేశాల పరస్పర ప్రయోజనాలు, ఇరాన్‌తో సంబంధాలు, అమెరికా-చైనా-రష్యా సమీకరణాలు, ప్రాంతీయ రాజకీయ విభేదాలు దాని భవిష్యత్తును నిర్ణయిస్తాయి.

అందువల్ల మక్కా ఒప్పందాన్ని కేవలం 'రక్షణ కోసం మూడు దేశాల ఐక్యత'గా చూడటం సరిపోదు. ఇది పశ్చిమాసియాలో అమెరికా ఆధారిత భద్రతా వ్యవస్థకు ప్రత్యామ్నాయ వ్యవస్థను నిర్మించే ప్రయత్నం, పాకిస్థాన్‌కు గల్ఫ్‌లో వ్యూహాత్మక ప్రాధాన్యం పెంచే అవకాశం, తుర్కియేకు ప్రాంతీయ నాయకత్వ ఆకాంక్షను బలపరిచే సాధనం, సౌదీకి స్వతంత్ర నిరోధక శక్తిని పెంచుకునే ప్రయత్నం. ఇవన్నీ భద్రతా దృష్టితో ప్రధానంగా చర్యలు తీసుకోవాల్సిన అంశాలు.మరో వైపు ఆలోచిస్తే కేవలం ఆయుధాల పెరుగుదల భద్రతకు సమానార్థకం కాదు. పరస్పర రక్షణ కూటములు యుద్ధాన్ని నిరోధించవచ్చు. అదే సమయంలో ఒక యుద్ధాన్ని అనేక దేశాల యుద్ధంగా కూడా మార్చగలవు. అందుకే మక్కా ఒప్పందం అసలు పరీక్ష "ఎంత బలమైన సైనిక కూటమిని నిర్మిస్తుందన్నది కాదు... ఎంత సమర్థవంతమైన దౌత్య నిరోధక వ్యవస్థను నిర్మించి యుద్ధం రాకుండా చేస్తుందన్నదే ప్రధాన మైన చర్చనీయాంశంగా ఉంది.



డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.

# నేహా బోరాపై 'సిరా దాడి అమానవీయం'

జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సీజీఎల్ పరీక్షలలో భారీ ఎత్తున అవకతవకలు, పేపర్ లీక్‌లు జరిగాయంటూ విద్యార్థులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. జైపాల్ సింగ్ ముండా స్టేడియంలో జేపీఎస్సీ - జేఎస్ఎస్సీ సంస్కరణల మంచ్ ఆధ్వర్యంలో జూలై 25 నాడు ప్రారంభమైన ఈ ఆందోళన ఇటీవలి సంవత్సరాలలో జార్ఖండ్ రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద విద్యార్థి ఉద్యమాలలో ఒకటిగా నిలిచింది. ఈ ఆందోళనకు ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరా మద్దతు ప్రకటించి 'జేపీఎస్సీని పునర్వ్యవస్థీకరించాలి. జేఎస్ఎస్సీ సీజీఎల్ పరీక్షలను రద్దు చేసి కొత్త షెడ్యూల్ జారీ చేయాలి. ఇకపై ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా పరీక్షలు నిర్వహించ కూడదు' అని ఆమె డిమాండ్ చేశారు. అదేవిధంగా 'నియామకాలు క్రమం తప్పకుండా, నిష్పక్షపాతంగా జరగడం కోసం విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ల కోసం నిరాహార దీక్ష చేస్తున్నారు. ఐసా విద్యార్థి సంఘం తరపున నేను వారికి నా మద్దతును తెలియజేస్తు న్నాను. జార్ఖండ్ మరియు దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు జంతర్ మంతర్ ఉద్యమం నుండి స్ఫూర్తి పొందాలి' అని జార్ఖండ్ విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో నేహా బోరా విజ్ఞప్తి చేయడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

ఈ క్రమంలో జార్ఖండ్‌లో ప్రదర్శనను కొనసాగిస్తూ ముందుకు సాగుతున్న క్రమంలో నేహా బోరాను 'దేశద్రోహి' అని ఆరోపిస్తూ ఒక వ్యక్తి ఆమెపై సిరా దాడికి పాల్పడడం అమానవీయం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండడం ఏమాత్రం సహేతుకం కాదు. 'ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనల్లో లాఠీ ఛార్జీలు, పెల్లెట్ తుపాకీల కాల్పులనే ధైర్యంగా ఎదుర్కొన్నాను. ఈ చిన్న సిరా దాడికి తాను ఎంతమాత్రం భయపడను. దేశవ్యాప్తంగా పరీక్షల అవకతవకలపై విద్యార్థుల్లో పెరుగుతున్న ఆగ్రహాన్ని ఇటువంటి చర్యలతో అణచివేయలేరు. సిరా దాడికి అస్సలు భయపడడం లేదు. ఈ సిరాను తాము గర్వంగా స్వీకరించి విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగిస్తాము. మేము శాంతియుత ప్రదర్శన నిర్వహిస్తున్నాము' అని నేహా బోరా ప్రకటించడం తద్వారా ఆమెలో ఉన్న ధైర్య సాహసాలకు నిలువెత్తు నిదర్శనాలుగా నిలుస్తాయి.

నియామక పరీక్షలలో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు చేపట్టిన ఉద్యమంలో చేరిన ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, జార్ఖండ్ జనాధికార్ మహాసభ, మహిళా కార్యకర్తలు, పలు ఆదివాసీ సంస్థల సభ్యులచే రాంచీలోని జైపాల్ సింగ్ ముండా స్టేడియం నుంచి శాంతియుతం గా ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీ బిర్సా చౌక్ సమీపానికి చేరుకోగానే గుంపులో నుంచి ఒక వ్యక్తి అకస్మాత్తుగా ముందుకు వచ్చి ఆందోళనకు నాయకత్వం వహిస్తున్న ఆల్ ఇండియా స్టూడెం ట్స్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు నేహా బోరాతో పాటు కొందరు మహిళా నాయకురాళ్లపై అతను ఒక్కసారిగా 'సిరా'ని చల్లాడు. మహిళా కార్యకర్తలను గురి చేసుకొని సిరా చల్లడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. ఈ దాడి వెనుక రాజకీయ కుట్ర ఉందని, విద్యార్థుల హక్కుల పోరాటాన్ని బలహీనపరిచేందుకే బిజెపి, ఆర్ఎస్ఎస్ మద్దతుదారులు ఈ దాడికి పాల్పడ్డారని ఐసా నాయకులు ఆరోపించడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

వైద్య ప్రవేశ పరీక్షల (నీట్) పేపర్ లీకల ఆరోపణల నేపథ్యంలో 'కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి' అని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ఉద్యమం దేశవ్యాప్తంగా చరిత్రగతిని మలుపుతిప్పి నవచరిత్రని సృష్టించింది. ఈ జంతర్ మంతర్ ఉద్యమంలో పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌తో కలిసి నిరవధిక నిరాహార దీక్షలో పాల్గొన్న వారిలో ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్‌కు చెందిన ముగ్గురు నాయకులలో మనీష్ కుమార్, అమీన్ అమిటోజ్‌లతో పాటు నేహా బోరా కూడా ఒకరుగా ఉన్నారు. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేసిన నిరసన ఆ రకంగా పలువురు విద్యార్థి నాయకుల ను పోరాటయోధులుగా వెలుగులోకి మరింత వెలుగులోకి తీసుకు వచ్చింది. ముఖ్యంగా ఈ నిరసనలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయం పరిశోధక విద్యార్థిని నేహా బోరా దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించారు. ఇద్దరు సహ విద్యార్థి నాయకులతో కలిసి ఆమె ఏకంగా 23 రోజుల నిరాహార దీక్షను కొనసాగించి సరికొత్త చరిత్రని సృష్టించారు. ఉత్తరాఖండ్‌కు చెందిన 29 ఏళ్ల నేహా బోరా ఢిల్లీ విశ్వవిద్యాలయంలో తన అండర్ గ్రాడ్యుయేట్ పూర్తి చేసి ఆ తర్వాత ఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం నుండి మాస్టర్స్ డిగ్రీని పొందిన నేహా బోరా ప్రస్తుతం జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఎస్థెటిక్స్‌లో పిహెచ్ డి చేస్తున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో విద్యార్థి కార్యక్రమాలు, క్యాంపస్ కార్యకలాపాలలో చురుకుగా పాల్గొనడమే కాకుండా విద్యా సంస్కరణల నుండి సామాజిక న్యాయం దాకా ఆమె అనేక ఉద్యమాల్లో ముందుండి ఉద్యమిస్తూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు. ఏది ఏమైననూ నేహా బోరాపై జరిగిన సిరా దాడి ఏమాత్రం క్షమార్హం కాదు. మహిళలే లక్ష్యంగా చేసుకొని జరిగిన ఈ ఘటన 'సభ్యసమాజానికి సిగ్గుచేటు' గా నిలుస్తుంది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్న ఈ దేశంలో ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటుండడం కడు విచారకరం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా ఆయా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

# గ్రంథాంతరంగం

తెలుగులో సృజనాత్మకమైన వివిధ ప్రక్రియలలో వెలువడుతున్న రచనలకు దీటుగా విమర్శ రావడంలేదనే అభిప్రాయం ఉంది. కారణం కవులు,రచయితల కంటే విమర్శకులైన వారికి మౌలికమైన ఆయా ప్రక్రియలకు సంబంధించిన పూర్వాపరాలతో పాటు ప్రాచ్య పాశ్చాత్య సిద్ధాంతాలతో కూడిన సాహిత్య పరిచయం అవసరం. వాటి అనుపానులను ఆమూలాగ్రంగా పరామర్శించగలిగిన వారే ఉత్తమ విమర్శకులు కాగలుగుతారు.

తెలుగులో ఆధునిక సాహిత్య విమర్శకు తమ కవితత్వ విచారంతో బీజావాపనం చేసిన కట్టమంచి రామలింగారెడ్డి, సంగీత సాహిత్య సమ్మేళనాల సమన్వయంతో సహృదయ విమర్శకులుగా రాణించిన రాళ్లపల్లి అనంత కృష్ణ శర్మ, నిష్ఠూరమైన నిజాన్నే నిర్భయంగా చెప్పిన రాచమల్లు రామచంద్రారెడ్డిల స్ఫూర్తితో నిర్మాణాత్మకమైన సాహిత్య విమర్శను కొనసాగిస్తూ గత ఆరు దశాబ్దాలుగా తెలుగు సాహిత్య విమర్శను సుసంపన్నం చేస్తున్న విమర్శక వతంసులు ఘట్టమరాజు అశ్వత్థ నారాయణ గారు. ఘట్టమరాజుగా లోక ప్రసిద్ధులైన వారి వ్యాసాలు వివిధ పత్రికలలోనూ సంచికలలోనూ చోటుచేసుకొని అనిదంపూర్వమైన సమాచారాన్ని, విశ్లేషణను అందించాయి.

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నుంచి వెలువడుతున్న సాహిత్య సాంస్కృతిక మాస పత్రిక మూసీ లో ఫిబ్రవరి 2021 నుంచి జనవరి 2024 వరకు ఆయన రాసిన సాహిత్య వ్యాసాలను ఎమెస్కో వారు "గ్రంథాంతరంగం"గా ప్రచురించారు. 250 పుటలలో 30 వ్యాసాలు ఇందులో చోటు చేసుకున్నాయి. ఇందులోని ఒక్కొక్క వ్యాసం పాఠకులకు కొత్త ఆలోచన గవాక్షాలను తెరుస్తుంది. తెలుగులో తొలినాళ్లలో వచ్చిన సాహిత్య చరిత్రను నామమాత్రమైన పరామర్శించకుండా కేవలం పోటీ పరీక్షల నిమిత్తమే రాయబడిన సాహిత్య చరిత్రలను చదువుతూ అదే పరమార్థంగా భావిస్తున్న తరుణంలో ఇన్ని సాహిత్య చరిత్రలు ఉన్నాయా అని ఆశ్చర్యమేస్తుంది. 32 ఏళ్ల వయసులో 1920లో వంగూరి సుబ్బారావు గారు వెలువరించిన ఆంధ్ర వాఙ్మయ చరిత్రము ప్రాధాన్యాన్ని గురించి తెలియజేస్తూ బౌద్ధ జైన బ్రాహ్మణ మతాల స్థితిగతుల నేపథ్యాన్ని తెలుగు కావ్య రచన పై వాటి ప్రభావాన్ని చర్చించడం దీని ప్రత్యేకత అని చెప్పి వేమన శతకము కంటే భారతం అధికమని తలచునంత కాలము మనం ఆంధ్ర శబ్దార్థం నే గ్రహింపని వారమని సాహసించి పలుకవచ్చునని వారు చెప్పిన మాటల్ని ఉటంకించారు. అలాగే ద్విపద కావ్యములను పాటల వాఙ్మయంగా అభివర్ణించటం వంగూరు వారు దూర దృష్టితో చెప్పిన మాట అని "లోనారసిన" విమర్శకునిగా ఘట్టమరాజు గారు చెప్పారు. భావకవిగా పేరొందిన బసవరాజు అప్పారావు గారు 1921లో 6 ప్రకరణములతో వెలువరించిన ఆంధ్ర కవిత్వ చరిత్రలో "భావనాశక్తి వల్ల సృష్టింపబడ్డ కవిత్వం సహృదయుల గుండె లోతుల్లోకి చేరితే, కల్పనా శక్తి ద్వారా వెలువడ్డ కవిత్వం రసికుల హృదయాలను తాకి మాయమవుతుందన్నారు". శైలి విషయంలో బసవరాజు గారిలా చర్చించి విశదీకరించిన వారు ఉన్నారా? అని ప్రశ్నించారు. అక్కిరాజు ఉమాకాంతం గారి "నేటి కాలపు కవిత్వం" భావ కవిత్వాన్ని తీవ్రంగా తూర్పార బట్టింది. ప్రాచీన సంప్రదాయాల్ని తిరస్కరించడం వల్ల నూతనత్వం రాదని కొత్త పద్యాలతో కవిత్వ రాస్తే"అది పద్యాల కొత్త అవుతుంది కానీ కవిత్వంలో కొత్త కాదు కదా!" అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు. అలాగే భావ కవిత్వం పై ప్రత్యేక పరిశోధన గ్రంథాలు రాసిన వారు కూడా ఉమాకాంతం గారంత విస్తృత అధ్యయనం పరిశోధన గాని చేసినట్లు లేదు అని సున్నితంగా విమర్శించారు. ఐదు ప్రకరణాలు గల భోగరాజు నారాయణమూర్తి గారి ఆంధ్ర కవిత్వ చరిత్రము "మహాకవులకు యుగకర్తల గౌరవాన్ని ప్రసాదించగలిగిందే కానీ యుగ లక్షణాలని ప్రతిపాదించే రచనల బేరీజు వేయలేక పోయిందని" అని పరోక్షంగా వాటిని అంచనా వేయవలసి ఉండెనని అభిప్రాయపడ్డారు. పిల్లలమర్రి పినవీరభద్రుడు తన శృంగార శాకుంతల కావ్యాన్ని ఒక సామాన్య గృహస్థుడైన చిల్లర వెన్నయ్యకు అంకితం ఇవ్వడాన్ని ప్రస్తావిస్తూ "రాజాదరణ నుండి ఆంధ్ర కవిత్వము ప్రజాదరణ దశలోకి మారుచున్నదనుటకు నిదర్శనమని "భోగరాజు చెప్పిన మాటలు శిరోధార్యమైనవి. కవిత్వవేదిగా సుప్రసిద్ధులైన కల్లూరు వెంకట నారాయణ రావు గారి "ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహము" నాటి "యుగకాల పరిమితిలోని దేశ సాంఘిక రాజకీయ మత పరిస్థితుల్ని సమీక్షించి ఆ కాలంలో వెలువడ్డ కవిత్వానికి ప్రేరకమైన స్థితిగతుల్ని నిరూపించారని" చెబుతూ ఈ కోణంలో సాహిత్య చరిత్రను అనుశీలించిన వారు అరుదన్నారు. 1923లో విజ్ఞాన శాస్త్ర బోధకులైన గొబ్బూరి వెంకటానంద రాఘవరావు గారు రచించిన ఆంధ్ర గద్య వాఙ్మయ చరిత్ర "కవిత్వాన్ని జ్ఞప్తి పెట్టుకోవడంలో పద్యానికి ఉన్న సౌలభ్యం వచనానికి లేకపోవడం కూడా గద్య రచనలో విలంబం ఏర్పడిందన్నమాట, నన్నయ్య గద్యానికి ప్రాధాన్యం ఇచ్చాడు అన్న ఉటంకింపు విమర్శకుని నిశిత పరిశీలనకు అవగాహనకు ఉదాహరణగా చెప్పవచ్చు. పంచాగ్నుల వారి "ప్రాకృత గ్రంథకర్తలు ప్రజాసేవానూ" అనే వ్యాసంలో అలభ్యంగాను సుబోధకం కాని ప్రాకృత కావ్యాల్ని అనువదించి పాఠకులకు ప్రాకృత రసాస్వాదనాభాగ్యం కలిగించిన మహనీయులు అని కీర్తించారు. పెన్నేటి పాట కవి విద్వాన్ విశ్వం యుక్త వయసులో, కళా ప్రపూర్ణ వేదం వెంకటరాయ శాస్త్రి వార్ధక్య జీవితంలో అనుభవించిన కష్టాలు పాఠకులను ఆర్ద్ర పరుస్తాయి. దేవులపల్లి రామానుజ రావు గారు తమ యాభై ఏళ్ల జ్ఞాపకాలలో రాళ్లపల్లి వారిని గూర్చి రాస్తూ "కొంతమంది ఎంత ప్రతిభావంతులైన వారితో కలిసి ఎక్కువ కాలము గడపలేము. కానీ అనంతకృష్ణ శర్మ గారితో ఎంత కాలం గడిపినను మరికొంత కాలం వారి సమక్షంలో ఉండవలెనని హృదయం కోరుతుండేది" అనే మాటలు రాళ్లపల్లి వారి ఉన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తున్నాయి. పరిశోధన ప్రభాకరులైన వేటూరి ప్రభాకర శాస్త్రి గారు బాల భాషను గురించి రాస్తూ "సరళాక్షర సౌష్టవము, సంగీత ఛాయ, యతి ప్రాస సంగతి, వాక్యార్థ సంగతి పిల్లల పాటల్లో ఉండవలసిన లక్షణాలు" అని చెప్పిన మాటలు బాల సాహిత్య నిర్మాతలకు శాసనం వంటివి. జనమంచి శేషాద్రి శర్మ, మల్లాది సూర్యనారాయణ శాస్త్రి గారి షష్టిపూర్తి సంచికల గురించి, జానకమ్మ ఇంగ్లాండ్ యాత్ర, నీలగిరి యాత్ర, నీలగిరి చరిత్రలను విశ్లేషించిన వైనం ఘట్టమ రాజు గారి నిశిత పరిశీలనకు నిదర్శనంగా చెప్పవచ్చు. దేవులపల్లి కృష్ణపక్షమును అధిక్షేపిస్తూ అనంత పంతుల రామలింగ కవి ప్రకటించిన శుక్లపక్షం ను గురించి రాస్తూ రామలింగ స్వామి గారి "శుక్లపక్షానికి కృష్ణపక్షం వాటిల్లిందని" చురక అంటించారు. పరిశోధన పరమేశ్వరులు నిడదవోలు వెంకటరావు గారి ఆంధ్ర కర్ణాటక సారస్వతములు-పరస్పర ప్రభావము అనే గ్రంథంలో "ద్విపద ఛందస్సులో కావ్యమంతయు చెప్పు పద్ధతిని తెలుగులో మొదట ప్రవేశపెట్టి దానికి పద్య కావ్యములతో సమానమగు ప్రతిపత్తి కల్పించిన వాడు పాల్కురికి సోమనాథుడు" అన్నారు. కాగా సోమనాథుని బసవ పురాణాన్ని క్రీస్తుశకం 1369లో భీమకవి కన్నడలోకి అలాగే పండితారాధ్య చరిత్రను 15వ శతాబ్దం నాటి కన్నడ కవి నీలకంఠాచార్యుడు కన్నడీకరించారని చెప్పారు. కన్నడ సాహిత్యంలో సోమనాథునికి విశేష స్థానం ఉందని చెప్పారు. జూలూరి అప్పయ్య గారు స్వారోచిష మనుసంభవ





టీక, బ్రౌన్ సంపాదకత్వంలో వెలువరించిన తాతాచార్ల కథలు విశిష్టమైనవి. శేషాద్రి రమణ కవుల పరిశోధన వ్యాసమంజరి స్ఫూర్తిగా "నిజాం పాలనలో ముడుచుకుపోయిన శతపత్ర సుందరి నేడు తెలంగాణ రూపంలో సహస్ర పత్ర శోభతో అలరారుతున్నది" అని ఘట్టమరాజు గారు వ్యాఖ్యానించిన తీరును బట్టి గమనిస్తే తెలంగాణ సాహిత్య సాంస్కృతిక చరిత్రను కొత్త పుంతలు తొక్కిస్తున్న సంగనభట్ల నరసయ్య, సంగిశెట్టి శ్రీనివాస్, సుంకిరెడ్డి నారాయణ, నలిమెల భాస్కర్, కాలువ మల్లయ్య,జగన్ ప్రభృతులు స్థానికతకు కలిగిస్తున్న పరిమళం గుర్తుకొస్తుంది. అలాగే గ్రంథంలో అక్కడక్కడ ఆయన చేసిన విమర్శ ఉదాహరణకు "మన విశ్వవిద్యాలయాల్లో చాలామంది తెలుగు ఆచార్య పుంగవులు ఎం. ఏ పాఠ్య క్రమం నుండి వ్యాకరణాన్ని తొలగించేందుకు కంకణ బద్ధులయ్యారు" అనే మాట ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నా ఆచరణీయమైనది కాదు.

తెలుగు సాహిత్య చరిత్ర, విమర్శకు సంబంధించి ఆయన రాసిన వ్యాసాలను తెలుగు విశ్వవిద్యాలయం, తెలుగు అకాడమీ, సాహిత్య అకాడమీ లాంటి సంస్థలు ప్రచురించాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయ విద్యార్థులకు అపూర్వమైన సాహిత్య విమర్శ పరిచయం , పరిజ్ఞానం కలిగించే "గ్రంథాంతరంగాన్ని" పాఠ్యాంశంగా చేర్చాలి. గత ఆరు దశాబ్దాలుగా బెంగళూరులో ఉంటూ తెలుగు భాషా సాహిత్యాలలో వస్తున్న పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ నిరంతర అధ్యయనం, పరిశీలనం, పరిశోధనా దృక్పథంతో రచనలు చేస్తూ సాహిత్య విమర్శకు కొత్త చేర్పును సమకూరుస్తున్న ఘట్టమరాజు గారి హృదయాంతరం నుండి వెలువడిన విశిష్ట గ్రంథం ఈ గ్రంథాంతరంగం.



డాక్టర్ శంకరమంచి
శ్యాంప్రసాద్
99 891 48 305

## ఎక్కడినుంచి వచ్చాం?

ఎక్కడినుంచి వచ్చాం మనం?
అడవుల దారుల నుంచా?
అడుగుజాడల గ్రామాల నుంచా?
పట్టణాల వెలుగుల నుంచా?
దేశాల సరిహద్దుల నుంచా?
ఖండాల అంచుల నుంచా?
ఆఫ్రికా నేల నుంచే కదా
ఆ తొలి అడుగు!
వలసల బాటలో సాగింది
మనిషి ప్రయాణం.
ముఖాలు మారాయి..
పేర్లు మారాయి..
కానీ మనిషి రక్తం ఒక్కటే!
కులం ఎక్కడ పుట్టింది?
నాన్న కులమా? తాత కులమా?
తెలియని ముత్తాత కులమా?
తరతరాల జ్ఞాపకాల్లో
కులం వెతుకుతామా?
శకుంతల కులమేమిటి?
మేనక కులమేమిటి?
భరతుడి కులమేమిటి?
పుట్టుకకే గీతలు గీసేదెవరు?
మనిషికి మనిషే అద్దం కాదా?
కులగర్వం చివరికి మిగిలేది ఏమిటి?
మట్టిలో కలిసిన తర్వాత పేరు ఎవరిది?
తల్లి గర్భంలోకి వచ్చిన
దారి ఎవరికైనా తెలుసా?
పోయే దారి ఎవరికైనా తెలుసా?
జీవితం క్షణికమైన పువ్వు..
మనిషి ఒక చిన్న ప్రయాణికుడు..
దేశం దాటితే ప్రపంచ పౌరుడు..
సరిహద్దులు దాటితే విశ్వ మానవుడు..
కులాలన్నీ కరిగిపోయే చోట
మానవత్వం నిలుస్తుంది..
అంతా ప్రయాణికులమే..
మనమంతా మనుషులమే!



-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

# క్రీడాకారులు జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలి

**వనపర్తి బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు సెప్టెంబర్ మాసంలో శ్రీకాళహస్తిలో జరిగే జాతీయ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో ప్రతిభ కనబరిచి ట్రోఫీ సాధించాలని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి క్రీడాకారులకు సూచించారు. మూడు రోజుల పాటు వనపర్తి లో జరిగిన 72వ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ గవర్నమెంట్ ముగింపు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ కార్యదర్శి వి వి రమణ , వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి రమేష్ ,బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సలహాదారుడు శ్రీనివాసరావు, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మన్మోహన్రావు వెంకట్రాంరెడ్డి ఆర్గనైజింగ్ కార్యదర్శి భాస్కర్ గౌడ్ పాల్గొన్నారు.రాష్ట్రం నలుమూలల నుండి వనపర్తి లో జరిగిన టోర్నమెంట్లో పాల్గొన్న వివిధ జిల్లాల క్రీడాకారులను చిన్నారెడ్డి



ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారులు క్రీడా ప్రతిభను కనబరచడంతో పాటు, విడాస్ఫూర్తిని చాటాలన్నారు.ఆగస్టు 7 నుంచి 9 వరకు నిర్వహించిన 72వ స్టేట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్ బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఆదివారం ఘనంగా ముగిసింది. మూడు రోజుల పాటు జరిగిన టోర్నమెంట్లో పురుషులు, మహిళల విభాగాల్లో క్రీడాకారుల మధ్య హోరాహోరీ పోటీలు జరిగాయి. పురుషులలో ఫస్ట్ ప్లేస్ వరంగల్ 2 హైదరాబాద్ 3 కరీంనగర్ విజయం సాధించారు. అలాగే మహిళలలో 1ఫస్ట్ ప్లేస్ రంగారెడ్డి 2 అదిలాబాద్ 3 వరంగల్ సాధించారు. సమన్వయం, క్రీడాస్ఫూర్తితో పోరాడారు. ప్రతి మ్యాచ్లోనూ ఉత్కంఠభరిత వాతావరణం నెలకొంది. మూడు రోజుల పాటు జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను నిర్వాహకులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడకు మరింత ప్రోత్సాహం లభించేలా ఇటువంటి టోర్నమెంట్లు దోహదపడతాయని నిర్వాహకులు పేర్కొన్నారు.టోర్నమెంట్ ముగింపు సందర్భంగా విజేతలు, ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు, కోచ్లు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ టోర్నమెంట్ ద్వారా సీనియర్ స్థాయి క్రీడాకారులకు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు మంచి వేదిక లభించిందని, భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో మరింత ప్రతిభ కనబరచాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

## ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం పోరాటం



**ఎల్బీనగర్, ఆగస్టు 9 (జనం సాక్షి) :** ప్రపంచ ఆదివాసీ గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో సరూర్నగర్లో కార్యక్రమం నిర్వహించారు. సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రమావత్ సక్రు నాయక్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, గిరిజన రిజర్వేషన్లను 6 శాతం నుంచి 10 శాతానికి పెంచే బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కల్పించాలని డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ను పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు గిరిజనుల ఆచారాలు, భాష, సంస్కృతిని కాపాడాలని కోరారు. గిరిజనులకు నాణ్యమైన విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. హక్కులు, ఆత్మగౌరవం కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సరూర్నగర్ మండల ప్రధాన కార్యదర్శి చర్లపల్లి వీరయ్య, వడ్త్యా బుజ్జి, టి.రాము, ముఖేష్, గణేష్, కోటి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు 9 (జనం సాక్షి) :** వర్షాలు తక్కువగా కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఆరుతడి పంటలపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు . కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా పంట కుంటలు నిర్మించుకోవాలని, హార్టికల్చర్, ఆయిల్పామ్, ఆరుతడి పంటల సాగు వైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్లలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపికపై రైతులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని, కాలువల కింద వరి సాగు విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు తెలిపారు. ఈ నెల 8న ఇరిగేషన్ అడ్వైజరీ బోర్డుల సమావేశాలు నిర్వహించి తగిన నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలతో పలు ఎంఐ ట్యాంకులు నిండాయని తెలిపారు. జిల్లాలో ప్రధానంగా పత్తి, సోయాబీన్, కంది పంటలు సాగవుతున్నాయని, రైతులను పంటల వైవిధ్యీకరణ వైపు ప్రోత్సహిస్తూ ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. ఆయా శాఖలు చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

## అలంపూర్ నవబ్రహ్మ ఆలయాల అభివృద్ధికి ఎంపీ మల్లు రవికి వినతి

**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 9 (జనం సాక్షి) :** అలంపూర్ దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన అలంపూర్ నవబ్రహ్మ ఆలయాల సమూహానికి యునెస్కో వరల్డ్ హెరిటేజ్ సైట్ గుర్తింపు తెచ్చేందుకు కృషి చేయాలని, అలాగే స్థానిక పుణ్యక్షేత్రంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించాలని జోగులాంబ గద్వాల జిల్లా సీనియర్ సిటిజన్స్ ఫోరమ్ అధ్యక్షుడు కే. మోహన్ రావు, అచ్చన్న గౌడ్ లు సంయుక్తము గా హైదరాబాదులో నాగర్కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవిని కోరారు. ఈ మేరకు ఆయనకు ఒక వినతిపత్రాన్ని సమర్పించారు. అలంపూర్ ఆలయం కేవలం ఆధ్యాత్మిక ప్రాముఖ్యత మాత్రమే కాకుండా, అద్భుతమైన శిల్పకళా వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఇక్కడ పర్యాటకం పెరిగితే స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, కావున ప్రభుత్వం తక్షణమే స్పందించి క్రింది డిమాండ్లను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.?రవాణా సౌకర్యాల మెరుగుదల, అలంపూర్ చేరుకోవడానికి సరైన రవాణా వసతులు లేవనీ ,తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా, అలంపూర్ చౌరస్తా నుండి దేవస్థానం వరకు దేవస్థానమే సొంత బస్సులను నడపాలని లేదా ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని కోరారు.



కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని "ప్రసాదం స్కీమ్" భవనంలో అన్నదాన కార్యక్రమాలు, వసతి గదులు, పరిశుభ్రత సరిగా లేవని తెలిపారు. టోకెన్ విధానం ద్వారా అన్నదానం అందించేలా, సరైన సూచన బోర్డులు,పారిశుధ్య కార్మికులను ఏర్పాటు చేసి దేవస్థానం కార్యనిర్వాహక అధికారి కి తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. బాల బ్రహ్మేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు, ముఖ్యంగా వయోవృద్ధులు ప్రసాద వితరణ ప్రాంగణానికి చేరుకోవడానికి వీలుగా ఉచిత లేదా రాయితీ ఎలక్ట్రికల్ ఆటోలను నడపాలని విజ్ఞప్తి చేశారు. భక్తుల సంక్షేమం, చారిత్రక ప్రాధాన్యత కలిగిన అలంపూర్ ఆలయాల సమగ్ర అభివృద్ధిపై ఎంపీ మల్లు రవి సానుకూలంగా స్పందించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆశాభావం వ్యక్తం చేసిందనీ మోహన్ రావు అన్నారు.

## మంతన్గౌరల్లిలో ఘనంగా బంజారా శీతలా పండుగ



**యాచారం, ఆగస్టు 9 (జనం సాక్షి) :** మండల పరిధిలోని మంతన్ గౌరల్లి గ్రామంలో బంజారా సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా శీతలా పండుగను అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కొర్ర అరవింద నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలో గ్రామ ప్రజలందరూ భారీ ఎత్తున ఉత్సాహంగా పాల్గొన్నారు. పూర్వీకులనాటి ఆచారాలను ప్రతిబింబించేలా సాగిన ఈ కార్యక్రమంలో బంజారా సంప్రదాయ వేషధారణలు, ప్రత్యేక పూజలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకుంటూ గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు జరిపారు. ఈ వేడుకకు పలువురు ప్రముఖులు విచ్చేసి సందడి చేశారు. డీసీసీ జిల్లా సెక్రెటరీ సభావట్ మధుకర్ నాయక్, గ్రామ ఉప సర్పంచ్ యాట శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు అబ్బనగోని సోమయ్య యాదవ్ మరియు వార్డు సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొని వేడుకలను మరింత ఘనంగా మార్చారు. బంజారా సంస్కృతి గొప్పతనాన్ని భావితరాలకు చాటిచెప్పేలా సాగిన ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు.

## ఓయూ లో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**సికింద్రాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ఉస్మానియా యూనివర్సిటీలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఆదివాసీ విద్యార్థి ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపకులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఓయూ ప్రధాన ద్వారం నుండి ఆర్ట్స్ కళాశాల వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీల సాంప్రదాయ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని ఆదివాసీ సంస్కృతి, కళలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నేతలు మాట్లాడుతూ... ఆదివాసీ యువత విద్య, ఉద్యోగ రంగాల్లో మరింత ముందుకు రావాలని, రాజ్యాంగం కల్పించిన హక్కులు, రిజర్వేషన్లను సమర్థంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివాసీ సంస్కృతి, వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు. ఆదివాసీల హక్కులు, సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న విద్య, ఉపాధి, భూమి, అటవీ హక్కుల సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అజయ్, ఏఈడబ్ల్యూసీఏ జాతీయ అధ్యక్షులు గోంది వెంకటరమణ, కోశాధికారి మెట్ల పాపయ్య, ఆప్కా నాగేశ్వర్ రావు, మెస్రం నాగోరావు, సోడే రాంబాబు, రాజశేఖర్, గౌతం దొర తదితరులు పాల్గొన్నారు.

## రైతు, కూలీ, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి



**మహమ్మదాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు,కూలీ,కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఏ.రాములు అన్నారు. ఈనెల10,న మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జైలు భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ,ఆదివారం మహమ్మదాబాద్ మండల పరిధిలోని,నంచర్ల గేటు నుంచి హన్వాడ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా రాములు మాట్లాడుతూ..29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకురావడం ద్వారా కార్మిక హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించి కూలీలకు రోజుకు రూ.600,కూలి చెల్లించాలని,డిమాండ్ చేశారు.రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుండుమల్ల నర్సింలు,ఎం.లక్ష్మయ్య మాట్లాడుతూ..రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జైలు భరో కార్యక్రమానికి రైతులు,కూలీలు,కార్మికులు, విద్యార్థులు యువత కదిలి పెద్ద సంఖ్యలో తరలిరావాలని,పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎం.కురుమయ్య, టంకర రాములు,ఎం.రాములు,బాలకృష్ణయ్య,కొమ్ముకిష్టయ్య, రాజు, కేశవులు, భీమయ్య, పాండు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలి



**సికింద్రాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలని, సేవా కార్యక్రమాలు చేసే వారికి అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని సమాజ సేవకుడు, బిజెపి నాయకుడు శ్రీరామ్ వెంకటేష్ అన్నారు. బోనాల సందర్భంగా తార్నాక లోని నల్ల పోచమ్మ అమ్మవారి దేవాలయంలో ఏర్పాటుచేసిన పూజా కార్యక్రమానికి శ్రీరామ్ వెంకటేష్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయానికి వచ్చే భక్తుల కోసం అన్నప్రసాదం, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి హాజరై అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ వెంకటేష్ మాట్లాడుతూ అమ్మవారి దర్శనానికి విచ్చేసిన దాదాపు 1,500 మంది భక్తులకు ప్రసాదం ఏర్పాటు చేసి, భక్తుల సౌకర్యార్థం మంచినీటి బాటిళ్లను అందించడం జరిగిందన్నారు. తార్నాక ప్రజల సేవలో తాము ఎప్పుడూ ఉంటామన్నారు. అమ్మవారి చల్లని కృప ప్రతి ఇంటిపై ఉండాలని, ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో, ఐశ్వర్యంతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరు సేవా భావంతో మెలగాలని సూచించారు. భక్తి ఉన్న చోట సేవ ఉంటుందని, సేవ ఉన్న చోట అమ్మవారి ఆశీర్వాదం ఉంటుందన్నారు.

## బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

**ఉప్పల్, ఆగస్టు 9 (జనం సాక్షి) :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తెలంగాణ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. బోనాలు కేవలం అమ్మవారికి సమర్పించే నైవేద్యం మాత్రమే కాదని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, భక్తి విశ్వాసాలకు, తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. పోతరాజుల వీరత్వం, డప్పుల దరువులు, అమ్మవారి ఘటాల ఊరేగింపులు, ఆడపడుచుల భక్తిశ్రద్ధలు తెలంగాణ జీవన సంస్కృతికి సజీవ రూపాలని అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కూడా తెలంగాణ సంస్కృతి, భాష, యాస, పండుగలు ప్రజలను ఏకం చేసిన



శక్తిగా నిలిచాయని గుర్తుచేశారు. ఆలయాల వద్ద భక్తులను కలిసి ఎమ్మెల్యే బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆడపడుచులందరికీ, ప్రజలందరికీ బోనాల పండుగ ఆరోగ్యం, ఆనందం, ఐశ్వర్యం, సుఖసంతోషాలను అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా కాలనీలకు చెందిన ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## గోమారంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల ఘర్షణ

- ఇరువర్గాలను చెదరగొట్టిన పోలీసులు



**శివ్వంపేట, ఆగస్టు 9 (జనంసాక్షి) :** శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు ఫ్లెక్సీ వివాదంగా రగడకు దారితీసి గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొన్నది. వివరాలలోకి వెళితే బోనాల ఉత్సవాల సందర్భంగా ఆదివారం బీఆర్ఎస్ నాయకులు ఫ్లెక్సీ ఏర్పాటు చేసుకున్నారు. అయితే దానికి అడ్డుగా కాంగ్రెస్ నాయకులు కావాలని కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఘర్షణకు దిగారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్ఐ మధుకర్ రెడ్డి ల ఆధ్వర్యంలో ఇరువర్గాలను చెదరగొట్టి ఉద్రిక్త పరిస్థితులను తగ్గించారు. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ కావాలనే కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంతో మేము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కనిపించకూడదనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీ అడ్డుగా వేయడం జరిగిందని, ప్రశ్నించిన పాపానికి దౌర్జన్యంతో దాడులు చేశారని విలేకరులకు తెలిపారు. ఘరణ సందర్భంగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# బీసీ గురుకుల విద్యార్థులపై దాడిపై సమగ్ర విచారణ జరపాలి

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తాండూరు నగర శాఖ డిమాండ్

**తాండూరు, అగస్టు 9 (జనంసాక్షి) :** పట్టణ సమీపంలో ని హైదరాబాద్ రోడ్డు మార్గంలో బీసీ గురుకుల పాఠశాలలోకి బయటి వ్యక్తులు ప్రవేశించి విద్యార్థులపై దాడి చేసిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తాండూరు నగర శాఖ డిమాండ్ చేశారు. విద్యార్థులు చదువుకునే గురుకుల పాఠశాల ప్రాంగణంలోకి బయటి వ్యక్తులు ప్రవేశించి విద్యార్థులు, కళాశాల సిబ్బందిపై దాడికి పాల్పడటం అత్యంత ఆందోళనకరమైన విషయమని ఎబివిపి నగర అధ్యక్షులు నర్సింలు పేర్కొన్నారు. విద్యార్థులకు రక్షణ కల్పించాల్సిన పాఠశాల యాజమాన్యం, సంబంధిత అధికారులు భద్రత విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఈ



ఘటనకు బయటి వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలోకి ఎలా ప్రవేశించారు. వారికి ఎవరు అనుమతి ఇచ్చారు. విద్యార్థులు, సిబ్బందిపై దాడి చేసే పరిస్థితి ఎందుకు ఏర్పడింది అనే అంశాలపై అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులు, కళాశాల సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని గుర్తించి వెంటనే అరెస్టు చేసి, కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటనలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా సంబంధం ఉన్న వారందరిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అనుమతి లేకుండా బయటి వ్యక్తులు పాఠశాల ప్రాంగణంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై కళాశాల సిబ్బందిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేదంటే ఎబివిపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి నాయకులు అజయ్,నవీన్,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఐసీ ఏజెంట్ల హక్కుల సాధనకు బ్లియాస్ నిరంతర పోరాటం

- **కార్మికుల హక్కుల కోసం 70 ఏళ్లుగా పోరాడుతున్న ఘనత బీఎంఎస్‌దే**
- **బ్లియాస్ సౌత్ జోనల్ జనరల్ సెక్రటరీ మలిశెట్టి బాలస్వామి**
- **బ్లియాస్ హడక్ కమిటీ నియామకం**

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ఎల్ఐసీ ఏజెంట్ల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్)కు అనుబంధంగా పనిచేస్తున్న భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సంఘం (బ్లియాస్) నిరంతరం పోరాటం చేస్తోందని బ్లియాస్ సౌత్ జోనల్ జనరల్ సెక్రటరీ మలిశెట్టి బాలస్వామి అన్నారు. ఏజెంట్ల హక్కులను సాధించడంతో పాటు వారి సంక్షేమం కోసం బ్లియాస్ మరింత బలమైన ఉద్యమాన్ని కొనసాగిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బ్లియాస్ యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అఖిల భారత ఈసీ మెంబర్ ఆర్. రాములు, హైదరాబాద్ డివిజన్ జనరల్ సెక్రటరీ భాను ప్రకాష్, జడ్చర్ల బ్రాంచ్ అధ్యక్షుడు శోభన్ బాబుతో కలిసి ఆయన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ భారత కార్మిక ఉద్యమంలో బీఎంఎస్ 70 సంవత్సరాలుగా స్థిరమైన, ప్రత్యేకమైన ప్రభావాన్ని చూపుతోందన్నారు. త్యాగం, తపస్సు, బలిదానం అనే భావనలను కార్మికుల్లో పెంపొందిస్తూ వారి హక్కుల కోసం బీఎంఎస్




నిరంతరం పోరాడుతోందని తెలిపారు. 1955 జూలై 23న జాతీయవాది, ప్రముఖ కార్మిక నాయకుడు దత్తోపంత్ ఠేంగ్డే మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో భారతీయ మజ్దూర్ సంఘ్‌ను స్థాపించారని ఆయన వివరించారు. అప్పటి నుంచి నేటి వరకు వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం బీఎంఎస్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. భారతీయ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ సంఘం (బ్లియాస్) 1999లో కేరళలో ట్రేడ్ యూనియన్స్ యాక్ట్--1926 కింద కేంద్ర యూనియన్‌గా రిజిస్టర్ అయిందని బాలస్వామి తెలిపారు. అనంతరం దాని కార్యకలాపాలను విస్తరిస్తూ సౌత్ సెంట్రల్ జోన్‌లో కౌన్సిల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బీఎంఎస్ సహకారం, పర్యవేక్షణతో బ్లియాస్ పనిచేస్తోందని తెలిపారు. ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమానికి సంబంధించి పలు ముఖ్యమైన అంశాల్లో బ్లియాస్ కీలక పాత్ర పోషించిందన్నారు. ముఖ్యంగా గ్రాట్యుటీని రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచడంలో యూనియన్ కృషి చేసిందని తెలిపారు. అదేవిధంగా క్లా బ్యాక్ కమిషన్ నిర్ణయాన్ని రద్దు చేయించే విషయంలో ఫైనాన్స్ మినిస్ట్రీతో చర్చలు జరిపి ఏజెంట్ల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేశామని చెప్పారు. ఇన్సూరెన్స్‌పై జీఎస్టీ మినహాయింపు సాధించేందుకు కేంద్ర ప్రభుత్వంతో కీలక చర్చలు జరిపినట్లు వివరించారు. ఆల్ క్లబ్ మెంబర్స్‌కు క్వాలిఫైయింగ్ రిలాక్సేషన్ సాధించడంలో కూడా బ్లియాస్ కృషి చేసిందన్నారు. 2024లో ఎల్ఐసీ ఏజెంట్లకు సంబంధించిన ట్రైనింగ్, మెంబర్‌షిప్, బ్రిగేడ్‌షిప్ అలవెన్స్ పెంపు కోసం యూనియన్ విశేషంగా కృషి చేసిందని తెలిపారు. ఎల్ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను యూనియన్ తన సమస్యగా భావించి పరిష్కారం కోసం పోరాడుతుందని బాలస్వామి హామీ ఇచ్చారు. ఏజెంట్లకు న్యాయం జరిగే వరకు బ్లియాస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఏజెంట్లు సంఘటితంగా ఉండి తమ హక్కుల సాధన కోసం యూనియన్‌కు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

### నూతన అడహాక్ కమిటీ ఏర్పాటు

సమావేశం అనంతరం నాగర్‌కర్నూల్ బ్రాంచ్ కు నూతన అడహాక్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షుడిగా కారువంగ పాపులు, ప్రధాన కార్యదర్శిగా పసుపుల లక్ష్మయ్య, ట్రెజరర్‌గా కుంభం ప్రకాష్ గౌడ్‌లను నియమించారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు సుఖ జీవన్ రెడ్డి, శ్రీనివాసులుతో పాటు ఎల్ఐసీ ఏజెంట్లు ప్రతాప్ రెడ్డి, ఆంజనేయులు, సుధాకర్ గౌడ్, హకీం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం



**జడ్చర్ల, ఆగస్టు 9 (జనంసాక్షి) :** రాహుల్ గాంధీని దేశానికి ప్రధానమంత్రిగా చేయడమే లక్ష్యంగా యువజన కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సిగ్నల్ గడ్డ చౌరస్తాలో జాతీయ యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జడ్చర్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో పోరాటాలు చేసి, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇంచార్జ్ శివంత్ రెడ్డి, జడ్చర్ల పట్టణ నాయకులు అశోక్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు మిన్హాజ్, మా?క్ షాకిర్, నిత్యానందం, గోపాల్ యాదవ్, వంశీకృష్ణ, షకీల్, కృష్ణ, ఆది, గణేష్, వంశీ, రఘు, నసీర్, తుంగ రఘు, శ్రీకాంత్, అవేజ్, శ్రీనివాస్ యాదవ్, సంధ్య, మహేష్ యాదవ్, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మణ్ నాయక్, ఇంతియాజ్, మల్లికార్జున్, సల్మాన్, సంజీవ్ రెడ్డి, మొహ్మద్, శేఖర్, నరేష్, శివలింగం, రమేష్ యాదవ్, మాసూమ్ పాల్గొన్నారు.

# మైపాల్ రెడ్డి తల్లి లక్ష్మీ ఆత్మకు శాంతి చేకూరాలి

- **మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు**

**తూప్రాన్, ఆగస్టు 9 (జనం సాక్షి) :** కాంగ్రెస్ నాయకుడు చిట్కుల్ మైపాల్ రెడ్డి తల్లి లక్ష్మీ ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు మెదక్ ఎమ్మెల్యే మైనాపల్లి డాక్టర్ రోహిత్ రావ్ తెలిపారు .మైపాల్ రెడ్డి తల్లి సంవత్సరీకానికి హాజరైన ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ పూలమాల వేసి నివాళులు అర్పించారు.



సంవత్సరీక కార్యక్రమం నేడు మనోహరాబాద్ లోని శుభం గార్డెన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ గారు ముఖ్య అతిథిగా హాజరై, ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైపాల్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దివంగతుల ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తూప్రాన్ మనోహరాబాద్ వివిధ మండలాలకు చెందిన నాయకులు, ధర్మేందర్, జావీద్, అప్సర్, నర్సింగరావు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సర్ సకాలంలో పూర్తి చేయాలి

**దేవరకద్ర, ఆగస్టు 9 (జనం సాక్షి) :** దేవరకద్ర అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన తహసీల్దార్లు/ఏఈఆర్ఓలు బీఎల్ఓ సూపర్‌వైజర్లతో సర్ 2026 పై , జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.పి.డి.ఓ.లు, ఎంఈ ఓ లతో పాఠశాలలు, కె .జి.బి.వి.లు,గురుకుల పాఠశాలలలో ఈ నెల 11,12 తేదీ లలో చేపట్టే లిప్రత్యేక క్లీనింగ్ డ్రైవ్" పై,పాఠశాలల్లో విద్యార్థుల భద్రత,నిర్వహణపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదివారం వెబెక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.ఐ.ఆర్-2026కు సంబంధించిన కొనసాగుతున్న కార్యకలాపాలను కూడా సమీక్షించి సూచనలు చేశారు.,అభివృద్ధి పనుల పురోగతిని నిశితంగా పర్యవేక్షించాలని, ప్రభుత్వ సంక్షేమ ప్రతిష్టాత్మక పథకాల సరైన అమలును నిర్ధారించాలని,



ఎస్ఐఆర్-2026 సంబంధిత కార్యకలాపాలను నిర్దేశిత కాలపరిమితిలోగా విజయవంతంగా పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించడం జరిగింది. ఆశించిన ఫలితాలను సాధించడానికి క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వివిధ విభాగాల మధ్య సమన్వయం, సమస్యల సత్వర పరిష్కారం యొక్క ప్రాముఖ్యతను అదనపు కలెక్టర్ చెప్పారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత,ఉన్నత పాఠశాలల హెడ్ మాస్టర్ లు,ఉపాధ్యాయులకు పాఠశాల భద్రత,నిర్వహణ పై ఆయన ముఖ్యమైన సూచనలు చేశారు పాఠశాలల పరిశుభ్రత మరియు విద్యార్థుల భద్రతకు సంబంధించి ఎం .ఈ. ఓ లకు, ఎం.పి.డి.ఓలకు కఠినమైన సూచనలు ఇవ్వడం జరిగింది. ఇటీవల నారాయణపేట జిల్లాలో జరిగిన దురదృష్టకర సంఘటనలో, ఒక చిన్నారి పాము కాటుకు గురై ప్రాణాలు కోల్పోయిన విషయం మనందరికీ తెలిసిందే. ఇలాంటి సంఘటనలు మన జిల్లాలో చిన్నపాటి నిర్లక్ష్యం వల్ల కూడా జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం మనందరి బాధ్యత అని ఆయన అన్నారు.

# ఘనంగా తూప్రాన్ ఉజ్జయిని మహంకాళి జాతర

- **బోనం సమర్పించిన టిఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి**
- **మున్సిపల్ చైర్మన్ రజిని రవీందర్ గౌడ్**

తూప్రాన్, ఆగస్టు 9 (జనం సాక్షి) : తూప్రాన్ ఉజ్జయిని మహంకాళి జాతర ఉత్సవాలు ఆదివారం రోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ గొంది రజిని రవీందర్ గౌడ్ వైస్ చైర్మన్ సమత కాశి రెడ్డి కౌన్సిలర్లు జైపాల్ రాథోడ్ ల ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు అనంతరం బోనాల కార్యక్రమం ప్రారంభించారు మున్సిపల్ చైర్మన్ రజిని రవీందర్ గౌడ్ మెదక్ బి ఆర్ఎస్ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ సమత కాశిరెడ్డి జోష్ణ వేణు జైపాల్ రాథోడ్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో డప్పు చప్పులతో బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు మధ్యాహ్నం నుండి వివిధ కుల సంఘాలు బ్యాండ్ మేళాలు డప్పు చప్పులతో పోతురాజు విన్యాసాలు ఊరేగింపుతో వచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించారు. యువకులు ఫలహారము ఊరేగింపుగా వచ్చి అమ్మవారి సమర్పించారు. రవీందర్ గౌడ్



ఆధ్వర్యంలో ఊరేగింపుగా వచ్చి ఓడి బియ్యం ఫలహారం సమర్పించారు. తూప్రాన్ ఆర్యవైశ్య మహిళ సంఘం అధ్యక్షురాలు గబ్బుల సంతోషా ఆధ్వర్యంలో అమ్మవారికి ఊరేగింపుగా వచ్చి ఓడి బియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రమేష్, కౌన్సిలర్ సప్ప నాగరాజు గౌడ్, జోష్ణ వేణు ,బొడ్డు రాధా శ్రీనివాస్ ,సరిత నాగేష్, అన్నపూర్ణ నారాయణ గుప్తా, జైపాల్ రాథోడ్, బైరం సత్య లింగం, చెలిమెల రాములు, మాజీ కౌన్సిలర్లు పుర ప్రముఖులు పాల్గొన్నారు. థండర్ క్రికెట్ టీమ్ ఆధ్వర్యంలో వచ్చిన భక్తులకు పులిహోర నీరు లడ్డు పంపిణీ చేశారు.

# ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ, అనుబంధ సంఘాల నూతన కమిటీల నిర్మాణం చేపట్టాలి

- **ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జీ కొమ్మువారి మస్తాన్ మాదిగ**

**పెబ్బేరు, ఆగస్టు 9 (జనం సాక్షి) :** మూడు దశాబ్దాలుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో రాజీలేని పోరాటం చేసి ఎస్సి వర్గీకరణను సాధించారు. మాదిగలతో పాటు పేద వర్గాల సంక్షేమం కోసం ఉద్యమాలు నడిపి పలు అనేక సంక్షేమ పథకాలు సాధించిన ఎమ్మార్పీఎస్ ఉద్యమం మత దురహంకారం, కుల వివక్షత, సాంఘిక అసమానతలు లేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడుతుందన్నారు, ప్రజా సమస్యలను గుర్తించి బలమైన ప్రజా పోరాటాలను నిర్మిస్తుందన అన్నారు. ఎమ్మార్పీఎస్ పెబ్బేరు మండల ఇంచార్జ్ మీసాల నాగరాజు మాదిగ అధ్యక్షత వహించారు. మాలపల్లి మాజీ ఎంపిటిసి మన్యం మాదిగ సమన్వయం చేశారు. ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా ఇంచార్జ్ కొమ్మువారి మస్తాన్ మాదిగ మాట్లాడుతూ,రాజకీయ చైతన్యాన్ని సృహను విడువకుండా బలమైన ప్రజా పోరాటాలను నిర్మించాలని అందుకు గ్రామ స్తాయిలో అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పోరాడాలని అన్నారు. అన్ని అనుబంధ విభాగాల కమిటీలు రద్దు చేశారు. నూతన గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకొని అన్ని అనుబంధ విభగాలను




సంస్థగతంగా పునరనిర్మాణం చేసుకొని శక్తివంతంగా తయారు చేయాలని అన్నారు. నూతన విద్యార్థి, యువ తరాన్ని ఉద్యమంలోకి తీసుకోచ్చి క్షేత్ర స్థాయిలో శ్రమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ , గంధం గట్టయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మంద నరసింహ మాదిగ, గుమ్మడం గ్రామ నాయకులు బొల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు.


# సెప్టెంబర్ ఒకటిలోపు సీపీఎస్ రద్దు చేయాలి

**మెదక్ బ్యూరో, ఆగస్టు 9 (జనం సాక్షి) :** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎల్. మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మెదక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే సెప్టెంబర్ ఒకటిలోపు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలులో ఉన్న సీపీఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. రెండు వేల మూడు డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయడంతో పాటు, ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చాలా కాలంగా




పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని అన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నిర్ణీత గడువులోగా పరిష్కరించకపోతే పీఆర్టీయూ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని ఎల్. మల్లారెడ్డి హెచ్చరించారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సుభాష్ రెడ్డి, నందారం రఘుబాబు, నరేందర్ రెడ్డి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి విరాళాలు అందించాలి



**నారాయణపేట, ఆగస్టు 9 (జనంసాక్షి) :** పట్టణ పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు డాక్టర్ క్యాతన్ రఘునాథ్ పద్మశాలిలకు విజ్ఞప్తి చేశారు. ఆలయ అభివృద్ధి తో పాటు ఇతర నిర్మాణ పనుల కై ప్రతి పద్మశాలి కుటుంబ సభ్యులు తమకు తోచినంత వార్షిక చందా విరాళాలు ఇవ్వాలని పట్టణ పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షులు డాక్టర్ క్యాతన్ రఘునాథ్ కోరారు. పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో ఆదివారం పద్మశాలీల కుటుంబ సభ్యుల ఇంటింటికి తిరుగుతూ చందా విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్త మార్కండేయ స్వామి వారి ఆలయ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు తమకు తోచిన విధంగా విరాళాలు ఇవ్వాలని అన్నారు. కావున పద్మశాలిల కుటుంబ సభ్యులు, భక్తులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి వేడుకలను జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు నీది బాలరాజు, పాపయ్య, కర్లీ వరప్రసాద్ పాల్గొన్నారు.

# సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు



**జడ్చర్ల, ఆగస్టు 9 (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆహ్వానం మేరకు** జూబ్లీహిల్స్‌లో ఆదివారం నిర్వహించిన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి బోనాల ఉత్సవాల్లో జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమన్నారు. బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులకు, నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ ప్రజలందరికీ శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# ఉప సర్పంచుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

- **రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బొట్ల కార్తీక్**
- **రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసిన నారాయణపేట జిల్లా అధ్యక్షుడు మ్యాతరి గోపాల్**

**మక్తల్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** గ్రామస్థాయి ప్రజాప్రతినిధులైన ఉప సర్పంచులు, వార్డు సభ్యుల హక్కుల పరిరక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఫోరం ఆధ్వర్యంలో నిరంతరం కృషి చేస్తామని రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొట్ల కార్తీక్ స్పష్టం చేశారు. హైదరాబాద్ బేగంపేటలోని రాష్ట్ర కార్యాలయంలో నారాయణపేట జిల్లా ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మ్యాతరి గోపాల్, తొలిసారిగా బొట్ల కార్తిక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొట్ల కార్తిక్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా బొట్ల కార్తిక్ మాట్లాడుతూ నారాయణపేట జిల్లాలో ఫోరంను మరింత బలోపేతం చేయాలని సూచించారు. జిల్లాలోని 13 మండలాల్లో వీలైనంత త్వరగా మండల కమిటీలను, మహిళా విభాగం (ఉమెన్ వింగ్) కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని, వార్డు సభ్యుల కమిటీల ఏర్పాటుపై కూడా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. నారాయణపేట జిల్లా అధ్యక్షుడు మ్యాతరి గోపాల్ మాట్లాడుతూ జిల్లాలోని ఉప సర్పంచుల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తనకు ఈ బాధ్యత దక్కడంలో సహకరించిన టీఎంఎస్‌టీఏ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కావలి కార్తీక్ స్వేరోకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



గ్రామస్థాయిలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రజాప్రతినిధుల సమస్యల పరిష్కారానికి సమిష్టిగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచుల ఫోరం నారాయణపేట జిల్లా అధికార ప్రతినిధి ఎం. రాజు, టీఎంఎస్‌టీఏ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కావలి కార్తీక్ స్వేరో, యంకి చంద్రశేఖర్, వార్డు సభ్యుడు ఎం. బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

# అమూల్యమైన వారసత్వం ఆదివాసీలది

- ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా



**మావల, ఆగస్ట్ 10 (జనంసాక్షి):** ప్రకృతితో ముడిపడిన జీవనశైలితో పాటు అమూల్యమైన వారసత్వమును ఆదివాసీలు అందిస్తున్నారని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ అఖిల్ మహాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొమురం భీం, రాంజీ గోండు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి, ఆదివాసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గిరిజన సంస్కృతి సంప్రదాయాల ప్రకారం పూజలు చేశారు. అనంతరం ఆదివాసులతో కలిసి ఉత్సాహంగా కలెక్టర్, ఎస్పీ నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు, గిరిజన నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట దర్గా ఉర్సు షరీఫ్‌కు ఏర్పాట్లు పూర్తి




**కాజీపేట, ఆగస్టు 9(జనం సాక్షి) :** హజ్రత్ సయిద్ షా అఫ్జల్ బియాబాని దర్గా కాజీపేటలో నిర్వహించనున్న ఉర్సు షరీఫ్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. ఉర్సు షరీఫ్ ఏర్పాట్లపై దర్గా ప్రాంగణంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , దర్గా పీఠాధిపతి, రాష్ట్ర చైర్మన్ కుసూర్ పాషా మాట్లాడారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ ఉర్సు షరీఫ్‌కు వచ్చే భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. తాగునీటి సరఫరా, విద్యుత్, ట్రాఫిక్, పారిశుధ్యం, వైద్య, పోలీసు తదితర శాఖలతో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఉత్సవాల నిర్వహణను నిరంతరం పర్యవేక్షించేందుకు ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ స్థాయి అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులను ప్రత్యేకంగా నియమించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. భక్తుల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. దర్గా పీఠాధిపతి, రాష్ట్ర చైర్మన్ కుసూర్ పాషా మాట్లాడుతూ దర్గాలో గతంలో ఉన్న నీటి సమస్యను పరిష్కరించేందుకు సుమారు రూ.40 లక్షలతో నీటి సరఫరా పనులు పూర్తి చేసినట్లు చెప్పారు. రహదారి అభివృద్ధి పనులు కూడా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఉర్సు ఉత్సవాల నేపథ్యంలో నేడు సాయంత్రం దర్గా లో ప్రత్యేక పూజలు చేయనున్న జిల్లా ఇంచార్జ్ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ,మైనారిటీ శాఖ మంత్రి అజారుద్దీన్,జిల్లా మంత్రులు,ఎమ్మెల్యే ఎమ్మెల్సీ,చైర్మన్ లు వస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్ అబూబకర్,దివిజన్ అధ్యక్షులు సింగరపు రవి తదితరులు పాల్గొన్నారు.

# యువతే దేశానికి భవిష్యత్తు

- యూత్ కాంగ్రెస్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలి
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- భూపాలపల్లిలో ఘనంగా యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ వేడుకలు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** దేశానికి భవిష్యత్తు యువతేనని, యూత్ కాంగ్రెస్ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో యూత్ కాంగ్రెస్ 66వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతున్నది యూత్ కాంగ్రెస్ అని అన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, యువతకు సమాన అవకాశాల కోసం యూత్ కాంగ్రెస్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి యువ కాంగ్రెస్ కార్యకర్తకు ఎమ్మెల్యే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బండ శ్రీకాంత్ మాట్లాడుతూ రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే యూత్ కాంగ్రెస్ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బట్టు కరుణాకర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నమునూరి రజినీకాంత్, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన కాంగ్రెస్ భూపాలపల్లి ఇంచార్జీ ఓరుగంటి మహిపాల్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ కోసిక సాయి చరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చుంచుల మహేష్, మండల అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడతాం

- ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం
- ములుగు లో భారీ ర్యాలీ





**ములుగు ప్రతినిధి,ఆగస్టు09(జనం సాక్షి):** షెడ్యూల్ తెగ (ఎస్టి) ల వర్గీకరణ తప్పదని ముందుకు వచ్చి మద్దతు పలికిన రాజకీయ పార్టీలకే భవిష్యత్తు ఉంటుందని ఆదివాసీలు హితవు పలికారు. ములుగు జిల్లా కేంద్రంలో ఆదివాసి ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా కేంద్రంలో డిఎల్ఆర్ గార్డెన్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ గా వెళ్లి అనంతరం కలెక్టర్ కాన్ఫరెన్స్ హాల్ లో జెండా వితరణ చేసి కొమురం భీమ్ కి నివాళులు అర్పించిన తర్వాత ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో ఆదివాసుల పరిస్థితి అత్యంత దయనీయంగా తయారయిందని ఉద్యోగ ఉపాధి పోడు భూములు ప్రమోషన్లు విద్య ఇలా అన్ని రంగాలలో ఎస్టీ జాబితాలో ఉన్న ఇతర మైదాన ప్రాంత వర్గాల వారు ముందుకు వెళ్తుంటే అడవిని నమ్ముకున్న ఆదివాసీలు మాత్రం వెనుక పడిపోవడం బాధాకరమని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో ఆదివాసి ఉద్యోగుల సంఘం ములుగు జిల్లా అధ్యక్షులు మంకిడి రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నవరం రవికాంత్, తుడుం దెబ్బ జిల్లా ఉపాధ్యక్షులు వజ్జ రాజు,కార్యక్రమ స్పెషల్ ఆఫీసర్ ఆర్సిఓ పద్మజ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ వజ్జ సారంగం,సర్వాపూర్ సర్పంచ్ ఈక కుమార్,ఉద్యోగ సంఘం కార్యదర్శి ఇర్ప బాలాజీ,నాయకులు రాం చందర్, తుడుం దెబ్బ నాయకులు దనసరి బాబురావు,గడ్డం లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం పోడుదెబ్బ అధ్యక్షులు గొల్ల కుమార్,మహిళా ప్రధాన కార్యదర్శి కుంజ అనసూయ,ఆదివాసి ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోలం వెంకటేశ్వర్లు,ఆదివాసి పోలీస్ సంక్షేమ సంఘం కొమరం నాగేశ్వరరావు,ఆదివాసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు మొలకం గంగయ్య,ఆదివాసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నాయకులు కొట్టం వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులు వాసం నారాయణ,భారీ సంఖ్య లో ఆదివాసులు పాల్గొన్నారు.

# మత సామరస్యమే ప్రజా పాలనకు బలం

- అన్ని మతాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబాటు: ఎమ్మెల్యే నాయిని
- క్రైస్తవ సోదరుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ..



**కాజీపేట, ఆగస్టు 9(జనం సాక్షి) :** వరంగల్ మహానగర పరిధిలోని కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాలకు చెందిన క్రైస్తవ మత గురువులు, మత పెద్దలతో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పూర్తి స్నేహపూర్వక వాతావరణంలో, రాజకీయాలకు అతీతంగా జరిగిన ఈ సమావేశంలో క్రైస్తవ సమాజానికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి వారితో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. వరంగల్ మహానగరం అన్ని కులాలు, అన్ని మతాలు, అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి జీవించే నగరమని అన్నారు. క్రైస్తవ సమాజానికి అవసరమైన మౌలిక వసతులు, ప్రార్థనా మందిరాలు, శ్మశాన వాటికలు, సామాజిక అవసరాలకు సంబంధించిన సమస్యలు తదితర అంశాలను తన దృష్టికి తీసుకువస్తే వాటిపై సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానికంగా పరిష్కరించగల సమస్యలను వెంటనే పరిష్కరించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో క్రైస్తవ సోదరుల అవసరాల కోసం మూడెకరాల స్థలాన్ని కేటాయించడం జరిగిందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గుర్తు చేశారు. మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, విద్యార్థుల ఆహారం, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు తదితర అంశాలపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సమీక్షలు నిర్వహిస్తూ చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. క్రైస్తవ సమాజం సహా మైనారిటీల సంక్షేమం ఎవరి దయాదాక్షిణ్యాలపై ఆధారపడేది కాదని, అది వారి హక్కు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేసిన విషయాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గుర్తు చేశారు. 2025 క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవిస్తూ శాంతి, సామరస్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మతపరమైన దాడులను ప్రభుత్వం సహించదని, క్రైస్తవులు మరియు ముస్లింల శ్మశాన వాటికలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రైస్తవ మిషనరీలు విద్య, వైద్య రంగాల్లో పేదలకు అందిస్తున్న సేవలను కూడా ముఖ్యమంత్రి ప్రశంసించిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. సమాజంలో విద్య, వైద్యం, సేవా రంగాల్లో క్రైస్తవ సంస్థలు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని అన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ, అన్ని వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తోందని నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. ఈ సమావేశంలో కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాలకు చెందిన క్రైస్తవ మత గురువులు, మత పెద్దలు, ప్రతినిధులు పాల్గొని తమ సమస్యలు, అవసరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సూచనలు, అభిప్రాయాలను ఆత్మీయంగా విని, సాధ్యమైన మేరకు పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

# న్యాయవ్యవస్థపై అపారమైన విశ్వాసం ఉంది

- ఆ నమ్మకంతోనే పోరాడుతున్నాం
- అజంజాహి మిల్స్ వి ఆర్ ఎస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం



**వరంగల్ ఈస్ట్, ఆగస్టు 09 (జనం సాక్షి) :** న్యాయ వ్యవస్థ పై తమకు అపారమైన విశ్వాసం ఉందని, ఆ నమ్మకంతోనే కార్మికుల పక్షాన పోరాటం చేస్తున్నామని అజంజాహి మిల్స్ వి ఆర్ ఎస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు అన్నారు. ఆదివారం నగరంలోని చింతల్ బ్రిడ్జి వద్ద వి ఆర్ఎస్ అసోసియేషన్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మృతి చెందిన తమ తోటి కార్మికులకు రెండు నిమిషాలు మౌనం పాటిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు కుడికాల కుమారస్వామి, జన్ను రమేష్ లు మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ పై తమకు అపారమైన విశ్వాసం ఉందని అన్నారు. ఆ నమ్మకంతోనే అజంజాహి మిల్స్ 1992-2002 వి ఆర్ ఎస్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్మికుల న్యాయమైన డిమాండ్ కోసం పోరాటం చేస్తున్నట్లు తెలిపారు. అజంజాహి మిల్లు 2002లో మూత పడిందని, ఆ సమయంలో మిల్లు యాజమాన్యం అందులో పని చేసిన కార్మికులకు వాలంటరీ రిటైర్మెంట్ స్కీం ప్రకటించిందని అన్నారు. దీంతో 452 ఉంది ఉద్యోగులు రిటైర్ అయ్యారు. వీరిలో 134 మందికి మిల్లు యాజమాన్యం ఒక్కొక్కరికి 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చింది. మిగిలిన 318 మంది ఉద్యోగులు తమకు కూడా 200 గజాల చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నేషనల్ టెక్స్టైల్ కార్పొరేషన్ ను డిమాండ్ చేయగా వారి వినతిని ఎన్టిసి తిరస్కరించిందని అన్నారు. దీంతో ఆ కార్మికులు హైకోర్టులో కేసు వేయగా న్యాయవాది వాదనతో ఏకీభవించిన హైకోర్టు 2016 మార్చి 18 న కార్మికులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. ఈ తీర్పుపై ఎన్ టి సి అప్పిలుకు వెళ్లడంతో కార్మికుల పక్షాన న్యాయవాది సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేశారు. మాడిఫైడ్ వాలంటరీ రిటైర్మెంట్ ఉద్యోగుల సంఘం, కార్మికుల తరఫున న్యాయవాది వాదనలతో ఏకీభవించిన సుప్రీంకోర్టు 318 మంది రిటైర్డ్ ఉద్యోగులు కూడా 200 గజాల స్థలాలు ఇవ్వాలంటూ కూడా, ఎన్ టి సి అధికారులకు 2021 అక్టోబర్ 26న ఆదేశాలు జారీ చేసింది. 1992-2002 విఆర్ఎస్ కార్మికులకు 200 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలి...2002 సంవత్సరంలో మిల్లు మూతపడే సమయానికి ముందు పదవి విరమణ పొందిన విఆర్ఎస్ కార్మికులకు కూడా 200 గజాల ఇళ్ల స్థలం ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో విట్ పిటిషన్ దాఖలు చేసి అజంజాహి మిల్స్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున న్యాయ పోరాటం చేస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కుడికాల కుమారస్వామి జన్ను రమేష్ లు తెలిపారు. మిల్లు యాజమాన్యం స్వార్థపూరిత తప్పుడు నిర్ణయాల కారణంగా 1992 నుంచి 2002 వరకు వీఆర్ఎస్ తీసుకున్న కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, నిజాయితీగా పనిచేసిన కార్మికులకు సరైన ప్రతిఫలాలు అందలేదని, ఆ ఫలితంగానే నేడు 150 మంది వీఆర్ఎస్ కార్మికులు దీనస్థితిలో దుర్భర జీవితాలను కడుతున్నారని, తీవ్ర మనోవేదనకు గురైన కొందరు కార్మికులు మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లకు అనుకూలంగా న్యాయ స్థానంలో తీర్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కోశాధికారి పాండవుల సమ్మయ్య, ఈసీ నెంబర్లు తౌటం రమేష్, సంజీవ్, సుమారు 50 మంది వీఆర్ఎస్ కార్మికులు పాల్గొన్నారు.

# రైతులు సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు



**ఖానాపూర్ ఆగస్టు 09 (జనం సాక్షి) :** సదర్మాట్ ఆయకట్టు రైతాంగం సాగునీటిని సద్విని యోగం చేసు కోవాలని ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ సూచించారు. ఆదివారం సదర్మాట్ కాలువకు సాగినీరు విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి లభ్యతను ఆధారంగా చేసుకుని రైతులు పంటలు పండించాలన్నారు. నీరు పొదుపుగా వాడుకొని పంట సాగుకు వినియోగించు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లు పడిగల భూషణ్, అబ్దుల్ మాజీద్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జంగిలి శంకర్, పట్టణ అధ్యక్షుడు గొర్రె గంగాధర్, జిల్లా అధికార ప్రతినిధి ధోనికేని దయానంద్ లతోపాటు ప్రజాప్రతినిధులు, అయకట్టు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# బోనమెత్తిన చైర్పర్సన్



**బెల్లంపల్లి, ఆగష్టు 9 (జనంసాక్షి) :** బెల్లంపల్లి పట్టణంలోని రడగంబాల బస్తీ వార్డు కౌన్సిలర్ దామెర విజయ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఏర్పాటు చేసిన ఆషాడ మాసం బోనాల కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ బోనమెత్తి అలరించారు. స్థానిక మహిళలతో కలిసి స్వయంగా బోనం ఎత్తుకొని ఆలయానికి చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, బస్తీ మహిళలు పాల్గొన్నారు.

# ఆదివాసీ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

- సిరికొండలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం..
- 52 గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన జనం



**సిరికొండ ఆగస్టు 09 (జనం సాక్షి) :** ఆదివాసీల హక్కులు, అస్తిత్వం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం ఐక్యంగా పోరాడాలని జిల్లా సార్మెడి తోడసం అమృత్ రావు పిలుపునిచ్చారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని సిరికొండలో ఆదివారం భారీ కార్యక్రమం నిర్వహించారు. 52 గ్రామాల నుంచి పటేల్‌లు, దేవరిలు, మహజన్లు, సార్మేడీలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు తరలివచ్చారు. డోలు, సన్నాయి వాయిద్యాలతో నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొమురం భీం చౌక్ వద్ద పూజలు చేసి ఆదివాసీ జెండాను ఎగురవేశారు. జై ఆదివాసీ, జై కొమురం భీం, జై దుర్గావతి రాణి, జై బిర్సాముండా నినాదాలతో కార్యక్రమం హోరెత్తింది. ఈ సందర్భంగా జిల్లా సార్మెడి తోడసం అమృత్ రావు మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి 1994లో ఆగస్టు 9ను అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడడంతో పాటు అటవీ వనరులపై హక్కులు, సంప్రదాయాలు, జీవన విధానాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తుడుం దెబ్బ అధ్యక్షుడు కుంరం యాదవరావు, కుంరం భీం ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు కోట్నాక్ పాండు, మాజీ జడ్పీటీసీ రాఘురం, ఎస్పై విక్రమ్, మాజీ సర్పంచులు, పెందూర్ అనిల్‌కుమార్, విద్యార్థి సంఘం అధ్యక్షుడు పెందూర్ మహేందర్, సిడం నాగోరావు, సర్పంచులు బొడ్డు దత్తాత్రి, లక్ష్మణ్, మహదు, భారీక్‌రావు, మేస్రం నాగేష్, బాదు, దత్తు, షేక్ ఇమామ్, రంజాన్, బోయిన్‌వాడ్ అమోల్ తదితరులు పాల్గొన్నారు. వివిధ గ్రామాల పటేల్‌లు, దేవరిలు, మహజన్లు, సార్మేడీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సర్పంచులు, ఉపసర్పంచులు, ఎంపీటీసీలు, ఆదివాసీ విద్యార్థి సంఘాల నాయకులు, యువత, మహిళలు పాల్గొన్నారు.

# ఆదివాసీ మంత్రసానుల సేవలకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి

- ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావు మొకాశి





**గుడిహత్నూర్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ఆధునిక టెక్నాలజీ యుగంలోనూ ఆదివాసి మంత్రసానులు, దాయిల సాంప్రదాయ జ్ఞానం ఆదివాసుల ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తుందని ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్ రావ మొకాశి అన్నారు. మంత్రసానులకు ప్రభుత్వం అధికారిక గుర్తింపుతో పాటు గౌరవ వేతనం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం సందర్భంగా ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ఆదివాసి విజ్ఞాన కేంద్రం వద్ద ఆదివాసి మంత్రసానుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివాసి సేన ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా ఐక్యరాజ్యసమితి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మంత్రసానులతో కలిసి మొక్కలు నాటారు. మంత్రసానులకు ప్రశంసా పత్రాలు, శాలువాలు, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కోవ దౌలత్ రావు మొకాశి మాట్లాడుతూ ఆదివాసి సమాజంలో మంత్రసానులు, దాయిలు ఆరోగ్య సంరక్షణలో వెన్నుముకలాంటి వారని అన్నారు. తరతరాలుగా వనమూలికా వైద్యం, గర్భ సంరక్షణకు సంబంధించిన సాంప్రదాయ జ్ఞానాన్ని వారు కాపాడుకుంటూ వస్తున్నారని తెలిపారు. అయితే వారికి ప్రభుత్వపరంగా తగిన గుర్తింపు, గౌరవం లేకపోవడం బాధాకరమన్నారు. ఆదివాసి మంత్రసానుల సాంప్రదాయ జ్ఞానానికి ప్రభుత్వం అధికారిక గుర్తింపు ఇవ్వాలని, వారికి శిక్షణ కిట్లు, గౌరవ వేతనం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే వారి మూలికా వైద్య జ్ఞానాన్ని ఏఐ, డిజిటల్ సాంకేతికత ద్వారా భద్రపరచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి సేన రాష్ట్ర నాయకులు పేందోర్ విశ్వనాథ్, ఆదివాసి రైతు సేన జిల్లా అధ్యక్షులు వేద్మ చంపత్ రావు, ఆదివాసి ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ కుంరం దశరథ్, ఆదివాసి సేన మండల ఉపాధ్యక్షులు పేందోర్ గోవింద్, ఆదివాసి సర్పంచులు మడవి ముకుంద్ రావు, సిడం లక్కు, ఆదివాసి నాయకులు మెస్రం మోహన్, కుంరం సంభూ, మడవి ఆనంద్ రావు, మడవి రమేష్, మహిళా నాయకులు మడవి సోనుబాయి, తోడషం ధనలక్ష్మి, పలువురు మంత్రసానులు, ఆదివాసి నాయకులు పాల్గొన్నారు.

# గిరిజన వీరుడు కొమరం భీం పోరాటమే ఆదివాసీల ఐక్య ఉద్యమాలకు స్ఫూర్తి

- కొమరం భీం విగ్రహాన్ని ఆవిష్కరించిన పొదెం వీరయ్య
- ఆదివాసి జేఏసీకి అభినందనల వెల్లువ
- సంస్కృతి, సంప్రదాయాల మేలవింపుగా ఆకట్టుకొన్న గిరిజన నృత్యాల ర్యాలీ



**చర్ల, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ప్రపంచ ఆదివాసి దినోత్సవం రోజున గిరిజన వీరుడు, ఆదివాసీల ముద్దుబిడ్డ కొమరం భీం స్మారక విగ్రహావిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మండల కేంద్రమైన చర్ల మొత్తం ఆకుపచ్చగా మారిపోయింది. చర్లలో ఎటు చూసినా ఆదివాసీల ఆకుపచ్చని జెండాలు, తోరణాలే కనిపించాయి. ఇక ప్రతి ఒక్క ఆదివాసీ ఆకుపచ్చ రంగు వస్త్రాలు ధరించి ఆకర్షణగా నిలిచారు. ఎదురైన ఆటంకాలు అన్నీ అధిగమించి చర్ల బస్టాండ్ సెంటర్‌లో కొమరం భీం విగ్రహాన్ని ముందుగా జెఏసీ నిర్ణయించిన ఆదివాసీ దినోత్సవం రోజునే ఆవిష్కరించుకొని జేజేలు అందుకొంది. విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆదివాసీలు వేలాదిగా తరలివచ్చి చర్లలో సత్తా చాటారు.

### కొమరం భీం పోరాటమే స్ఫూర్తి

జల్, జంగిల్, జమీన్ కోసం కొమరం భీం ప్రాణాలు ఫణంగా పెట్టి చేసిన పోరాటమే ఆదివాసీలకు స్ఫూర్తి అని టీజీఎఫ్‌డిసి చైర్మన్, మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సభ్యులు పొదెం వీరయ్య అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవ సందర్భంగా చర్ల బస్టాండ్ సెంటర్లో ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో నెలకొల్పిన కొమరం భీం విగ్రహాన్ని పొదెం వీరయ్య వేలాది ఆదివాసీల హర్షధ్వానాల నడుమ ఆవిష్కరించారు. ఆ దృశ్యాన్ని కనులారా చూసిన ఆదివాసీలు పులకించిపోయారు. ఎన్నో ఏళ్ళ కల నెరవేరిందని పలువురు కన్నీటి భాష్పాలు విదిల్చారు. ఈ సందర్భంగా 'జోహార్.. కొమరం భీం'.. 'సాధిస్తాం కొమరం భీం ఆశయాలను'.. 'ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలి' అనే నినాదాలతో సభాప్రాంగణం మారుమ్రోగింది. విగ్రహావిష్కరణ క్షణాన ఆదివాసీల్లో అంతుచిక్కని ఆనందం కనిపించింది. నిజంగా ఇది ఆదివాసీలు ఆవిష్కరించిన అద్భుత ఘట్టం అని సభలో వక్తలు అభినందించారు. విగ్రహావిష్కరణ కమిటీకి నాయకత్వం వహించి, అందరిని సమన్వయం చేసిన వాసం ముసలయ్య అండ్ టీమ్ ప్రశంసలు అందుకొంది. చర్ల ప్రాంతం కొమరం భీమ్ ఆశయాలకు ప్రతీక అని, ఇక్కడ విగ్రహం ఏర్పాటు చేయడం గర్వకారణమని వక్తలు అన్నారు. ఆదివాసీ సంఘాల నాయకులు ఇదే ఉత్సాహంతో స్థానిక ఆదివాసీల సమస్యల సాధన కోసం ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని వక్తలు పిలుపునిచ్చారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వీరమరణం పొందిన కొమరం భీం త్యాగాన్ని ఆదివాసి యువతీ యువకులు గుర్తుంచుకొని ఆయన ఆశయాల సాధనకు అడుగులు వేయాలని సూచించారు. చర్లలో ఈ కార్యక్రమం ఆదివాసీల ఆత్మగౌరవానికి, ఐక్యతకు నిదర్శనంగా నిలిచింది. విగ్రహావిష్కరణ అనంతరం చర్లలో భారీ ప్రదర్శన నిర్వహించారు. గోండ్, కోయ తెగ ఆదివాసీల సంప్రదాయ డోలు వాయిద్యాలు, కొమ్ము నృత్యాలు చూపరులను అమితంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదివాసీ జెఏసి కన్వినర్ వాసం ముసలయ్య, చర్ల ఏఎంసీ చైర్మన్ ఇర్పా శ్రీనివాసరావు, ఆదివాసీ నాయకులు ఇర్పా వసంత్, తాటి రామకృష్ణ, ఇర్పా ప్రకాష్, సరెం సమ్మయ్య, ఇర్పా రాజు తదితరులు పాల్గొన్నారు.

# రూ.54 కోట్ల మెఫెడ్రోన్ పట్టివేత



**బీబీనగర్, ఆగస్టు 8 (జనంసాక్షి) :** యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం కొండమడుగు శివారులో 27 కిలోల మెఫెడ్రోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.54 కోట్లు ఉంటుందని ఎస్పీ ఆకాంక్ష యాదవ్ తెలిపారు. బీబీనగర్ పోలీసులు, ఎస్‌ఓటీ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో నాగ్‌పూర్‌కు తరలిస్తున్న ఫార్చునర్ కారును అడ్డుకుని డ్రగ్స్‌తో పాటు 40 కిలోల అసిటోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో కొండమడుగులోని వెటుకూరి ల్యాబ్స్‌లో మెఫెడ్రోన్ తయారు చేసినట్లు వెల్లడైంది. ల్యాబ్‌లోని రియాక్టర్, సెంట్రిఫ్యూజ్ తదితర పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన చేతన్ మధుకర్ మేష్రామ్, ఆకాష్ గావండే, అస్సాంకు చెందిన ముజ్జవల్ హోక్, హైదరాబాద్‌కు చెందిన ఉపద్రష్ట రమణమూర్తిని అరెస్ట్ చేశారు. మరో నలుగురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. చీణూలా చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## వరుణ యాగానికి అన్ని ఏర్పాట్లు పూర్తి

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్



**నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 9 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ విజయ్ విహార్ ఆవరణలో కృష్ణా నది ఒడ్డున నిర్వహించనున్న వరుణ యాగానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి కలెక్టర్ మరోసారి యాగం ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా బీసీ సంక్షేమ హాస్టల్ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం విజయ్ విహార్ వెనుకవైపు కృష్ణా నది ఒడ్డున ఏర్పాటు చేసిన యాగశాల, హోమ గుండాలు, 108 మంది రుత్వికులకు ఏర్పాటు చేసిన ఆసనాలు, యాగ సామగ్రి, పగోడాలు, బ్యారికేడ్లు, బందోబస్తు, ఎల్ఈడీ స్క్రీన్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను పరిశీలించారు. వరుణ యాగం సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3.20 గంటలకు ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు.

### పాస్ ఉన్నవారికే ప్రవేశం

ముఖ్యమంత్రి రాక నేపథ్యంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. సోమవారం విజయ్ విహార్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ ప్రవేశ పాస్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, పాస్ ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించాలని పోలీసులకు సూచించారు. రాష్ట్ర దేవాదాయ కమిషనర్ హనుమంతరావు ఏర్పాట్లను పరిశీలించారు. స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, మిర్యాలగూడ ఆర్డీవో రమణారెడ్డి, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారీ ర్యాలీ

**భువనగిరి, ఆగస్టు 9 (జనం సాక్షి) :** యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో యువత సందడి నెలకొంది. జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు మంగ ప్రవీణ్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ, జెండా ఆవిష్కరణ, సభ, బహుమతుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా తొలుత అంబేద్కర్ చౌరస్తాలో డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డోలు వాయిద్యాలు, బాణాసంచా నడుమ గంజి ప్రాంతంలోని సుమంగళి ఫంక్షన్ హాల్ వరకు యువజన కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యువజన కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి సభ నిర్వహించారు. గత వారం రోజులుగా యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, పోటీల్లో విజేతలకు ఈ సందర్భంగా అతిథులు బహుమతులు అందజేశారు. క్రికెట్ పోటీలు, ముగ్గుల పోటీలు, వ్యాసరచన పోటీలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే సందేశంతో 2కే రన్, శ్రమదానం వంటి కార్యక్రమాలను నిర్వహించారు.

### యువత తలుచుకుంటే ఏదైనా సాధ్యం



ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎంపీ, పీసీసీ మీడియా విభాగం అధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి యువజన కాంగ్రెస్ వెన్నెముక వంటిదని అన్నారు. రాష్ట్రంలో, దేశంలో మరెక్కడా లేనివిధంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో వారం రోజులపాటు యువతను భాగస్వాములను చేస్తూ వివిధ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మంగ ప్రవీణ్‌ను అభినందిస్తూ పార్టీ నాయకత్వం ఎల్లవేళలా యువజన కాంగ్రెస్‌కు అండగా ఉంటుందని తెలిపారు. దేశంలో యువత శాతం అధికంగా ఉందని, యువత సంకల్పిస్తే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగలదని పేర్కొన్నారు. దేశ యువత రాహుల్ గాంధీ నాయకత్వం వైపు చూస్తోందని, ఆయనను ప్రధానమంత్రిని చేసే లక్ష్యంతో యువజన కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జి కైసర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అవేస్ చిస్తీ, సీనియర్ నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, బర్రె జహంగీర్, మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజుల, యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎలిమినేటి సురేష్, పుట్ట గిరీష్, జిల్లా నాయకులు ఏడుమెకల మహేష్, బత్తిని వరుణ్, కత్తి సాయిప్రసాద్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు బట్టు సందీప్, భూషపాక శివతేజ, పోత్నక్ సన్నీ, ఎం.డి. జలీల్, రేగు రమేష్, చిక్కుల వెంకటేష్, ఎల్లంల జంగయ్య, ఎనగండ్ల సుధాకర్, సుర్వంగ చందు, బొల్లెపల్లి వినయ్, భువనగిరి ఉపేందర్ తదితర కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశ భవిష్యత్తుకు యువతే బలమైన పునాది

- దేశభక్తి, నిస్వార్థ సేవతో భారత్‌ను విశ్వగురువుగా తీర్చిదిద్దాలి
- ఆర్ఎస్ఎస్ పాలమూరు విభాగ్ సహకారవాహ బోగారం సూర్యనారాయణమూర్తి



**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి) :** దేశభక్తి, నిస్వార్థ సేవాభావంతో పనిచేస్తే భారత యువత దేశాన్ని విశ్వగురువుగా తీర్చిదిద్దగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) పాలమూరు విభాగ్ సహకారవాహ బోగారం సూర్యనారాయణమూర్తి అన్నారు. దేశ నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బిజినపల్లి మండలం పాలెంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన యువ సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావం, సామాజిక బాధ్యత వంటి విలువలను యువత తమ జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. యువత అభివృద్ధి చెందిన భారతదేశానికి రూపశిల్పులుగా ఎదగాలని, వ్యక్తిగత ఆశయాలకు అతీతంగా శీలం, క్రమశిక్షణ, సేవా భావంతో జాతీయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. బలమైన సమాజ నిర్మాణం కోసం ఆర్ఎస్ఎస్ ప్రతిపాదిస్తున్న పంచ పరివర్తన్ అంశాలను చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్వబోధ్, నాగరిక్ కర్తవ్య, పర్యావరణ సురక్ష, సామాజిక సమరసత, కుటుంబ ప్రబోధన్ వంటి అంశాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టినప్పుడు సమాజంలో సానుకూలమైన, శాశ్వతమైన మార్పు సాధ్యమవుతుందని తెలిపారు. వ్యక్తి పరివర్తన ద్వారానే కుటుంబం, సమాజం, దేశంలో మార్పు సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

### సామాజిక మాధ్యమాలకు బానిసలు కావొద్దు

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ యువ న్యాయవాది ధనాల పూర్ణిమ మాట్లాడుతూ యువత సామాజిక మాధ్యమాల్లో విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. దేశభక్తి, కర్తవ్యనిష్ఠ, సామాజిక సేవాభావం, జాతీయ చైతన్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు.

### ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

యువ సమ్మేళనంలో చిన్నారి శాన్వి సింగ్ అందించిన సాంస్కృతిక కళా ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమానికి హాజరైన వారు చిన్నారి ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సహ వ్యవస్థ ప్రముఖ్ ఆగపు నాగయ్య, ధర్మజాగరణ ప్రముఖ్ అతినారపు ఆంజనేయులు, జిల్లా పర్యావరణ ప్రముఖ్ పబ్బతి నిరంజన్‌తో పాటు వివిధ హిందూ సంఘాల కార్యకర్తలు, విద్యార్థులు, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సంక్షేమానికి ఎనలేని కృషి

- ప్రతి గిరిజన కుటుంబానికి ఐటీడీఏ ద్వారా సంక్షేమ పథకాలు
- మన్యం అమరవీరులకు ఘన నివాళులు..
- భద్రాచలంలో ఘనంగా ఆదివాసీ దినోత్సవ వేడుకలు



**భద్రాచలం, ఆగస్టు 9 (జనంసాక్షి) :** భద్రాచలం ఏజెన్సీలో గిరిజనుల సంక్షేమానికి ఐటీడీఏ ద్వారా ఎనలేని కృషి చేస్తున్నామని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం భద్రాచలంలో ఐటీడీఏ, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత అంబేద్కర్ సెంటర్‌లో ఆదివాసీల హక్కులు, అస్తిత్వం కోసం పోరాడి ప్రాణత్యాగం చేసిన మన్యం అమరవీరుల స్థూపాలకు ఎమ్మెల్యే, ఐటీడీఏ పీవో, సర్పంచ్‌లు, ఆదివాసీ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసీ గేయం ఆలపించి ప్రతిజ్ఞ చేశారు. ఆదివాసీ జెండాను ఆవిష్కరించిన అనంతరం అంబేద్కర్ సెంటర్ నుంచి గిరిజన భవనం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. గిరిజన భవనంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యే, పీవో, ఆదివాసీ సంఘాల నాయకులు జ్యోతి ప్రజ్వలన చేసి మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం ఆదివాసీ సంప్రదాయ నృత్యాల్లో ఎమ్మెల్యే, పీవో, సర్పంచ్‌లు పాల్గొని గిరిజనులతో కలిసి సందడి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు, గంటం దొర, మల్లుదొర, కొమురం భీం వంటి ఎందరో ఆదివాసీ వీరుల త్యాగాల ఫలితంగానే నేడు ప్రపంచవ్యాప్తంగా ఆదివాసీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. గిరిజనుల విద్య, వైద్యం, వ్యవసాయం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం, ఐటీడీఏ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నాయని తెలిపారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఉద్దీపకం వర్క్‌బుక్‌లు, కెరీర్ గైడెన్స్, సమ్మర్ కోచింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గిరిజన సంక్షేమ రంగంలో చేపడుతున్న కార్యక్రమాలకు గుర్తింపుగా భద్రాచలం ఐటీడీఏ దేశంలోని ఐటీడీఏల్లో ఉత్తమ ఐటీడీఏగా ఎంపికై రాష్ట్రపతి చేతుల మీదుగా రూ.5 లక్షల అవార్డు అందుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాపూరావు, భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణదొర, ఆదివాసీ సంఘాల నాయకులు పాయం రవివర్మ, శరత్‌బాబు, మురళి, రమేష్, పుల్లయ్య, వీరస్వామి, కుంజా ధర్మ, సుధారాణి, అరుణ, వెంకటరావు, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శనగర్‌లో వైభవంగా కట్టమైసమ్మ బోనాల జాతర



**తాండూరు, అగస్టు 9 (జనంసాక్షి) :** పట్టణంలోని ఆదర్శనగర్ కట్టమైసమ్మ ఆలయంలో బోనాల జాతర మహోత్సవాలు ఆధ్యాత్మిక శోభతో, భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆదివారం పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు సంప్రదాయ వస్త్రధారణలో తరలివచ్చి బోనాలు సమర్పించారు. డప్పు చప్పుళ్లు, పూనకాలతో ఆలయ ప్రాంగణమంతా జాతర శోభను సంతరించుకుంది. ఈ ఉత్సవాల్లో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాలరెడ్డి నిష్ఠతో బోనం ఎత్తి అమ్మవారికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అమ్మవారి కృపాకటాక్షాలు పట్టణ ప్రజలందరిపై ఉండాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బల్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ప్రజల సంక్షేమం, సుభిక్షత కోసం అమ్మవారిని ప్రార్థించారు. ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు విఠల్ నాయక్ మరియు అధ్యక్షులు నరేష్ ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు చక్కగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, అన్నదానం, భద్రతా ఏర్పాట్లు చేశారు. జాతరకు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తి, సంప్రదాయం, ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ కట్టమైసమ్మ బోనాల మహోత్సవం తాండూరులో మరోసారి సామరస్యానికి నిదర్శనంగా నిలిచింది.

# కొమరం భీమ్ ఆశయాల స్ఫూర్తితో ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవాన్ని కాపాడుకుందాం

- మంత్రి సీతక్క

**అశ్వారావుపేట, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకొని అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దానసరి అనసూయ (సీతక్క) హాజరయ్యారు. జిల్లాకు విచ్చేసిన మంత్రి సీతక్కకు ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు, కొమ్ము డాన్స్‌లతో ఆదివాసీ ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు ఆదివాసీ ప్రజలతో కలిసి భారీ ర్యాలీగా అశ్వారావుపేట ప్రధాన కూడలికి చేరుకున్నారు.

అశ్వారావుపేట ప్రధాన కూడలిలో ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొమరం భీవ్ విగ్రహాన్ని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్ కలిసి ఆవిష్కరించారు. అనంతరం కొమరం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

### ఆదివాసీ సమాజ విద్యాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

ఆదివాసీ సమాజంలో ఐక్యత, చైతన్యం, విద్యాభివృద్ధి పెంపొందించాలనే లక్ష్యంతో అనేక సంవత్సరాలుగా కృషి చేస్తున్నామని తెలిపారు. కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఆదివాసీ సమాజానికి స్ఫూర్తినిచ్చే కార్యక్రమమన్నారు. ఆదివాసీ యువత విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లాలని, ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అశ్వారావుపేట నియోజకవర్గంలో కొమరం భీమ్ పేరుతో ఏర్పాటు చేయనున్న అర్బన్ పార్కును మరింత అభివృద్ధి చేయడంతో పాటు అక్కడ గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయాలనే ఆకాంక్ష ఉందన్నారు. ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం భావితరాలకు తెలిసేలా మ్యూజియం, గిరిజన విద్యా వికాశం భవనం ఏర్పాటు చేయడానికి అవసరమైన సహకారం అందించాలని మంత్రి సీతక్కను కోరారు.

### ఆదివాసీ సంక్షేమం, సంస్కృతి పరిరక్షణకు ప్రాధాన్యత : కలెక్టర్ అంకిత్




జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆదివాసీ సోదర, సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. కొమరం భీమ్ వంటి మహనీయుల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. కొమరం భీమ్, రాంజీ గోండు, సమ్మక్క–సారలమ్మ వంటి ఆదివాసీ వీరుల పోరాట చరిత్రను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆదివాసీల భాష, సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వాన్ని పరిరక్షించడంతో పాటు విద్య, వైద్యం, మౌలిక వసతులు, ఉపాధి తదితర రంగాల్లో అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలు సమాజంలో చైతన్యం, ఐక్యతను పెంపొందించడంతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తాయని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ విద్యా చందన, జెడ్పి సీఈవో నాగలక్ష్మి, మాజీ శాసనసభ్యులు మెచ్చ నాగేశ్వరరావు, ఆదివాసీ జేఏసీ నాయకులు, వివిధ గిరిజన సంఘాల ప్రతినిధులు, కొండరెడ్డి, నాయకపోడు తదితర గిరిజన వర్గాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆదివాసీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# వినియోగదారులకు షాక్..

### ధరల పెంపునకు ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు రెడీ


పెరుగుతున్న ముడిసరుకుల ధరలు, భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఉత్పత్తుల తయారీ వ్యయాన్ని పెంచుతున్నాయి. దీనికి ఎల్‌నినో కూడా తోడైంది. దీంతో కంపెనీ మార్జిన్‌లపై ప్రభావం పడుతుండడంతో దేశంలోని ప్రముఖ ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు సెప్టెంబర్ త్రైమాసికంలోనూ ధరల పెంపునకు సిద్ధమవుతున్నాయి. బ్రిటానియా, హెచ్‌యూఎల్, గోద్రెజ్ వంటి కంపెనీలు.. ఇప్పటికే జూన్ త్రైమాసికంలో కొన్ని ఉత్పత్తుల గ్రామేజ్ బరువు తగ్గించగా, మరికొన్ని ఉత్పత్తుల ధరలను పెంచాయి. అంతర్జాతీయంగా ఇంకా అనిశ్చితి కొనసాగుతుండడంతో ప్రస్తుత త్రైమాసికంలోనూ ఆయా కంపెనీలు తమ ఉత్పత్తులపై ధరల పెంపు చేపట్టేందుకు రెడీ అవుతున్నాయి. ఉత్పత్తుల ధరలు 2-5 శాతం మేర పెంపునకు సన్నద్ధమవుతున్నాయి.ప్రముఖ బేకరీ ఉత్పత్తుల సంస్థ బ్రిటానియా రెండో త్రైమాసికంలో మరో 1.5 నుంచి 2 శాతం మేర ధరల పెంపు చేపట్టే అవకాశం ఉన్నట్లు తెలిపింది. జూన్ త్రైమాసికంలో కొన్ని ఉత్పత్తుల బరువు తగ్గించి ఆ మేర మార్జిన్లు కాపాడుకుంది. "చక్కెర, పామాయిల్ ధరలు పెరిగాయి. 1.5 -2 శాతం వరకు ఉత్పత్తుల ధరలు పెరిగే అవకాశం ఉంది" అని కంపెనీ ఎండీ, సీఈఓ రక్షిత్ హర్గెవ్ తెలిపారు.మరో ప్రముఖ కంపెనీ గోద్రెజ్ దాదాపు 5 శాతం మేర ధరలను పెంచింది. ద్రవ్యోల్బణం పెరుగుతున్నందున ధరల పెంపు కొనసాగే అవకాశం ఉందని కంపెనీ సీఈఓ సుధీర్ సీతాపతి తెలిపారు. 'ధరలు, ఆదాయంపైనే ఆధారపడివుంటాయి. పెరిగిన ఉత్పత్తి వ్యయం వల్ల ధరల పెంపు అనివార్యంగా మారింది. మార్జిన్లు కాపాడుకునేందుకు పెంపు తప్పడం లేదు' అని డాబర్ ఇండియా సీఈఓ మోహిత్ మల్హోత్రా తెలిపారు. దీనివల్ల విక్రయాలపై కాస్త ఒత్తిడి ఉన్నా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధి సాధిస్తామన్న నమ్మకం ఉందని పేర్కొన్నారు. హిందుస్థాన్ యునిలీవర్ కంపెనీ కూడా ఇప్పటికే తన ఉత్పత్తులపై ధరలను పెంచింది. సెప్టెంబర్ త్రైమాసికంలోనూ ధరల పెంపు కొనసాగించనుంది. జూన్ త్రైమాసికంతో పోలిస్తే సెప్టెంబర్ త్రైమాసికంలో 2 నుంచి 5 శాతం వరకు ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా దశలవారీగా ధరలను పెంచుతామని కంపెనీ సీఈఓ ప్రియా నాయర్ తెలిపారు. అదేవిధంగా టాటా కన్స్యూమర్, నెస్లే కూడా అవసరపైన ఉత్పత్తులపై ధరల పెంపు చేపడుతామని సదరు కంపెనీల సీఈఓలు ప్రకటించారు.



# 5 కంపెనీలు.. రూ.7400 కోట్లు..

### ఈ వారం ఐపీఓలు ఇవే..

దిల్లీ: ప్రైమరీ మార్కెట్‌లో ఈ వారం కూడా పబ్లిక్ ఇష్యూల సందడి కొనసాగనుంది. ఐదు కంపెనీలు రూ.7400 కోట్లు సమీకరించనున్నాయి. ఇందులో ఆటో విడిభాగాల తయారీ సంస్థ దూత్ ట్రాన్స్‌మిష్‌తో పాటు షిప్ రాకెట్, మిల్కీ మిస్ట్ వంటి కంపెనీలు ఉన్నాయి.ఆటోమొబైల్ విడిభాగాల తయారీ సంస్థ ధూత్ ట్రాన్స్‌మిషన్ ఐపీఓ ద్వారా రూ.3,067 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.829-871గా నిర్ణయించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.1400 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 1.91 కోట్ల షేర్లను ప్రమోటర్లు విక్రయించనున్నారు. ఆగస్టు 10న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది.టెమాసెక్, మోతీలాల్ ఓస్వాల్ ప్రైవేట్ ఈక్విటీ మద్దతు కలిగిన మోల్బియో డయాగ్నొస్టిక్స్ రూ.904-940 కోట్లు ఐపీఓ ద్వారా సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.768-807గా నిర్ణయించింది. ఆగస్టు 10న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.200 కోట్లు,




ఆఫర్ ఫర్ సేల్ ద్వారా 91.66 లక్షల షేర్లను విక్రయించనున్నారు.మిల్కీ మిస్ట్ డెయిరీ ఫుడ్ రూ.1553 కోట్ల ఐపీఓ ఆగస్టు 11న ప్రారంభం కానుంది. ధరల శ్రేణిని రూ.133-140గా కంపెనీ నిర్ణయించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.1428 కోట్లు, ఆఫర్ పర్ సేల్ ద్వారా రూ.125 కోట్లు సమీకరించనన్నారు. ఒక డెయిరీ కంపెనీ ఈ స్థాయిలో నిధులు సమీకరించడం ఇదే తొలిసారి.షిప్‌రాకెట్ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ.1617.5 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.92-97గా నిర్ణయించింది. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.885.50 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.732 కోట్లు సమీకరించనుంది. ఆగస్టు 12న సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కానుంది.అల్లాయ్ స్టీల్ ఉత్పత్తుల తయారీదారు బెహోరీలాల్ ఇంజినీరింగ్ ఐపీఓ ఆగస్టు 12న ప్రారంభం కానుంది. ఐపీఓ ద్వారా రూ.302 కోట్లు సమీకరించనుంది. ధరల శ్రేణిని రూ.271-285గా నిర్ణయించారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.93 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూపంలో 73.20 లక్షల షేర్లను వాటాదారులు విక్రయించనున్నారు.

## గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

## బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 1,54,236 | ₹ 1,67,180 |
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

## వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 2,40,000

# మీ ఈపీఎఫ్ ఖాతాల మెర్జ్ వల్ల లాభాలు ఇవే..

ఉద్యోగ జీవితంలో ఒక చోటు నుంచి మరో కంపెనీకి మారడం సహజం. యూఏఎన్ ఒకటే ఉన్నా.. యాజమాన్యం మారినప్పుడల్లా కొత్త ఈపీఎఫ్ ఖాతా జనరేట్ అవుతుంది. అయితే, చాలా మంది ఈ ఖాతాలను విలీనం చేయకుండా అలానే విడిచిపెట్టేస్తుంటారు. మీకూ ఇలాంటి ఖాతాలు ఉన్నాయా? ఖాతాలను విలీనం చేయకుండా అలానే వదిలేస్తున్నారా? ఇలాగైతే, జరిగే నష్టాలేంటో తెలుసా?

ఖాతా నిర్వహణ మెరుగు: ఉద్యోగం మారినప్పుడు పాత పీఎఫ్ అకౌంట్‌లోని సొమ్మును కొత్త అకౌంట్‌కు మార్చడం చాలా ముఖ్యం. ఇలా చేయడం వల్ల మీ రిటైర్మెంట్ పొదుపు అంతా ఒకేచోట సురక్షితంగా ఉంటుంది. విత్‌డ్రా చేసుకునేటప్పుడు ఎలాంటి ఇబ్బందులూ ఉండవు.

సర్వీసు హిస్టరీ: పీఎఫ్ నిబంధనల ప్రకారం ఉద్యోగం మారినా సర్వీస్ కంటిన్యూటీ (5 ఏళ్లు) ఉండేలా చూసుకోవాలి. పాత బ్యాలెన్స్‌ను కొత్త అకౌంట్‌కు బదిలీ చేయడం వల్ల మీ సర్వీస్ హిస్టరీ కంటిన్యూ అవుతుంది. 5 ఏళ్ల సర్వీస్ పూర్తి కాకముందే పీఎఫ్ డ్రా చేస్తే మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) పడుతుంది. విలీనం వల్ల ట్యాక్స్ మినహాయింపు లభిస్తుంది. సెటిల్‌మెంట్లు సులువు: రిటైర్మెంట్ సమయంలో లేదా అత్యవసర పరిస్థితుల్లో పీఎఫ్ డబ్బును విత్‌డ్రా చేయాలంటే నిధులు ఒకచోట ఉంటే తీసుకోవడం సులువు. వివిధ అకౌంట్ల



నుంచి విత్‌డ్రా చేయాల్సిన అవసరం తప్పుతుంది.

అకౌంట్లు ఎలా మెర్జ్ చేయాలి?:

ఈపీఎఫ్ఓ మెంబర్ సేవా పోర్టల్ ఓపెన్ చేసి యూఏఎన్, పాస్‌వర్డ్ ఎంటర్ చేయాలి. అందులో వన్ మెంబర్- వన్ ఈపీఎఫ్ అకౌంట్ ఆప్షన్ ఎంచుకోవాలి. అక్కడ మీ వ్యక్తిగత వివరాలు స్క్రీన్‌పై కనిపిస్తాయి. వాటిని ధ్రువీకరించుకోవాలి.మీ పాత ఖాతాలన్నీ ఒకే చోట చేర్చేందుకు యూఏఎన్ ఐడీ ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఆపై మీ మొబైల్‌కు వచ్చే వన్‌టైమ్ పాస్‌వర్డ్ ఎంటర్ చేస్తే వెరిఫికేషన్‌కు వెళుతుంది.మీ నుంచి వెళ్లిన రిక్వెస్ట్ ప్రస్తుత ఎంప్లాయర్ ఆమోదించాల్సి ఉంటుంది. అక్కడ ఆమోదం పొందాక ఈపీఎఫ్ఓ మీ రిక్వెస్ట్‌ను ప్రాసెస్ చేస్తుంది.ఒకసారి ఈ ప్రక్రియ అంతా పూర్తయ్యాక పాత ఖాతాల్లో ఉన్న నగదు కూడా ఒకే ఖాతాలో దర్శనమిస్తుంది.

# ఏఐతో ఉద్యోగాల మిగులు

**కృత్రిమ మేధ ఉద్యోగాలు 83,100 వచ్చాయ్**

**లేఆఫ్‌లు 31,921 మాత్రమే**

**సీనియర్ స్థాయిల్లోనే అధిక నియామకాలు**

'కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ఫలితంగా భారత్‌లోనూ కొన్ని రంగాల్లో ఉద్యోగాలు పోతున్నాయి. ఇదే సమయంలో కోల్పోయిన ఉద్యోగాలకు మించి నూతన నియామకాలు చోటు చేసుకుంటున్నాయి' అని జపాన్‌కు చెందిన ఆర్థిక సేవల సంస్థ నొమురా వెల్లడించింది. ఈ సంస్థ రూపొందించిన 'ఏషియా ఎకనామిక్ మంత్లీ' నివేదిక ప్రకారం..

మనదేశంలో ఏఐ ఆధారిత నియామకాలు 83,100 లేఆఫ్‌లు, వలసల వల్ల పోయిన ఉద్యోగాలు 31,921 నికరంగా ఏఐ వల్ల లభించిన ఉద్యోగాలు 51,000. అధిక జనాభాకు తోడు అంతర్జాతీయ బ్యాక్‌ఆఫీస్ కేంద్రంగా భారత్‌కున్న స్థానం వల్ల, ఏఐకి కీలక మార్కెట్‌గా మారుతోందని నివేదిక వివరించింది. అందువల్లే ఆసియా దేశాల్లో ఏఐ సంబంధిత 1.31 లక్షల ఉద్యోగాల సృష్టి జరగ్గా, అందులో 83,100 వరకు భారత్‌లోనే సంభవించాయి. అత్యధికంగా ఏఐ ఆధారిత లేఆఫ్‌లు (31,921) కూడా భారత్‌లోనే ఉన్నాయి.

ప్రారంభ స్థాయి ఉద్యోగులకు గండం..

ఏఐ వల్ల ప్రారంభ స్థాయి ఉద్యోగులకు గిరాకీ తగ్గుతున్నా, సీనియర్ సిబ్బందికి డిమాండ్ అధికమవుతోంది.




భారత ఐటీ రంగంలోని 651 సంస్థలను ఐసీఆర్ఈఆర్ సర్వే చేయగా, ప్రారంభ స్థాయి నియామకాలు 55% తగ్గితే, మధ్య స్థాయిలో 25%, సీనియర్ లెవెల్‌లో 14% చొప్పునే తగ్గాయి. అంటే కంపెనీలు తమ సాధారణ (జూనియర్ ఉద్యోగులు చేసే) పనిని ఆటోమేట్ చేయడం పెరిగింది. 2021-22లో భారత ఐటీ కంపెనీల నికర నియామకాలు 6 లక్షలు ఉండగా, 2025-26లో 1.4 లక్షలకు పరిమితమయ్యాయని నివేదిక పేర్కొంది.

కొన్నేళ్లు పడుతుంది

ఏఐ ఇంకా ప్రారంభ స్థాయిలోనే ఉందని, కార్మిక మార్కెట్‌పై అది చూపే ప్రభావాన్ని పూర్తిగా అర్థం చేసుకోవడానికి ఇంకా కొన్నేళ్లు పడుతుందని నొమురా అంటోంది. ప్రస్తుతానికి ఏఐ వల్ల నికరంగా నియామకాలే కనిపిస్తున్నాయని వివరించింది.

ఇవన్నీ ఏఐతో భర్తీ

బ్యాంకింగ్ బ్యాక్‌ఆఫీస్ కార్యకలాపాలు,కస్టమర్ సర్వీస్,క్వాలిటీ అస్యూరెన్స్ టెస్టింగ్, కోడింగ్ వంటి జూనియర్ స్థాయి టెక్నికల్ ఉద్యోగాలు

# వ్యూహాత్మక చమురు నిల్వలు ఎందాక వచ్చాయ్?


**వెంటాడుతున్న భూసేకరణ, అనుమతులు, నిధుల సమస్యలు**

**న్యూఢిల్లీ:** ఇరాన్‌పై అమెరికా యుద్ధం మొదలు పెట్టినపుడు ముడిచమురు ధర ఒక్కసారిగా భగ్గుమనడానికి తోడు, సరఫరా అంతరాయాలు తీవ్రమయ్యా యి. ఫలితంగా దేశమంతా పెట్రోలు, డీజిల్, గ్యాస్‌కు ఇబ్బంది ఎదురైంది. అమెరికా, చైనా తరహాలో మనదగ్గరా వ్యూహాత్మక చమురు నిల్వలు (ఎస్‌పీఆర్) అధికంగా ఉంటే.. ఈ ఇబ్బందులు కొంతైనా తీరేవి. దేశీయంగా ముడిచమురును పెద్దమొత్తంలో నిల్వ చేసే ఎస్‌పీఆర్‌ను ప్రధానిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ఉన్నప్పుడు మొదలుపెట్టగా, యూపీఏ ప్రభుత్వం కొనసాగించింది. విశాఖపట్నం, మంగళూరు, పాదూరుల్లో మొత్తం 5.33 మిలియన్ టన్నుల సామర్థ్యం (39 మి.బ్యారెళ్ల)తో ఇవి ఏర్పాటయ్యాయి. దేశీయ పెట్రో అవసరాలను ఇవి 9.5 రోజులు మాత్రమే తీరుస్తాయి. అత్యవసర సందర్భాల్లో మాత్రమే వీటిల్లోని నిల్వలు వాడతారు. 2015లో నరేంద్ర మోదీ హయాంలో విశాఖపట్నం కేంద్రం ప్రారంభమయ్యాక.. ఇటీవలి వరకు వీటి అవసరం అంతగా కనపడనందున పెద్దగా పట్టించుకోలేదు. పశ్చిమాసియా సంక్షోభం వల్ల మళ్లీ ఎస్‌పీఆర్ ఆవశ్యకత గుర్తుకొచ్చింది.కేంద్రం ప్రకటించిన 5 కొత్త ఎస్‌పీఆర్ ప్రాజెక్టులు పూర్తయితే, మరో 19 మిలియన్ టన్నుల చమురు నిల్వ చేసుకోవచ్చు. అవి దేశీయ అవసరాలను 40 రోజులు తీర్చగలవు. మంగళూరులో 1.75 మి.టన్నుల సామర్థ్యంతో ఎస్‌పీఆర్ ఏర్పాటు చేస్తామని ఓఎన్‌జీసీ ప్రకటించినా, ఇందులో సగభాగాన్ని వాణిజ్య కార్యకలాపాలకు వినియోగిస్తామని తాజాగా కేంద్రం తెలిపింది.

**మిలియన్ టన్నుల సామర్థ్యానికి రూ.2,500 కోట్లు అవసరం**




అమెరికా ఎస్‌పీఆర్ 700 మి.బ్యారెళ్లకు పైగా ఉండగా, చైనా ఇప్పటికే 300 మి.బ్యారెళ్ల సామర్థ్యాన్ని నిర్మించింది. ఇంకా పనులు కొనసాగిస్తోంది. చమురు వాణిజ్య నిల్వ కేంద్రాలైతే, అద్దె, ట్రేడింగ్ రూపంలో ఆదాయం లభిస్తుంది. ఎస్‌పీఆర్‌లో నిల్వలు దీర్ఘకాలం నిల్వ ఉంచి, అత్యసరాల్లో వాడతారు కనుక, ఆదాయం ఏమీ రాదు. కానీ సంక్షోభ సమయాల్లో వ్యక్తులకు బీమా పాలసీ ఉపయోగపడినట్లే, అంతర్జాతీయ సరఫరా ఆటంకాలు ఎదురైనప్పుడు ఎస్‌పీఆర్ ఆదుకుంటుందని.. అందువల్ల వాటిని వాణిజ్య ఆస్తులుగా పరిగణించరాదని నిపుణులు అంటున్నారు. ఒక మిలియన్ టన్నుల ఎస్‌పీఆర్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయాలంటే రూ.2,500 కోట్లు అవసరమవుతాయి. మెరుగైన మౌలిక వసతులు, పైపులైన్లు దీనికి అదనం.



ఈ మొత్తం ప్రభుత్వ బడ్జెట్‌పైనే ఆధారపడాలి. కానీ జాతి భద్రత కోసమే ఈ కేంద్రాలను తలపెట్టారు కనుక, ప్రభుత్వ పెట్టుబడులు కొనసాగాలి.మనదేశం ఇప్పటికైనా చమురు అత్యవసర నిల్వల సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాల్సిందే. పశ్చిమాసియా సంక్షోభానికి ముందు, రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలోనూ ముడి చమురు ధరలు భారీగా పెరిగాయి. గత నాలుగేళ్లలో బ్రెంట్ చమురు బ్యారెల్ ధర 120 డాలర్లకు చేరింది కూడా. దేశీయ చమురు అవసరాల్లో 85% దిగుమతులే తీరుస్తున్నందున.. ధరలు అకస్మాత్తుగా పెరిగినా, రవాణా నౌకలకు ఆటంకాలు ఏర్పడినా.. మన ఆర్థిక వ్యవస్థపై పెను ప్రభావం పడుతుంది. అందుకే సరిపడా అత్యవసర ఇంధన నిల్వల ప్రాధాన్యాన్ని ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఈఏ) ఎప్పటికపుడు గుర్తు చేస్తోంది. ఎస్‌పీఆర్ కేంద్రాల విస్తరణకు అవసరమైన భూసేకరణ, అనుమతులు, నిధుల సమస్యను ప్రభుత్వం శరవేగంగా పరిష్కరిస్తేనే, దేశ దీర్ఘకాల ఇంధన భద్రత బలోపేతం అవుతుంది.

**లేజర్ లైట్లతో పైలట్ తడబాటు..**

# గాల్లోనే చక్కర్లు కొట్టిన విమానం

విమానం ల్యాండింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో పైలట్‌ను లేజర్ లైట్లు ఇబ్బందులకు గురిచేశాయి. దీంతో విమానాన్ని కిందికి దించకుండా అలాగే గాల్లో చక్కర్లు కొట్టించారు. రెండో ప్రయత్నంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. కోల్‌కతా అంతర్జాతీయ విమానాశ్రయంలో శనివారం రాత్రి ఈ ఘటన చోటుచేసు కుంది. విమానాశ్రయ వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం.. మలేషియా ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఓ విమానం 159 మంది ప్రయాణికులతో కౌలాలంపూర్ నుంచి కోల్‌కతాకు వస్తోంది. గమ్యస్థానం సమీపించడంతో పైలట్లు ల్యాండింగ్‌కు సిద్ధమయ్యారు. అయితే, రన్‌వేకు ఎనిమిది నాటికల్ మైళ్ల (దాదాపు 15 కి.మీ.) దూరంలో ఉన్నప్పుడు మధ్యమ్‌గ్రామ్-బరసాత్ వైపు నుంచి విమానం కాక్‌పిట్ దిశగా అకస్మాత్తుగా ప్రకాశవంతమైన లేజర్ కాంతులు వచ్చాయి.అనుకోని పరిణామంతో తడబడిన పైలట్.. విమానాన్ని అలాగే గాల్లో చక్కర్లు కొట్టించి, కాసేపటికి సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విమానయాన సంస్థ ఈ విషయాన్ని ఎయిర్‌పోర్టు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కోల్‌కతా విమానాశ్రయ డైరెక్టర్ విక్రమ్ సింగ్ తెలిపారు.





# ఇంటి భోజనమూ ఖరీదైంది

**పెరిగిన ఉల్లి, నూనె, వంటగ్యాస్, చికెన్ ధరలు**

**వెజ్ భోజనం 4%, నాన్ వెజ్ 9% పైకి: క్రిసిల్**

ముంబయి: ఇంట్లో భోజనం తయారీ ఖర్చు గత నెలలో పెరిగింది. జులైలో శాకాహార(వెజ్) భోజనం వ్యయాలు 4% పెరగ్గా, మాంసాహార (నాన్‌వెజ్) భోజనం 9% భారమైంది. ఉల్లి, నూనె, వంట గ్యాస్, చికెన్ ధరలు పెరగడం ఇందుకు దోహదం చేసిందని క్రిసిల్ ఇంటెలిజెన్స్ తన నివేదికలో పేర్కొంది. దీని ప్రకారం..అకాల వర్షం, యుద్ధంతో..: ఉల్లి ధరలు ఏడాది కిందటితో పోలిస్తే 20%; కూరగాయల నూనె, ఎల్‌పీజీ సిలిండర్ ధర వరుసగా 11%, 10% పెరిగాయి. అధిక ధరల వద్ద ఖరీదు చేసిన రబీ నిల్వల రాకతో, ఉల్లి రిటెయిల్ ధరలు 23% పెరిగాయి. అయితే బంగాళదుంప, టమాటా ధరలు వరుసగా 12%, 2% తగ్గడం ఉపశమనం కల్పిస్తోంది. రబీ ఉత్పత్తి 2-3% పెరగడంతో బంగాళ దుంపల ధర తగ్గింది. ఆలస్యంగా విత్తడంతో జులైలో అధికంగా మార్కెట్లోకి సరుకు రావడంతో టమాటా ధర 1% తగ్గింది. చికెన్ ధరలూ..: బ్రాయిలర్ చికెన్ రేట్లు 14% పెరిగాయి. జూన్‌తో పోలిస్తే మాత్రం నాన్‌వెజ్ భోజనం వ్యయంలో పెద్దగా మార్పులేదు. ఈ సమయంలో బ్రాయిలర్ ధర 21% తగ్గినా, ఇతర దినుసుల ధరలు పెరగడంతో ఆ ప్రభావం కనిపించలేదు.

# ఇంటి పొదుపు పెరుగుతోంది

**2024-25లో జీడీపీలో 21.7 శాతానికి**

దిల్లీ: దేశంలో కుటుంబాల పొదుపు ఏటా పెరుగుతూ వస్తోంది. 2022-23లో జీడీపీలో దీని వాటా 20% కాగా, 2024-25 కల్లా 21.7 శాతానికి పెరిగింది. జీడీపీ కొత్త సిరీస్ ప్రకారం, 2022-23లో కుటుంబాల పొదుపు రూ.52.25 లక్షల కోట్లుగా ఉండగా, 2024-25 కల్లా రూ.69.01 లక్షల కోట్లకు చేరిందని పార్లమెంటుకు ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ తెలిపారు. ఆదాయం పెరగడానికి, తద్వారా పొదుపు అధికం కావడానికి, కుటుంబ ఆర్థిక భద్రతకు ఇటీవల కేంద్రం, ఆర్‌బీఐ పలు చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. వార్షిక ఆదాయపు పన్ను పరిమితిని రూ.12 లక్షలకు చేర్చడం వల్ల కుటుంబాల వద్ద ఖర్చు చేయదగ్గ ఆదాయం పెరిగిందని, వినియోగం మెరుగైందని మంత్రి తెలిపారు.బ్యాంకుల వద్ద థర్డ్ పార్టీ ఉత్పత్తులు, సేవల విక్రయాలు వినియోగదారు అవసరాలకు తగ్గట్లుగా ఉండాలంటూ ఆర్‌బీఐ తెలిపిందని గుర్తు చేశారు.గత అయిదు ఆర్థిక




సంవత్సరాల్లో సెస్సులు, సర్‌ఛార్జీల రూపంలో రూ.32.05 లక్షల కోట్లు వసూలు చేసినట్లు పేర్కొన్నారు.ఏఐ/ఎమ్ఎల్ వంటి కొత్త తరం సాంకేతికతల వల్ల భారత ఆర్థిక రంగంలో డిజిటల్ పరివర్తన కనిపిస్తోందని తెలిపారు. క్రెడిట్ అండర్‌రైటింగ్, మోసాల గుర్తింపు, పెట్టుబడుల నిర్ణయాల వంటి వాటికి బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఏఐ ఆధారిత పరిష్కారాలను తీసుకొచ్చాయన్నారు.

# ఔషధ ఎగుమతులకు టారిఫ్‌ల సెగ

**2030కి రూ.12.35 లక్షల కోట్ల లక్ష్యం కష్టమే**

**ఫార్మెగ్జిల్ ఛైర్మన్ నమిత్ జోషి**

దేశీయ ఔషధ పరిశ్రమ నిర్దేశించుకున్న వృద్ధి లక్ష్యాలకు, అంతర్జాతీయ అనిశ్చితులు అడ్డుగా నిలుస్తున్నాయి. అమెరికా సుంకాల (టారిఫ్)పై నెలకొన్న సందిగ్ధత, పశ్చిమాసియాలో రవాణా అంతరాయాలు మన ఎగుమతులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. 2030 నాటికి 130 బిలియన్ డాలర్ల (రూ.12.35 లక్షల కోట్ల) మార్కెట్ పరిమాణాన్ని అందుకోవాలన్న భారత ఫార్మా రంగం కలలు నెరవేరేలా కనిపించడం లేదు. అప్పటికి భారత ఫార్మా పరిశ్రమ విలువ 80-90 బిలియన్ డాలర్ల (రూ.7.60 - 8.55 లక్షల కోట్ల)కు మాత్రమే పరిమితం కావొచ్చని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెగ్జిల్) ఛైర్మన్ నమిత్ జోషి ఒక వార్తా సంస్థతో పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం దేశీయ ఫార్మా రంగం విలువ రూ.5.70 లక్షల కోట్లుగా నమోదైంది. ఇందులో ఎగుమతుల వాటా రూ.2.95 లక్షల కోట్లు.అమెరికాకు అతిపెద్ద జనరిక్ మందుల సరఫరాదారుగా



మనదేశం ఉంది. అక్కడ వినియోగించే ప్రతి రెండు జనరిక్ ప్రిస్క్రిప్షన్లలో ఒకటి భారత్ నుంచి వెళ్లే మందులేనని చెబుతారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన నూతన సుంకాల విధానం భారత ఫార్మా కంపెనీలకు పెద్ద సవాలుగా మారనుంది. అమెరికా బయట తయారయ్యే జనరిక్స్‌పైనా 2028 ఆగస్టు 1 నుంచి 100%, ఆ తర్వాత ఏడాది నుంచి 200% ఈ సుంకాలుంటాయని ట్రంప్ హెచ్చరించారు. ఇంతటి భారాన్ని తట్టుకునే సామర్థ్యం భారత ఫార్మా కంపెనీలకు లేదని జోషి విశ్లేషించారు. అమెరికాలో తయారీ కేంద్రాన్ని నిర్మించి, సరఫరా పునరుద్ధరించేందుకు కనీసం అయిదేళ్ల సమయం పడుతుందని స్పష్టం చేశారు.పశ్చిమాసియా సంక్షోభం వల్ల సరకు రవాణా నౌకల వ్యయాలు, ప్రయాణ సమయం భారీగా పెరిగాయి. ఈ ప్రభావం అమెరికాకు జరిగే ఎగుమతులపై పడింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో అమెరికాకు భారత ఫార్మా ఎగుమతులు రూ.92,150 కోట్ల (9.7 బి.డాలర్ల)కు పడిపోయాయి. 2024-25లో ఇవి రూ.99,750 కోట్లు (10.5 బి.డాలర్లు) కావడం గమనార్హం. అయితే బ్రెజిల్, ఐరోపా దేశాల నుంచి గిరాకీ లభించడంతో, మన మొత్తం ఫార్మా ఎగుమతులు 2.13% వృద్ధిని నమోదు చేయగలిగాయని నమిత్ జోషి వివరించారు.రాబోయే మూడేళ్లలో ఫార్మా పరిశ్రమ వార్షిక వృద్ధి రేటు 6-10% మధ్య కొనసాగొచ్చని ఫార్మెగ్జిల్ అంచనా వేస్తోంది. ఆ తర్వాత బయోసిమిలర్స్, పెప్టైడ్స్ వంటి అధిక విలువ కలిగిన ఉత్పత్తుల జోరు పెరిగితే, వృద్ధి రేటు రెండంకెల స్థాయికి చేరుకుంటుందని భావిస్తోంది.

# అక్రమాల ముద్ర.. ఆపరేటర్లకు వేటు భయం



## భూభారతిలో ఆపరేటర్ల కుదింపు కుదింపు కలకలం

- 636 మందిలో 332 మందికే కొనసాగింపు
- సెట్ విచారణలో అసలు బాధ్యులెవరో తేల్చాలి
- దోషులపై మాత్రమే చర్యలు తీసుకోవాలని డిమాండ్

*తెలంగాణలో భూ రికార్డులు, ఆస్తుల రిజిస్ట్రేషన్ల కోసం ఏర్పాటు చేసిన ధరణి పోర్టల్ పేరును ప్రభుత్వం భూభారతిగా మార్చిన నేపథ్యంలో తాత్కాలిక ధరణి ఆపరేటర్లలో ఆందోళన నెలకొంది. పోర్టల్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందం (సెట్) ఏర్పాటు చేయడంతో పాటు ఆపరేటర్ల సంఖ్యను కుదించడంపై ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.*

**యాలాల, ఆగస్టు 9 (జనంసాక్షి):** 2018లో ఎల్ఆర్ఎస్ నిర్వహణ కోసం ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా కొంతమంది తాత్కాలిక ఉద్యోగులను నియమించారు. అనంతరం 2020 అక్టోబర్ 29న అప్పటి ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను ప్రారంభించి, వీరిలో పలువురికి ధరణి ఆపరేటర్లుగా బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వం మారిన అనంతరం 2025 ఏప్రిల్ 14న ధరణి పేరును భూభారతిగా మార్చింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా 636 మంది తాత్కాలిక ఉద్యోగులు సేవలందిస్తుండగా, వారిలో 332 మందినే కొనసాగించేలా మార్గదర్శకాలు జారీ కావడం ఆపరేటర్లలో ఆందోళనకు కారణమైంది. పోర్టల్ లావాదేవీల్లో అక్రమాలకు ఆపరేటర్లే కారణమన్న వాదన సరికాదని వారు పేర్కొంటున్నారు. ఎక్కడైనా తప్పిదాలు జరిగితే వాటిపై విచారణ జరిపి బాధ్యులైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి తప్ప అందరినీ ఒకే గాటన కట్టి ఉద్యోగాలను కుదించడం సమంజసం కాదని అంటున్నారు.

**అధికారులపై పని భారం**

ఇప్పటికే రెవెన్యూ శాఖలో సిబ్బంది కొరతతో ప్రజలకు సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆపరేటర్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆపరేటర్లను తగ్గించి వారి స్థానంలో జూనియర్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తే రెవెన్యూ సిబ్బందిపై మరింత పని భారం పడుతుందని పేర్కొంటున్నారు. దీంతో సమస్య పరిష్కారం కాకుండా మరింత జటిలమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**సెట్ పై ఆశలు.. అనుమానాలు**

భూభారతి పోర్టల్‌లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో చారుసిన్హా ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక విచారణ బృందాన్ని ఏర్పాటు చేసింది. కమిటీలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్ఐసీకి చెందిన నిపుణుడిని కూడా చేర్చింది. పోర్టల్ ప్రారంభమైన నాటి నుంచి జరిగిన లావాదేవీలు, వాటి ద్వారా లబ్ధి పొందినవారు, నిబంధనల ఉల్లంఘనలు వంటి అంశాలను కమిటీ పరిశీలించాల్సి ఉంది.

**నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు?**

కొన్ని ప్రాంతాల్లో రాజకీయ ఒత్తిళ్ల కారణంగా నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు చేయాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయని ఆపరేటర్లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ ఖజానాకు చెల్లించాల్సిన రుసుములు, ఆడిటింగ్‌లో జరిగిన జాప్యాలు, లావాదేవీల్లో లోపాలు వంటి అంశాలపై ఉన్నత స్థాయిలో సమగ్రంగా పరిశీలించకుండా కేవలం కింది స్థాయి తాత్కాలిక ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం అన్యాయమని వారు వాపోతున్నారు. దాదాపు 16 నెలలుగా నెలసరి వేతనాలు సక్రమంగా అందక ఇబ్బందులు పడుతున్న తమను అన్ని అక్రమాలకు బాధ్యులుగా చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. సెట్ విచారణను నిష్పక్షపాతంగా నిర్వహించి, నిజంగా తప్పు చేసిన వారిని గుర్తించి వారిపైనే చర్యలు తీసుకోవాలని ధరణి ఆపరేటర్లు కోరుతున్నారు



# కాంగ్రెస్ సర్కారులో పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ

- ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం
- తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయానికి ప్రతీక బోనాల పండుగ
- ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్ విజయరమణ రావు

**పెద్దపల్లి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** పెద్దపల్లి పట్టణంలోని శాంతినగర్ లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నూతన రేషన్ షాపును స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించిన ప్రభుత్వవిప్,పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.అనంతరం ఆషాఢ మాస బోనాల పండుగ మహోత్సవం సందర్భంగా పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా ప్రధాన రోడ్డులో గల శ్రీ కళ్యాణమస్తు షాపింగ్ మాల్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ హయంలో పేదలకు ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని నిరుపేదలకు గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు మంజూరు చేయక వారిని మోసం చేశారని కానీ ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్లో అర్హులైన పేదలందరికీ నూతనంగా రేషన్ కార్డులు మంజూరు చేసి వారందరికీ సన్నబియ్యం పంపిణీ చేయడం జరుగుతుంది అని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలు సుఖంగా ఉన్నారని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢ మాసంలో ఘనంగా నిర్వహించే బోనాల పండుగ మన రాష్టానికే ప్రతీకగా నిలిచి మన సంస్కృతి సాంప్రదాయాలను మరింతగా ఉట్టిపడేలా జరుగుతున్నాయని మన బోనాల పండుగను మరింతగా ప్రోత్సహిస్తూ రాష్ట ప్రభుత్వం ఆర్థిక సహాయ సహకారాలు మరియు గుర్తింపును కలిగిస్తుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే పేదల ప్రభుత్వం అని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్,నూగిళ్ల మల్లయ్య,శ్రీ కళ్యాణమస్తు షాపింగ్ మాల్ నిర్వాహకులు,పట్టణ కౌన్సిలర్లు మరియు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు మహిళలు,తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదకర స్థితికి చేరుకున్న బ్రిడ్జి

**ప్రమాదం సంభవించే వరకు స్పందించరా..?**

**పెద్ద కొడప్గల్ ఆగస్టు 09 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండలంలోని విఠల్వాడి తాండ గ్రామం నుంచి విఠల్వాడి గ్రామం వైపు వెళ్లే దారిలో బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. గత కొన్ని సంవత్సరాలుగా బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకున్న అధికారులు మరమ్మత్తు చర్యలు చేపట్టడం లేదు. దీంతో బ్రిడ్జి పూర్తిగా కూలిపోయే స్థితికి చేరుకుంది. మరమ్మత్తులకు పైపులు తెచ్చిన పని జరగడం లేదు. నిత్యం విఠల్వాడి, లింగంపల్లి, బాబుల్ గావ్ గ్రామాల తో పాటు పలు గ్రామాలకు రాకపోకలు సాగించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి పనులు ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

## డిసిసి కార్యాలయంలో క్విట్ ఇండియా దినోత్సవ వేడుకలు

**1942 భారత్ ఛోడో పిలుపే స్వాతంత్ర్యానికి నాంది**



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ఆదివారం రోజు క్విట్ ఇండియా దినోత్సవంను పురస్కరించుకొని కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పాల్గొని కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి స్వాతంత్ర్య సమరయోధులకు నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ, "1942 ఆగస్టు 9న ముంబైలోని క్రాంతి మైదాన్ నుండి మహాత్మా గాంధీ 'భారత్ ఛోడో' అనే చారిత్రాత్మక పిలుపునిచ్చారు. బ్రిటిష్ వారు భారతదేశాన్ని విడిచి వెళ్లాలని ఇచ్చిన ఈ పిలుపు ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. గాంధీజీ నేతృత్వంలో జరిగిన శాంతియుత క్విట్ ఇండియా ఉద్యమ ఫలితంగానే నేడు మన దేశం స్వతంత్రంగా వర్ధిల్లుతోందని గుర్తు చేశారు. ఆనాటి మహా నాయకులు, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని, నాటి ఉద్యమ స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని యావత్ కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న రెడ్డి, మాజీ జిల్లా సేవాదళ్ చైర్మన్ ముస్తాక్ అహ్మద్, మాజీ అర్బన్ బ్యాంక్ చైర్మన్ కర్ర రాజశేఖర్, వీఆర్వో మడుపు మోహన్, పెంట శేఖర్, వంగల విద్యాసాగర్, హైమద్, ఇమ్రాన్ ఘని, రాజ్ కుమార్, పద్మ, నిహాల్, బొబ్బిలి విక్టర్ తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాబోయే భవిష్యత్తులో అయిల్ ఫామ్ సాగు

- దక్షిణ భారత దేశంలోనే అగ్రస్థానంలో సిద్దిపేట
- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట బ్యూరో ఆగస్టు 09 (జనంసాక్షి) :** సిద్దిపేట నియోజకవర్గంలో రైతుల జీవితాల్లో గుణాత్మక మార్పు రావాలన్న తన ఐదేళ్ల కల ఆయిల్ పామ్ సాగుతో సాకారమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. చిన్న కోదూరు మండలం మేడిపల్లి గ్రామంలో రైతు ముక్కిస పాపిరెడ్డి సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశమై అద్భుతమైన దిగుబడి సాధిస్తున్న రైతులను ఆయన అభినందించారు.ఐదేళ్ల క్రితం ఖమ్మం జిల్లా సత్తుపల్లి ప్రాంతంలో ఆయిల్ పామ్ తోటలను, అక్కడి రైతుల ఉన్నతమైన జీవనశైలిని చూసినప్పుడు.. సిద్దిపేట రైతులు కూడా ఇలాగే ఆర్థికంగా ఎదగాలని తాను బలంగా కోరుకున్నానని హరీశ్ రావు గుర్తుచేసుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వచ్చినప్పటికీ, అంతా వరి పంటే వేయడం వల్ల రైతుల ఆదాయంలో పెద్దగా మార్పు రాలేదన్నారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ సాగు చేయాలని నిపుణుల ను అడిగినప్పుడు మొదట ఇక్కడ గాలిలో తేమ లేదని చెప్పారని, కానీ మల్లన్న సాగర్, రంగనాయక సాగర్, చెక్ డ్యామ్ లు నిండిన తర్వాత తేమ శాతం పెరిగి సాగుకు అనుకూలంగా మారిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు నిర్ధారించారని ఆయన వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్లే ఈ అద్భుతం సాధ్యమైందన్నారు.జూన్ 5, 2021న నంగునూరులో ఎల్లారెడ్డి అనే రైతు పొలంలో మొదటి మొక్క నాటగా, సరిగ్గా మూడేళ్ల తర్వాత జూన్ 15, 2024న అక్కెనపల్లిలో నాగేందర్ అనే రైతు పొలంలో మొదటి గెల కోశారని హరీశ్ రావు తెలిపారు. మొదటి గెల కోసి, ఫ్యాక్టరీకి పంపిన కొద్ది రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడటంతో అందరిలో నమ్మకం కుదిరిందన్నారు.ప్రస్తుతం సిద్దిపేట నియోజకవర్గంలో 5,322 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరుగుతుండగా, 301 ఎకరాల్లో కటింగ్ మొదలైందని సంతోషం వ్యక్తం చేశారు. నంగునూరు 2750 ఎకరాలతో మొదటి స్థానంలో, చిన్నకోదూరు 1050 ఎకరాలతో రెండో స్థానంలో ఉన్నాయన్నారు. భవిష్యత్తులో దీనిని 50 వేల ఎకరాలకు విస్తరించి, రాష్ట్రానికే సిద్దిపేటను దిక్సూచిగా మారుస్తామన్నారు.నియోజకవర్గంలో మొత్తం లక్షా 2 వేల ఎకరాల సాగు భూమి ఉంటే, అందులో 88 వేల ఎకరాల్లో కేవలం వరి మాత్రమే పండిస్తున్నారని హరీశ్ రావు ఆవేదన వ్యక్తం చేశారు.

### విశ్వనాథ్ చెస్ అకాడమీ సబ్ జూనియర్స్

## చెస్ ఛాంపియన్‌షిప్ ముగింపు

**కరీంనగర్ కల్చర్ ఆగస్టు 9 (జనం సాక్షి):** విశ్వనాథ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్స్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. ఈ టోర్నమెంట్ ముగింపు , బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి విశ్వనాథ్ ప్రసాద్ అకాడమీ డైరెక్టర్, కాకతీయ స్కూల్ ప్రిన్సిపాల్ జార్జ్ రెడ్డి, కరీంనగర్ జిల్లా అసోసియేషన్ రాజేంద్ర ప్రసాద్ , అకాడమీ కోచ్ శివయ్య ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు.వివిధ వయసుల విభాగాల్లో ప్రతిభ చాటిన తుది విజేతల వివరాలు.అండర్-09 విభాగం విజేతలుమొదటి స్థానం: సంగం ఆర్యన్ ,రెండో స్థానం: తాండ్ర చైతన్య ,,మూడో స్థానం: శ్రియాంశ్ చంద్ర అండర్-11 విభాగం విజేతలు మొదటి స్థానం: ముస్త్యాల వాసుదేవ్ ,రెండో స్థానం: అన్విత్ అగస్త్య చందా ,మూడో స్థానం: ఆరాధ్య. కె, అండర్-13 విభాగం విజేతలుమొదటి స్థానం: దాసరి విగ్నేష్ ,రెండో స్థానం: అమన్ రామ్ బాలసంకుల ,మూడో స్థానం: గద్దె శివాన్ ,అండర్-16 విభాగం విజేతలుమొదటి స్థానం: బొడ్డు ప్రీతమ్ ,రెండో స్థానం: అరిగెల జైదీప్ ,మూడో స్థానం: అకేనపల్లి విశ్రుత్రామ్ ,ఉత్తమ మహిళా క్రీడాకారిణులు మొదటి స్థానం: లక్ష్మి నందిని ,రెండో స్థానం: మరియం.

## ఆన్లైన్ ఫ్రాడ్‌తో రూ. 2.39 లక్షలు కుచ్చుటోపీ

**అపాయింట్‌మెంట్ పేరుతో ఏపీకే లింక్ పంపి మోసం**

**చేర్యాల ఆగస్టు 09 (జనంసాక్షి) :**

ఆస్పత్రి అపాయింట్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో వెతికి ఫోన్ చేసిన వ్యక్తి సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మోసపోయిన సంఘటన సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల పట్టణానికి చెందిన మాంకాల రాజు (50) సోమవారం తన భార్యకు ఆస్పత్రిలో అపాయిం ట్‌మెంట్ కోసం ఇంటర్నెట్‌లో వెతికి ఒక నెంబర్‌కు కాల్ చేశారు. అపాయింట్‌మెంట్ బుక్ అయ్యిందని చెప్పి మోసగాళ్లు అతని వాట్సాప్‌కు ఒక ఏపీకే ఫైల్ పంపారు. దానిని ఓపెన్ చేయగానే రాజు బ్యాంక్ అకౌంట్ నుండి రూ. 2,39,895 డెబిట్ అయ్యాయి. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు వెంటనే పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు కాల్ చేయడంతో బాధితుడి ఖాతాలో మిగిలిన రూ. 1,00,000 వరకు హోల్డ్ చేయించగలిగారు.ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల సూచన ఆన్‌లైన్ అపాయింట్‌మెంట్లు, రిఫండ్లు, లోన్ల పేరుతో వచ్చే ఏపీకే లింకులు, యాప్‌లను డౌన్‌లోడ్ చేయవద్దని హెచ్చరించారు. అనుమానం వస్తే వెంటనే 1930కు ఫోన్ చేయాలని పోలీసులు సూచించారు.



## ఘనంగా 104వ సబ్జిమండీ వార్షిక బోనాల మహోత్సవం

**హైదరాబాద్/రాజేంద్రనగర్, ఆగస్టు 9 (జనం సాక్షి):** కార్వాన్ నియోజకవర్గంలోని సబ్జిమండీలో నల్లపోచమ్మ, మాత మహంకాళి దేవాలయాల 104వ వార్షిక బోనాల మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం చివరి ఆదివారం సందర్భంగా 14 బస్తీలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి సామూహికంగా బోనాలు సమర్పించారు.

ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాన్ని ప్రత్యేకంగా అలంకరించి, డప్పు చప్పుళ్లు, జానపద కళాకారుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాల మధ్య వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.ఈ కార్యక్రమంలో గడ్డం వివేక్ వెంకటస్వామి, బండి సంజయ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కౌసర్ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కట్ట లింగం, ప్రధాన కార్యదర్శి అల్లె రాంకుమార్, కోశాధికారి చింత శ్రీకాంత్, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## జిల్లా వ్యాప్తంగా ఘనంగా ఎంపీ సురేష్ షెట్కర్ జన్మదిన వేడుకలు



**కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 8 (జనం సాక్షి ):** జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ షెట్కర్ 66వ జన్మదిన వేడుకలను జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు నియోజకవర్గాలు, మండలాలు, సంబరాలు కామారెడ్డి, ఎల్లారెడ్డి, జుక్కల్, బాన్సువాడ, వర్ని, కోటగిరి, నిజాంసాగర్, గాంధారి తదితర ప్రాంతాల్లో వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు చోట్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ఎంపీ ఆయురారోగ్యాలతో, చల్లగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించారు. కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా ప్రభుత్వ దవాఖానాల్లో పండ్లు పంపిణీ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న కారణంగా ఎంపీ సురేష్ షెట్కర్ ఢిల్లీలో ఉన్నారు. అయినప్పటికీ జిల్లా నుండి పలువురు నాయకులు, అభిమానులు నేరుగా ఢిల్లీకి వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ సురేష్ షెట్కర్ జిల్లాలోని ప్రతి కార్యకర్తకు, ప్రతి అభిమానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ప్రభుత్వ పిఏ రేపని భాస్కర్ ఫోన్ ద్వారా తెలియజేశారు.

### లక్ష్మీనారాయణపూర్-యాలాల్ రోడ్డు

## మరమ్మతులకు సొంత నిధులు


### ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి



**యాలాల అగస్టు 9 (జనంసాక్షి) :** మండల పరిధిలోని లక్ష్మీనారాయణపూర్ నుంచి యాలాల వరకు దెబ్బతిన్న రహదారి మరమ్మతు పనులను ఆర్బిఓఎల్ సీఈఓ బుయ్యని శ్రీనివాస్ రెడ్డి సొంత నిధులతో చేపట్టారు.ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఈ చర్య తీసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.గత కొంతకాలంగా రహదారి పూర్తిగా దెబ్బతినడంతో వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గమనించినట్లు బిఎస్ఆర్ చెప్పారు. ప్రజలు రోజూ ఎదుర్కొంటున్న సమస్యను దృష్టిలో పెట్టుకుని తక్షణమే మరమ్మతు పనులు మొదలుపెట్టాం అని ఆయన పేర్కొన్నారు.ఇది తన వంతు సామాజిక బాధ్యత అని భావిస్తున్నట్లు తెలిపారు.నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు పనులు పూర్తి చేసి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రవాణా సౌకర్యం కల్పించడమే మా లక్ష్యమని అన్నారు.రోడ్డు మరమ్మతుల వల్ల ఆ ప్రాంత ప్రజలకు, వ్యాపారులకు, విద్యార్థులకు ఎంతో ఉపయోగం కలుగుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# శిథిలావస్థకు చేరుకున్న బీసీ బాలుర వసతి గృహం

- వెంటనే నూతన ఇంటిగ్రేటెడ్ వసతి గృహాన్ని నిర్మించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**జమ్మికుంట, ఆగస్టు 09 (జనం సాక్షి):** జమ్మికుంట మండల కేంద్రంలో గత ఐదు దశాబ్దాల క్రితం నిర్మించిన బీసీ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరుకుందని,వెంటనే బాలుర హైస్కూల్ ఆవరణలో నూతన ఇంటిగ్రేటెడ్ వసతి గృహం నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు.ఆదివారం రోజున సిపిఎం జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ 56 మంది విద్యార్థులు వసతి గృహంలో ప్రతి క్షణం బిక్కుబిక్కుమంటూ, భయం భయంగా కాలం వెళ్లదీస్తున్నారని, హాస్టల్ భవనం మొత్తం స్లాబు, గోడలు పెచ్చులూడుతున్నాయన్నారు.

స్లాబ్‌పై నుండి వర్షం నీరు రూముల్లోకి వస్తున్నాయన్నారు.డోర్లు లేని రూములు ఉండడం నిజంగా సిగ్గుచేటు అన్నారు.కిటికీలకు డోర్లు లేకపోవడం విద్యార్థులే వారి బట్టలను అడ్డుగా ఏర్పాటు చేసుకొని బస చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బడుగు,బలహీన వర్గాల విద్యార్థులే హాస్టల్ లో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారని,వారికి కనీస సౌకర్యాలు కల్పించకుండా పాలక ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం శోచనీయమన్నారు.56 మంది విద్యార్థులకు కేవలం రెండు బాత్రూంలే ఉండడం, మిగతా బాత్రూంలో అన్ని పనిచేయకపోవడంతో విద్యార్థులు ఆరు బయటనే స్నానాలు చేస్తున్నారన్నారు. వెంటనే యుద్ధ ప్రాతిపదికన మరో భవనంలోకి విద్యార్థులను తరలించాలని డిమాండ్ చేశారు.స్లాబ్ పెచ్చులూడి విద్యార్థులకు ఏమైనా ప్రమాదాలు జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.ఇంత ప్రమాదకరంగా ఉన్న హాస్టల్ ను జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక ఎమ్మెల్యే ఎంత మాత్రం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు.

ప్రమాదాలు జరిగిన తర్వాత సమీక్ష చేస్తారా అని ప్రశ్నించారు.పాలకవర్గ పార్టీలు రాజకీయాలు పక్కన పెట్టి విద్యార్థుల శ్రేయస్సు కోసం స్పందించాలన్నారు. బాలుర హైస్కూల్ పక్కనే సువిశాలమైన ఖాళీ స్థలం ఉందని అందులోనే ఇంటిగ్రేటెడ్ నూతన హాస్టల్ నిర్మించి,విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.ఇప్పటికిప్పుడు ఖర్చులు అంచనా వేసి రిపేర్లు చేస్తే అవి త్వరగా మళ్లీ పాడైపోయే ప్రమాదం ఉంటుందన్నారు.

ఎంతోమంది విద్యార్థులు ఈ హాస్టల్లో చదువుకొని ప్రయోజకులు అయ్యారని గుర్తు చేశారు.చరిత్ర కలిగిన వసతి గృహాన్ని పాలకులు విస్మరించడం విడ్డూరమన్నారు. ఈ సందర్భనలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్,మండల కార్యదర్శి జక్కుల రమేష్ యాదవ్,కమిటీ సభ్యులు దండిగారి సతీష్,వడ్లూరి కిషోర్,కన్నం సదానందం,రావుల ఓదెలు,శ్రీనివాస్, మహేష్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

## జీఎం కార్యాలయాల ఎదుట ధర్నా విజయవంతం చేయాలి

**సింగరేణి కార్మిక జేఏసీ పిలుపు**

**8వ కాలనీ:** సింగరేణిలోని అన్ని జీఎం కార్యాలయాల ఎదుట సోమవారం నిర్వహించనున్న ధర్నాను కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కార్మిక జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం 8వ కాలనీలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్ నాయకులు మాట్లాడారు. బొగ్గు గని కార్మికుల 11వ వేతన ఒప్పందం జూన్ 30, 2026తో ముగిసిందని తెలిపారు. కార్మికుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కేంద్రం తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లతో కార్మికుల హక్కులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర ఉప ప్రధాన కార్యదర్శి వై.వి.రావు, బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొత్త సత్యనారాయణరెడ్డి, సీఐటీయూ బ్రాంచ్ కార్యదర్శి కుంట ప్రవీణ్, అన్నారావు, సామ్సన్, రవికుమార్, మహేందర్, నారాయణ, కుమారస్వామి, అనిల్‌కుమార్, అక్రమ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

## రూ.1.10 కోట్లతో ఇండస్ట్రియల్ పార్క్ చుట్టూ ఫెన్సింగ్



**రామగిరి, ఆగస్టు 09 (జనంసాక్షి) :** రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని మేడిపల్లి-రామగిరిఖిల్లా శివారులో ప్రతిపాదించిన ఇండస్ట్రియల్ పార్క్‌కు భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. రత్నాపూర్ గ్రామానికి చెందిన రైతుల నుంచి పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూములు కలిపి సుమారు 280 ఎకరాల భూమిని సేకరించారు. ఈ ప్రాంతంలో పలు పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఈ నెల 3న ప్రాంతాన్ని సందర్శించారు. ఇండస్ట్రియల్ పార్క్‌కు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో భాగంగా భూమి చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి. ఫెన్సింగ్ నిర్మాణ పనులకు ప్రభుత్వం రూ.1.10 కోట్ల నిధులు కేటాయించింది. హైదరాబాద్‌కు చెందిన సివిజన్ కంపెనీ టెండర్ దక్కించుకుని పనులను చేపడుతోంది. శ్రీరామ్‌సాగర్ కాలువ నుంచి పల్లె ప్రకృతి వనం వరకు సుమారు 500 మీటర్ల మేర ప్రీకాస్ట్ వాల్ నిర్మించనున్నారు. అదేవిధంగా ఇండస్ట్రియల్ పార్క్ చుట్టూ సుమారు ఆరు కిలోమీటర్ల మేర ఐదు వరుసల వైర్లతో ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నారు. ఇండస్ట్రియల్ పార్క్‌కు నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం పట్ల రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమ పీవీ రావు హర్షం వ్యక్తం చేశారు. ఫెన్సింగ్ నిర్మాణంతో పార్క్ భూములకు రక్షణ కలగడంతో పాటు భవిష్యత్‌లో పరిశ్రమల ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు.

# ప్రజాభివృద్ధికిపాటుపడే ఎమ్మెల్యే దొరకడం అదృష్టం

- జాబ్ మేళా ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి
- మెగా జాబ్ మేళాలో సీపీ సాయి చైతన్య
- రెండున్నర వేలకుపైగా నిరుద్యోగులు హాజరు
- ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 9 (జనంసాక్షి) :** ప్రజాభివృద్ధికి పాటుపడే ఎమ్మెల్యే దొరకడం నిజామాబాద్ యువత అదృష్టమని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీరామ గార్డెన్ లో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ సాయి చైతన్య మాట్లాడుతూ... ఇంత పెద్ద మొత్తంలో జాబ్ మేళా నిర్వహించటం అభినందనీయమన్నారు. రాజకీయంతో పాటు ప్రజల అభివృద్ధికి పాటుపడే వారు అరుదుగా ఉంటారన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నాలజీని వినియోగించుకొని ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కానీ అదే టెక్నాలజీకి వ్యసనం కాకూడదని సూచించారు. ఉద్యోగాలు రానివాళ్లు నిరాశ చెందకుండా మరింత ప్రయత్నించాలన్నారు. ప్రస్తుత ప్రయత్నాన్ని అనుభవంగా పొంది భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిదుకోవాలన్నారు. ఇందూరు యువతలో ఎంతో ప్రతిభ దాగి ఉంది, వారి ప్రతిభకు అవకాశం కల్పించడం కోసం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ స్పష్టం చేశారు. ఇందూరు భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి పిల్లల్ని చదివిస్తారని, తన బిడ్డ మంచి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడాలనేది వారి కోరిక అన్నారు. యువతకు ఉద్యోగం కల్పించడం అంటే కేవలం ఒక వ్యక్తికి ఉద్యోగం ఇవ్వడం కాదని ఒక కుటుంబానికి భరోసా ఇవ్వడం అని స్పష్టం చేశారు. యువతకు సరైన వేదిక దొరకడం లేదని ఆ సమస్యను దృష్టిలో పెట్టుకొని 70కి పైగా కంపెనీలను ఒకే వేదిక పైకి తీసుకోవచ్చామని తెలిపారు. ఇంటర్వ్యూలకు వెళ్లినప్పుడు భయపడకుండా తమపై నమ్మకం పెట్టుకోవాలన్నారు. యువత ఉద్యోగాల కోసం తప్పనిసరిగా హైదరాబాద్కి ఇతర నగరాలకు వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలన్నారు. నిజామాబాదులో అవకాశాలు పెరగాలని అదే తన లక్ష్యమని పేర్కొన్నారు. నిజామాబాద్ ను ఐటీ హబ్ గా మార్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తున్నానన్నారు ఇటీవల ఐటీ శాఖామంత్రి శ్రీధర్ బాబును కలిసి పలు ప్రతిపాదనలు అందజేయడం జరిగిందన్నారు. త్వరలోనే నిజామాబాద్ ను ఐటీ హబ్ గా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో యువతకు తోడుగా నిలుస్తామని చెప్పారు. జాబ్ మేళాకు సుమారు రెండున్నర వేలకుపైగా అభ్యర్థులు హాజరయ్యారు. అనంతరం ఆయా కంపెనీలో ఎంపికైన అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మేయర్ ఉమారాణి, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బెల్లాల్ శశాంక్, మఠం పవన్, శ్రవణ్, పసునూరి రాము, ప్రసూన శ్రీనివాస్, ఎర్రం సుధీర్, జగదీష్ కులకర్ణి, బంటు రాము, బంటు ప్రీతి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గుంతలమయం.. గోసపడుతున్న ప్రయాణికులు

- పెద్ద పెద్ద గుంతలతో ప్రమాదకరంగా మారిన ఆవరణ
- బస్సులు వస్తుంటేనే భయపడుతున్న జనం
- పట్టించుకోని ఇబ్రహీంపట్నం డిపో అధికారులు



**యాచారం, ఆగస్టు 9(జనం సాక్షి) :** యాచారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ ఇప్పుడు పూర్తిగా గుంతలమయంగా మారింది. గతంలో బురద సమస్యతో అల్లాడిన ప్రయాణికులకు, ఇప్పుడు రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు ప్రాణసంకటంగా పరిణమించాయి. బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చే సమయంలో ఈ గుంతల వల్ల వాహనాలు భారీగా ఊగుతూ వస్తుండటంతో ప్రయాణికులు భయాందోళనలకు గురవుతున్నారు. కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా రోడ్డంతా కొట్టుకుపోయి, కంకర తేలి ప్రమాదకరంగా తయారైంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈ గుంతలు కనిపించక మహిళలు, వృద్ధులు, పాఠశాల విద్యార్థులు కిందపడి గాయాలపాలవుతున్నారు. బస్టాండ్ నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసిన ఇబ్రహీంపట్నం డిపో అధికారుల తీరుపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, తాత్కాలిక ప్యాచ్ వర్క్‌లు కాకుండా బస్టాండ్ ఆవరణలో శాశ్వతంగా సిమెంట్ రోడ్డు నిర్మించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# సొమ్ము ఒకరిది.. సోకు ఒకరిది..

- రాష్ట్ర ప్రభుత్వం నిధులతోనే కరీంనగర్
- అభివృద్ధి చెందుతుందని గొప్పలు చెప్పుకోవడం సరికాదు
- డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు




**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వ నిధుల వల్లే కరీంనగర్ నగరం అభివృద్ధి చెందుతుందని తెలిసి, తెలియని కొంతమంది నాయకులు గొప్పలు చెప్పుకోవడం హాస్యస్పందంగా ఉందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు మండిపడ్డారు. ఈ సందర్భంగా వారు కరీంనగర్ లో ఆదివారం ఎస్బిఎస్ ఫంక్షన్ హాల్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నాయకులపై ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి దాదాపు 3 సంవత్సరాలు గడుస్తున్న, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సంబంధించిన మంత్రులు, శాసనసభ్యులు కరీంనగర్ నగర అభివృద్ధికి గానీ, జిల్లా అభివృద్ధికి గాని నయాపైసా తెచ్చింది లేదని తేల్చి చెప్పారు. సొమ్ము ఒకరిది..సోకు ఒకరిది అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులతోనే కరీంనగర్ అభివృద్ధి చెందుతుందని గొప్పలు చెప్పుకోవడం చాలా విడ్డూరమని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నుండి కొత్తగా 4 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిన, కరీంనగర్ అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించలేదని స్పష్టం చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మంత్రులు, శాసనసభ్యులు కరీంనగర్ అభివృద్ధి కొసం ప్రతేకంగా ఒక పథకాన్ని రూపకల్పన చేసి, రాష్ట్ర ప్రభుత్వం నుండి వెయ్యి, రెండువేల కోట్ల రూపాయలు తీసుకొస్తే మా పాలకవర్గం మొత్తం ప్రత్యేక స్వాగతం పలికి గౌరవంగా పెద్దఎత్తున పౌర సన్మానం చేస్తామని తెలిపారు. కరీంనగర్ నగర అభివృద్ధి కోసం ఇప్పటివరకు చేపట్టిన స్మార్ట్ సిటి ప్రాజెక్టుతో మొదలు కొని, అమృత్ 1, 2, యూఐడిఎఫ్, ఆర్వోబి, సిఆర్ఎఫ్, యూసిఎఫ్ అన్ని కూడ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలే అని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం వివిధ రాష్ట్రాల్లో టైప్ 2, టైప్ 3 లో లక్ష నుండి 10 లక్షల జనాభా గల నగరాలను అభివృద్ధి చేయాలనే సంకల్పంలో భాగంగా సంబంధిత పథకాలను ప్రవేశ పెట్టిందని స్పష్టం చేశారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ఫండ్ లో కేంద్ర ప్రభుత్వం వాటా 50 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా 50 శాతం అయితే ఒక్క రూపాయి అప్పు ఎక్కడ లేదని తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టు 46 అభివృద్ధి పనుల్లో 41 ప్రాజెక్టుల పనులు పూర్తిచేయడం జరిగిందని తెలిపారు. అమృత్ పథకం రెండు విడతల్లో 274 కోట్లు మూడవ విడుతలో మరో 80 కోట్లు తీసుకురావడం జరిగిందని తెలిపారు. అర్బన్ చాలేంజ్ ఫండ్ స్కీం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చొరవతో 840 కోట్లు కరీంనగర్ నగర అభివృద్ధి కోసం తీస్కరావడం జరిగిందని తెలిపారు. గతంలో గాని ప్రస్తుతం గానీ కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి ప్రత్యేకంగా ఏ పథకం ద్వారా నిధులు తెచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రైల్వేస్టేషన్ అభివృద్ధికి లో ఒక్క రూపాయి రాష్ట్ర ప్రభుత్వంది లేదన్నారు. సి ఆర్ ఎఫ్ కింద వందల కోట్లు నిధులు కేంద్ర ప్రభుత్వం ద్వారా బండి సంజయ్ కుమార్ చొరవతో వచ్చాయని స్పష్టం చేశారు. కరీంనగర్ నగర అభివృద్ధికి ప్రత్యేక పథకం ద్వారా నిధులు తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లు గాజ రామా-శివరాం, బండ రమణారెడ్డి, ఎన్నం లక్ష్మి-ప్రకాష్, కొంపెల్లి శ్వేత-రామణ్, పొన్నం లక్ష్మి-మొండయ్య గౌడ్, కొలిపాక రమ్య-శ్రీనివాస్, బీజేపీ నాయకులు కుంభం అనిల్, పండుగ నాగరాజ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువ కవుల అక్షర యుద్ధం



**కరీంనగర్ టౌన్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువ కవులు తమ కవితల ద్వారా అక్షర యుద్ధం చేశారు. తెలంగాణ రచయితల సంఘం కరీంనగర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యువ కవి సమ్మేళనం 'యుద్ధం మొదలైంది' కార్యక్రమంలో పలువురు యువ కవులు పాల్గొని మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కవితలు వినిపించారు. సంఘం అధ్యక్షుడు కొత్త అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ సౌభాగ్యాన్ని కాపాడే బాధ్యత యువతపై ఉందన్నారు. నవభారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలని, నగర అభివృద్ధికి వారి సలహాలు, సూచనలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వ్యతిరేక చైతన్యం కోసం తెలంగాణ రచయితల సంఘం చేపట్టిన కార్యక్రమాన్ని అభినందించారు. విశిష్ట అతిథిగా శాతవాహన యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. పి. సతీష్‌కుమార్ మాట్లాడుతూ యువ సాహిత్యం కొత్త ఆలోచనలకు వారధిగా నిలుస్తుందన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా కవులంతా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో దొమ్మాటి శంకర్ నివేదిక అందించగా, సంయుక్త కార్యదర్శి కాందూరి వెంకటేశ్వర్లు కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. బీవీఎన్ స్వామి, కేఎస్ అనంతాచార్య, గుర్రాల మాధవ్, నీలగిరి అనిత, తుమ్మల సాయి చరణ్, శ్రీకర్, గొర్రె అనిల్, సుగుణ, అనుష, బొమ్మకంటి కిషన్, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో మేయర్, నాయకులు



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 9 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని పలు డివిజన్లలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, ఇతర నాయకులు పాల్గొన్నారు. ఆదివారం రోజు హౌసింగ్ బోర్డ్ కాలనీ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కరీంనగర్ ఎమ్మెల్యే కాంటెస్ట్ అభ్యర్థి పురుమళ్ళ శ్రీనివాస్ లు ముఖ్య అతిధులుగా విచ్చేసారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, మేయర్ కొలగాని శ్రీనివాస్, కరీంనగర్ ఎమ్మెల్యే కాంటెస్టెంట్ అభ్యర్థి పురుమళ్ళ శ్రీనివాస్ లు అమ్మవారికి బోనం ఎత్తుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ ఆధ్యాత్మిక వైభవాన్ని ప్రతిబింబించే బోనాల ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ బోర్డ్ కాలనీలోని మున్నూరు కాపు మహిళలు పెద్ద ఎత్తున బోనాలు తీసుకుని వచ్చి డప్పు చప్పులు, డీజే తో ఊరేగింపు గా వెళ్లి హౌసింగ్ బోర్డ్ కాలనీ చివరులోని పోచమ్మ గుడిలో బోనాలు సమర్పించి యాటను చెల్లించి పండగ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్, నాయకులు, ఆకుల ప్రకాష్ , కర్ర రాజశేఖర్, నలువాల రవీందర్, వాసాల హరీష్, పసుల చరణ్, ప్రశాంత్ దీపక్, కాపు సంఘం నాయకులు నలువాల రాజేందర్, తోట రాజేందర్, గుండా సతీష్ , ఆకుల సుదర్శన్, కటకం రమేష్, తోట సాగర్, నర్సింగ్, గుర్రాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కార్పోరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న ప్రధాని

- రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం గాడితప్పకుండా సీఎం రేవంత్ జాగ్రత్త పడాలి..
- ప్రచార జాతలో సిపిఐ జాతీయ నేత,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి...



**చిగురుమామిడి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** దేశాన్ని అప్పులపాలు చేసి,కార్పొరేట్, పెట్టుబడిదారులకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కొమ్ముకొస్తున్నారని నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నట్టేట ముంచుతున్నారని,సిపిఐ జాతీయ నేత మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గత 4రోజులుగా నిర్వహిస్తున్న సిపిఐ ప్రచార జాతా మండల కార్యదర్శి నాగేల్లి లక్ష్మారెడ్డి అధ్యక్షతన చిగురుమామిడి మండల కేంద్రంతో పాటు రేకొండ, పీచుపల్లి, ముల్కనూర్, సీతారాంపూర్, లంబాడిపల్లి, ఇందుర్తి, గాగిరెడ్డిపల్లి, ఓగులాపూర్, ముదిమాణిక్యం, రామంచ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం హయంలో దేశం అప్పుల ఊబిలోకి కోరుకుపోవడానికి ప్రధాని నరేంద్ర మోడీ విధానాలే కారణమని, సామాన్యులపై ధరల భారం వేస్తున్న బీజేపీ పాలనకు రానున్న రోజుల్లో చరమ గీతం పాడాలన్నారు. రాష్టంలో కాంగ్రెస్ ప్రభుత్వం గాడి తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జాగ్రత్త పడాలన్నారు. బీజేపీ ప్రభుత్వం సామాన్య ప్రజలపై రోజు రోజుకు పెనుభారం మోపుతుందని, విచ్చల విడిగా వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు,నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతుందని,ధరలు పెరగడం వల్ల ప్రజల జీవనప్రమాణలు దెబ్బతిన్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలిగించేందుకు ధరల పెరుగదలపై సిపిఐ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తూ,దేశ వ్యాప్తంగా యాత్రలు చేస్తున్నామన్నారు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న ఛలో ఢిల్లీ కార్యక్రమం పిలుపునిచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్,నియోజకవర్గ కన్వీనర్ జాగీరీ సత్యనారాయణ,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి,పొనగంటి కేదారి,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి,జాతా కోఆర్డినేటర్ లు గూడెం లక్ష్మీ,కసిరెడ్డి సురేందర్ రెడ్డి,బోయిని అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్ రెడ్డి,అందె చిన్నస్వామి, బోయిని వల్లభాయ్ పటేల్, కాంతాల శ్రీనివాస్ రెడ్డి,తేరాల సత్యనారాయణ, ముద్రకోల రాజయ్య,మావురపు రాజు,మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శి బీర్ల పద్మ,కొట్టె అంజలి,ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బామండ్ల పెల్లి యుగేందర్,నర్రావుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం యువతకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి
- ఎంఆర్ఆర్ ఫౌండేషన్ ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ




**రంగారెడ్డి, ఆగస్టు 9(జనంసాక్షి) :** నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిలో ఆదర్శంగా నిలబెట్టడంతో పాటు, ఇక్కడి యువతను ఉన్నత స్థాయికి చేర్చడమే తన ప్రధాన సంకల్పమని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. జీవితంలో ఎదుగుదలకు యువత వేసే ప్రతి అడుగులో తమ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆయన భరోసానిచ్చారు. స్థానిక నియోజకవర్గ యువత కోసం మల్ రెడ్డి యువశక్తి, ఎంఆర్ఆర్ ఫౌండేషన్ నేతృత్వంలో పోలీస్ ఉద్యోగాల అభ్యర్థుల కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్ అంతా యువత చేతుల్లోనే ఉందని తెలిపారు. వారు సరైన మార్గంలో పయనిస్తేనే దేశం అన్ని విధాలా అభివృద్ధి సాధిస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఇక్కడి యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిపారు. మల్ రెడ్డి అభిషేక్ రెడ్డి సారథ్యంలో చేపట్టిన ఈ ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని పోలీస్ ఉద్యోగ అభ్యర్థులంతా సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పోలీస్ నోటిఫికేషన్లు, పోస్టుల విషయమై అభ్యర్థులు ఆందోళన చెందవద్దని, ఈ అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా ప్రక్రియ ముందుకు వెళ్లేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రాజు, సీఐ మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్ రెడ్డి, నాయకులు మహిపాల్, పాండురంగారెడ్డి, ఈసీ శేఖర్ గౌడ్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కరాచారి, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కౌన్సిలర్లు, ఫిజిక్స్ ఫ్యాకల్టీ రమేశ్ తదితర ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# బోల్తా పడిన బోటు.. తప్పిన ముప్పు?

- పర్యాటకుల తాకిడి..భద్రత గాలికి..?
- కోటపల్లి ప్రాజెక్టులో భార్యాభర్తలకు తప్పిన ప్రమాదం
- లైఫ్‌గార్డుల చొరవతో సురక్షితం



**ధారూర్ ఆగస్టు 09(జనంసాక్షి) :** కోట్‌పల్లి ప్రాజెక్ట్ కు ఆదివారం పర్యాటకుల తాకిడితో సందడిగా మారిన కోటపల్లి ప్రాజెక్టులో బోటు బోల్తా పడిన ఘటన కలకలం రేపింది. బోటులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. లైఫ్‌గార్డులు సకాలంలో స్పందించి వారిని రక్షించడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో పర్యాటకుల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బోటు బోల్తా పడటంతో పర్యాటకుల కారు తాళం నీటిలో పడిపోయింది. దీంతో తాళం కోసం వారు కొంతసేపు అవస్థలు పడ్డారు. ప్రమాదం నుంచి బయటపడినప్పటికీ ఈ ఘటనతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. కోటపల్లి ప్రాజెక్టులో గతంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. అప్పట్లో జరిగిన ఘటనను స్థానికులు, పర్యాటకులు గుర్తుచేసుకుంటున్నారు. తాజాగా బోటు బోల్తా పడటంతో ప్రాజెక్టు వద్ద భద్రతా చర్యలపై మరోసారి చర్చ మొదలైంది. కోటపల్లి ప్రాజెక్టుకు పర్యాటకుల తాకిడి రోజురోజుకూ పెరుగుతోంది. సెలవు రోజుల్లో పెద్ద సంఖ్యలో సందర్శకులు తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో బోటింగ్ నిర్వహణ,లైఫ్‌జాకెట్ల వినియోగం,బోట్ల సామర్థ్యం, లైఫ్‌గార్డుల పర్యవేక్షణ వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పర్యాటకులు అంటున్నారు. ఏదైనా పెను ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు వద్ద పర్యాటకుల భద్రతకు మరిన్ని చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. బోటింగ్ ప్రాంతంలో నిబంధనలు కఠినంగా అమలు చేయడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. 'లైఫ్‌జాకెట్లు ధరించారు. అందుకే ప్రమాదం తప్పింది' అని కోటపల్లి బోటు బోల్తా ఘటనపై నిర్వాహకుడు రాములు వివరణ ఇచ్చారు. "ఇది పెద్ద ఇష్యూ కాదు"అంటూ వ్యాఖ్యానించడం కొసమెరుపు.







# జనంసాక్షి 16వ వార్షికోత్సవం
## ప్రత్యేక అనుబంధం

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
10 ఆగస్టు 2026




































Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist. Telangana 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor, Pavani Estate, Indradhanush Complex, Road No. 2, Banjara Hills, Hyderabad-500034, Telangana, Editor: M.M.RAHMAN RNI No. APTEL/2013/50370